www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

పాక్‌కు అమెరికా క్షిపణులు

అత్యాధునిక ఏఐఎమ్-120ల విక్రయానికి ఒప్పందం ఖరారు!

క్షిపణుల అమరికకు వీలుగా ఎఫ్-16లను ఆధునీకరించనున్న అమెరికా

బాలాకోట్‌పై దాడులకు ప్రతీకారంగా ఈ మిసైల్స్‌తోనే నాడు పాక్ ప్రతిదాడి

ఇప్పుడు భారీగా సమకూర్చుకునే యత్నం.. డాన్ పత్రిక కథనం



2

గురువారం | 9-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 174 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం, తిథి: తదియ రా.10:55 తదుపరి చవితి, నక్షత్రం: భరణి రా.8:02 తదుపరి కృత్తిక, వర్జ్యం: ఉ.7:15-8:40, దుర్ముహూర్తం: ఉ.10:05-10:51, మ.2:46-3:33, అమృతఘడియలు: మ.3:46-5:11, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 6:10, సూర్యాస్తమయం: 5:54 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పెట్టుబడుల ధమాకా

రూ.87,520 కోట్లతో విశాఖలో ఏఐ డేటా సెంటర్

రాష్ట్రానికి తొలి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి

గూగుల్ అనుబంధ సంస్థ 'రైడెన్'కు రైట్‌రైట్

ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశం

మొత్తం 1,14,824 కోట్ల పెట్టుబడులకు ఆమోదం

వీటితో 67,218 మందికి ఉద్యోగావకాశాలు

ఐటీ, ఇంధన, ఫుడ్‌ప్రాసెసింగ్ ప్రాజెక్టులకు ఓకే

మహారాష్ట్రకు ముంబై ఒక్కటే.. మనకు 3 హబ్‌లు

విశాఖ, అమరావతి, తిరుపతి హబ్‌లపై ఫోకస్

3 ప్రాంతాలూ పారిశ్రామిక జోన్లుగా అభివృద్ధి

మంత్రి లోకేశ్ ప్రతిపాదన.. సీఎం సమ్మతి

శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరి దాకా విశాఖ ఎకనామిక్ రీజియన్

ఉమ్మడి పశ్చిమ నుంచి ప్రకాశం వరకు ఇంకోటి

నెల్లూరు, సీమ జిల్లాలతో మరో జోన్



ఎస్ఐపీబీ సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రులు అచ్చెన్న, లోకేశ్, భరత్, నారాయణ, అనగాని తదితరులు

అమరావతి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రకు మొదటి సారి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ) రానుంది. విశాఖలో భారీ స్థాయిలో రూ.87,520 కోట్ల పెట్టుబడితో వెయ్యి మెగావాట్ల సామర్థ్యం కలిగిన కృత్రిమ మేధ డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ చేసిన ప్రతిపాదనను రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఆమోదించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో బుధవారం జరిగిన 11వ ఎస్ఐపీబీ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, కె.అచ్చెన్నాయుడు, పి.నారాయణ, టీజీ భరత్, కందుల దుర్గేశ్, బీసీ జనార్దన్‌రెడ్డి, వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు పాల్గొన్నారు. దాదాపు మూడు గంటలు జరిగిన భేటీలో పెట్టుబడులకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రూ.1,14,824 కోట్ల పెట్టుబడులతో .. 67,218 మందికి ఉద్యోగాలు కల్పించే ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. మహారాష్ట్రకు ముంబై ఒక్కటే ఎకనామిక్ హబ్‌గా ఉంటే..

మిగతా 14వ పేజీలో...

రూ.104 కోట్లతో క్వాంటమ్ హబ్ భవనం

12

అమరావతిలో నిర్మాణానికి ఆమోదం

24న రాష్ట్రానికి ఫ్యూజీ టెక్ ప్రతినిధులు

పెట్టుబడులపై పరిశ్రమల శాఖతో చర్చలు

సీఆర్డీఏ భవనం సిద్ధం

13న సీఎం చేతుల మీదుగా ప్రారంభం

3.07 లక్షల చ. అ. విస్తీర్ణంలో భవనం

257 కోట్ల ఖర్చుతో జీప్లస్ 7గా నిర్మాణం



సీఆర్డీఏ భవనం

రాజధానిలో రాజ్‌భవన్

రూ.212 కోట్లతో నిర్మాణానికి సీఆర్డీఏ అథారిటీ ఆమోదం

14



పీపీపీతో తప్పేంటి?

నిధుల్లేనప్పుడు మెడికల్ కాలేజీలు కట్టాలంటే ఏళ్లు పడుతుంది

డబ్బుల్లేకనే ప్రభుత్వ-ప్రైవేటు పద్ధతిలో చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు

పాలనా అనుమతులివ్వగానే సరా?

కాలేజీల నిర్మాణానికి నిధులేవీ?

డబ్బు కొరతతో జిల్లాల్లో కోర్టు భవనాల నిర్మాణమూ ఆగిపోయింది

కట్టితీరాలని సర్కారుపై ఒత్తిడి తేలేం కదా!

టెండర్ల ఖరారుపై స్టే విధించలేం

మధ్యంతర ఉత్తర్వులివ్వలేం: హైకోర్టు

అమరావతి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 10 మెడికల్ కాలేజీలు, వాటికి అనుబంధంగా ఉండే ఆస్పత్రులను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో నిర్మించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో తప్పేముందని హైకోర్టు ప్రశ్నించింది. నిధుల కొరత కారణంగా ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని వ్యాఖ్యానించింది. నిధులు లేనప్పుడు కాలేజీలు, ఆస్పత్రుల నిర్మాణం ప్రభుత్వమే చేయాలంటే ఏళ్లు పడుతుందని పేర్కొంది. నిధుల కోసం ఆసియా అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ)నో, మరొకరినో ఆశ్రయించాల్సి ఉంటుందని తెలిపింది. నిధుల లేమి కారణంగా జిల్లాల్లో కోర్టు భవనాల నిర్మాణం సైతం ఆగిపోయిందని గుర్తు చేసింది. నిధుల లభ్యత లేనప్పుడు కోర్టు భవనాలు కట్టితీరాలని తాము ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయలేం కదా

మిగతా 12వ పేజీలో...



12

పిల్లర్ల దశకే పరిమితమైన మెడికల్ కాలేజీ మూడో బ్లాక్

ఇది చూసేందుకే జగన్ రాక!

మాకవరపాలెంలో 'మెడికల్ కాలేజీ'

తాను సీఎంగా ఉండగానే నిలిచిపోయిన పనులు

బాణసంచా పేలుడుకు ఏడుగురు బలి

కోనసీమ జిల్లా రాయవరంలో విషాదం.. మృతుల్లో తయారీ కేంద్రం యజమాని



మంటల్లో కాలిపోతున్న బాణసంచా తయారీ కేంద్రం

దీపావళి ఆర్డర్ల కోసం పనులు చేస్తుండగా నిప్పురవ్వలు ఎగిసిపడి పేలుళ్లు

అరుగురు అక్కడికక్కడే సజీవ దహనం

చికిత్స పొందుతూ మరో కూలీ మృతి

మృతుల్లో నలుగురు మహిళా కూలీలూ..

బాధాకరం: మోదీ.. ఆదుకుంటాం: పవన్

అమలాపురం/మండపేట/రాయవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలోని బాణసంచా తయారీ కేంద్రంలో బుధవారం భారీ విస్ఫోటనం సంభవించింది. దీపావళి ఆర్డర్ల కోసం పనిచేస్తున్న ఏడుగురు కూలీలు సజీవ దహనమయ్యారు. పండగ దగ్గర పడటంతో

మిగతా 14వ పేజీలో...

ఆ దివ్వెల వెనుక చీకటి!

తయారీ కేంద్రాల్లో బతుకులు బుగ్గి

దీపావళికి తరచూ ప్రమాదాలు

'తూర్పు'లో ఏటా 40 మంది బలి

ప్రమాదాల్లో అధికంగా చనిపోతోంది మహిళలు, పిల్లలే



పేలుడు జరిగిన గోదాములో శిథిలాలు



నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం ఫేజ్-1 ప్రారంభోత్సవంలో అదానీతో ప్రధాని మోదీ

26/11 దాడుల తర్వాత పాక్‌పై ఎందుకు దాడి చేయలేదు?

సైనిక చర్య వద్దనే నిర్ణయం ఎవరిది?

ప్రజలకు కాంగ్రెస్ చెప్పాల్సిందే

ప్రధాని మోదీ డిమాండ్

చిదంబరం వ్యాఖ్యల నేపథ్యంలో ధ్వజం

నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన ప్రధాని

కప్పు టీ కంటే 1జీబీ డేటా చవక

పెట్టుబడులకు స్వర్గధామం భారత్

ఇండియా మొబైల్ కాంగ్రెస్ సదస్సు ప్రారంభోత్సవంలో మోదీ

న్యూఢిల్లీ, అక్టోబరు 8: కాంగ్రెస్ పార్టీపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ముంబైలో 26/11 ఉగ్రదాడుల తర్వాత పాకిస్థాన్‌పై భారత్ సైనిక చర్య ఎందుకు చేపట్టలేదో కాంగ్రెస్ పార్టీ చెప్పాలని బుధవారం డిమాండ్ చేశారు. ఓ విదేశీ శక్తి నుంచి వచ్చిన

మిగతా 2వ పేజీలో...

నకిలీకి నాడే నాంది

జగన్ జమానాలోనే నకిలీ మద్యం తయారీ మొదలు

కొవిడ్ సమయంలోనే దానికి ఊతం

అప్పట్లో మద్యం ధరలు అమాంతం పెంచిన జగన్

నకిలీ వైపు అక్రమార్కుల బాట.. భారీగా లాభాలు

అదే సమయంలో పెరిగిన గంజాయి విక్రయాలు

రాష్ట్రంలో చాపకింద నీరులా 'మత్తు' విస్తరణ

నకిలీ మద్యంపై ఉక్కుపాదం మోపండి

రాష్ట్రంలో ఆ మద్యం ఎక్కడా కనిపించకూడదు

తయారీదారులను ఏమాత్రం ఉపేక్షించొద్దు

మద్యంపై ఫేక్ ప్రచారాన్ని తిప్పికొట్టండి

పోలీసు, ఎక్సైజ్ శాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు



(అమరావతి-ఆంధ్రజ్యోతి) ప్రస్తుతం రాష్ట్రంలో కలకలం రేపుతున్న నకిలీ మద్యం అక్రమాలన్నింటికీ తెరలేచింది జగన్ జమానాలోనే. నకిలీ మద్యం మొదలైంది.. తయారు చేయడానికి పరిస్థితులు ఉత్పన్నమైనది.. గ్రామ స్థాయికీ గంజాయి విస్తరించింది కూడా వైసీపీ హయాంలోనే. జగన్ సర్కారు పోయినా నాటి దుష్పరిణామాలు ఇప్పటికీ వెంటాడుతున్నాయి. అంతకుముందు రాష్ట్రంలో మహా అంటే నాటుసారా ప్రభావం మాత్రమే కనిపించేది. అలాంటిది నకిలీ మద్యంతో పాటు గ్రామస్థాయికి గంజాయిని తీసుకెళ్లిన ఘనత గత జగన్ సర్కారుదే. కొవిడ్ సమయంలో ఎలాంటి ముందస్తు ఆలోచనా లేకుండా అడ్డగోలుగా మద్యం ధరలు రెట్టింపు చేశారు. దీంతో లాక్‌డౌన్ సమయంలోనే

మిగతా 13వ పేజీలో...

ప్లాన్ జనార్దనరావుది

నకిలీ మద్యం తయారీ, అమ్మకాలు, వాటాల పంపిణీ బాధ్యత కట్టారాజుది

జయచంద్రారెడ్డికి మద్యం సొమ్ములో వాటా

ఆయన ఇంట్లో పనిచేసే వ్యక్తికి అందజేత

చదువుకునే సమయం నుంచే జనార్దనరావుతో కొడాలి శ్రీనుకు స్నేహం


ములకలచెరువు నకిలీ మద్యం కేసులో కొత్తగా ఏడుగురు నిందితులు

ఇబ్రహీంపట్నంలోనూ 'నకిలీ' యూనిట్

మూడు నెలలుగా నకిలీ మద్యం తయారీ

జనార్దనరావు బార్, భాగస్వామిగా ఉన్న బెజవాడలోని శ్రీనివాస వైన్స్‌లో అమ్మకాలు

'ఎక్సైజ్' రిమాండ్ రిపోర్టుల్లో వెల్లడి



హైదరాబాద్-విజయవాడ హైవే విస్తరణకు 10వేల కోట్లు

ఆందోల్ మైసమ్మ గుడి నుంచి విజయవాడ కనకదుర్గమ్మ గుడి దాకా

ఆరు లేన్ల వెడల్పు.. 231.32 కిలోమీటర్ల పొడవుతో హైవే విస్తరణ

ఒక్కో కి.మీ.కి 44.92 కోట్ల వ్యయం

ప్రాథమిక డీపీఆర్‌లో వెల్లడి

నవంబరులో తుది డీపీఆర్.. మార్చికి టెండర్లు

హైదరాబాద్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(ఎన్‌హెచ్-65)ని 6 వరుసలుగా విస్తరించేందుకు డీపీఆర్ తయారీని నవంబరు మొదటి లేదా రెండో వారంలోగా పూర్తి చేయాలని తెలంగాణ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. డీపీఆర్‌ను నవంబరులో పూర్తిచేసి, మార్చి నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి, నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలోనే.. మంగళవారం తెలంగాణ రోడ్లు-భవనాల శాఖ, ఎన్‌హెచ్‌ఏఐ ఉన్నతాధికారులు పలు ప్రభుత్వశాఖలతో కీలక సమావేశం నిర్వహించారు. రహదారి విస్తరణ కోసం మార్గ మధ్యలో ఎన్ని విద్యుత్ లైన్లు, స్తంభాలు, చెట్లను తొలగించాల్సి వస్తోంది, రైల్వే క్రాసింగ్‌లు, కొత్తగా

మిగతా 12వ పేజీలో...

రాష్ట్ర, జిల్లా ప్రధాన రోడ్లకు వెయ్యి కోట్లు

రహదారులపై ప్రభుత్వ హామీ అమల్లోకి

పనుల కోసం పరిపాలనా అనుమతులు

ముగ్గురు శాస్త్రవేత్తలకు రసాయనశాస్త్ర నోబెల్

ఎంవోఎఫ్‌లను అభివృద్ధి చేసిన సుసుము కిటగావా, రిచర్డ్ రాబ్సన్, ఒమర్ ఎం యాఘీలకు సంయుక్తంగా..

వాయువుల నిల్వ, ఎడారి గాలుల నుంచి నీటి సంగ్రహణలో ఎంవోఎఫ్‌లు కీలకం

2

కుల వివక్షకు దళిత ఐపీఎస్ బలి

తెలుగువాడైన హరియాణా ఏడీజీపీ పూరన్ కుమార్ ఆత్మహత్య



చండీగఢ్‌లో రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణం

వెంటాడి వేధించిన సీనియర్ అధికారులు

తాజాగా మద్యం కాంట్రాక్టరు ఫిర్యాదుతో నమోదైన లంచం కేసులో కుమార్ పేరు

ఎనిమిది పేజీల సూసైడ్ నోట్ రాసిన ఐపీఎస్

2

కుల వివక్షకు దళిత ఐపీఎస్ బలి

» తెలుగువాడైన హరియాణా ఏడీజీపీ పూరన్ కుమార్ ఆత్మహత్య

» 8 పేజీల సూసైడ్ నోట్ రాసిన ఐపీఎస్

చండీగఢ్, అక్టోబరు 8: హరియాణా పోలీసు శాఖలో కుల వివక్ష తెలుగువాడైన ఓ సీనియర్ దళిత ఐపీఎస్ అధికారి ప్రాణాలు తీసింది. పలువురు సీనియర్ అధికారులు వెంటాడి మానసికంగా వేధించడంతో భరించలేక ఆ ఐపీఎస్ సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఇది హరియాణా ఏడీజీపీ వై పూరన్ కుమార్ విషాదాంతం. మంగళవారం మధ్యాహ్నం చండీగఢ్ సెక్టార్ 11లోని తన బావమరిది నివాస భవనం సౌండ్‌ప్రూఫ్ బేస్‌మెంట్‌లో కుమార్ బలవన్మరణానికి పాల్పడ్డారు. రక్తపు మడుగులో ఉన్న కుమార్ మృతదేహాన్ని ఆయన కుమార్తె గుర్తించింది. పోలీసు శాఖలో కుల వివక్ష సహా పలు అక్రమాలకు వ్యతిరేకంగా గళమెత్తి పోరాడిన కుమార్... పలువురు సీనియర్ అధికారులు పగబట్టి వేధించడం... చివరకు ఓ లంచం కేసులో ఇరికించడంతో బలవన్మరణానికి పాల్పడ్డారు. వారు తనను మానసికంగా ఎలా వేధించిందీ కుమార్ 8 పేజీల సూసైడ్ నోట్‌లో రాశారు

తన కెరీర్‌ను నాశనం చేయడానికి కుట్ర పన్నారని పేర్కొన్నారు. ఆ అధికారులు ఎవరనేది చండీగఢ్ పోలీసులు ఇంకా వెల్లడించలేదు. వారిలో కొందరు రిటైరైన అధికారులు కూడా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ వేధింపులకు తోడు తాజాగా ఓ మద్యం కాంట్రాక్టర్ ఫిర్యాదుతో నమోదైన లంచం కేసులో రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా కుమార్ పేరును కూడా చేర్చారు. ప్రాధాన్యం లేని పోస్టుకు బదిలీ చేశారు. ఈ పరిణామాలతో కుమార్ కలత చెందినట్లు తెలుస్తోంది. కుమార్ పేరు చెప్పి అతని సహాయకుడైన సుశీల్ రూ.2.5 లక్షలు లంచం అడిగాడని ఆ మద్యం కాంట్రాక్టర్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. దాంతో రోహతక్ పోలీసులు ఎఫ్ఐఆర్‌లో కుమార్ పేరును కూడా చేర్చారు. సొంత శాఖలో కుల వివక్ష, అక్రమాలు, అన్యాయాలను నిలదీసిన కుమార్‌ను టార్గెట్ చేసిన సీనియర్ అధికారులు అతన్ని ఇరికించడానికి ఇదే అదనుగా వారు భావించారన్న వాదనలు వినిపిస్తున్నాయి. కుమార్ ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు. 2001 బ్యాచ్ హరియాణా క్యాడర్ ఐపీఎస్ అధికారి. 2008లో ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి వేధింపులపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా దళిత అధికారులపై వివక్షపై ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించారు. తాను ప్రభుత్వానికి సన్నిహితుడినని చెప్పుకున్న ఓ ఐపీఎస్ అధికారికి గత హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో పోస్టింగు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ కూడా ఈసీకి ఫిర్యాదు చేశారు. గతంలో ఐపీఎస్ అధికారుల పదోన్నతుల్లో అక్రమాలపై హరియాణా సీఎం నాయబ్ సింగ్ సైనీకి లేఖ రాశారు. ఉత్తమ సేవలకు రాష్ట్రపతి చేతుల మీదుగా పతకం అందుకున్నారు. పూరన్ భార్య అమనీత్ కుమార్ 2001 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి. ప్రస్తుతం జపాన్‌లో పర్యటిస్తున్న సీఎం సైనీ నేతృత్వంలోని అధికారుల బృందంలో ఆమె కూడా ఉన్నారు.

26/11 దాడుల తర్వాత పాక్‌పై

ఎందుకు దాడి చేయలేదు?

(మొదటిపేజీ తరువాయి)

ఒత్తిడికి తలొగ్గి పాక్‌పై సైనిక చర్య చేపట్టకూడదనే నిర్ణయం తీసుకున్నది ఎవరు? అనేది కూడా దేశ ప్రజలకు చెప్పాలని స్పష్టం చేశారు. ముంబై సమీపంలో రూ.19,650 కోట్ల వ్యయంతో కొత్తగా నిర్మించిన నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం ఫేజ్-1ను, రూ.12,200 కోట్ల వ్యయంతో నిర్మించిన ముంబై మెట్రో లైన్-3(ఫేజ్ 2బీ)ని, ముంబైలోని వేర్వేరు ప్రజారవాణా వ్యవస్థల టికెటింగ్‌కు సంబంధించిన ముంబై వన్ యాప్, మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాని మోదీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ముంబై దాడుల అనంతర పరిణామాలపై కేంద్ర మాజీ మంత్రి చిదంబరం ఇటీవల చేసిన వ్యాఖ్యలను పరోక్షంగా ప్రస్తావిస్తూ కాంగ్రె్‌సపై విరుచుకుపడ్డారు. "2008 ముంబై దాడుల అనంతరం పాక్‌పై దాడి చేసేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉన్నప్పటికీ ఓ దేశం నుంచి ఎదురైన ఒత్తిడి వల్ల నాటి కాంగ్రెస్ ప్రభుత్వం సైన్యాన్ని అడ్డుకుందనే విషయాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ హోం మంత్రి ఒకరు ఇటీవల బయటపెట్టారు. ఓ విదేశీ శక్తి నుంచి ఎదురైన ఒత్తిడికి తలొగ్గి పాక్‌పై దాడి చెయ్యకూడదు అనే నిర్ణయం తీసుకున్నది ఎవరో కాంగ్రెస్ చెప్పి తీరాలి. కాంగ్రెస్ బలహీనత ఉగ్రవాదులను శక్తిమంతులను చేసింది. కాంగ్రెస్ చేసిన తప్పు వల్ల ఎంతోమంది ప్రాణాలను త్యాగం చేస్తూ దేశం మూల్యం చెల్లిస్తూనే ఉంది. దేశ భద్రత విషయంలో కాంగ్రెస్ రాజీ పడింది. కానీ, దేశ రక్షణ, ప్రజల భద్రత మాకు అన్నింటి కంటే ముఖ్యం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశ భద్రత విషయంలో కాంగ్రెస్ రాజీ పడితే తమ హయాంలో శత్రువుల ఇళ్లలోకి చొరబడి మరీ ఉగ్రదాడులకు భారత్ దీటుగా బదులిస్తుందంటూ మోదీ పేర్కొన్నారు. ముంబై దాడుల అనంతరం పాక్‌పై యుద్ధాన్ని ప్రారంభించవద్దని అంతర్జాతీయంగా, ముఖ్యంగా అమెరికా నుంచి నాటి యూపీఏ ప్రభుత్వంపై



నవీ ముంబై విమానాశ్రయం ప్రారంభిస్తున్న మోదీ, ఫడ్నవీస్

ఒత్తిడి వచ్చిందని చిదంబరం ఇటీవల పేర్కొన్నారు. కాగా, అవినీతితో గత ప్రభుత్వం సృష్టించిన అడ్డంకులను అధిగమించి, ఎన్నో ఏళ్ల ఎదురుచూపులకు తెరదించుతూ ముంబైలో మరో అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చిందని ప్రధాని మోదీ అన్నారు. బీజేపీ నేతృత్వంలో గత 11 ఏళ్లలో దేశం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతూనే ఉందన్నారు. 2014లో తాను ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన సమయానికి దేశంలో 74 విమానాశ్రయాలు ఉండగా ఆ సంఖ్య 160 కంటే పెరిగిందన్నారు. ప్రపంచంలోనే మూడో అతి పెద్ద దేశీయ విమానయాన మార్కెట్‌గా భారత్ వృద్ధి చెందిందన్నారు. విమానాల నిర్వహణ, మరమ్మతులు, ఓవర్‌హాలింగ్‌కు 2030 నాటికి భారత్ ప్రపంచానికే కేంద్రంగా మారుతుందని మోదీ ప్రకటించారు. కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం, అండర్ గ్రౌండ్ మెట్రో కారిడార్ ప్రారంభంతో ఆసియాలోనే అతిపెద్ద కనెక్టివిటీ హబ్‌గా ముంబై నిలవనుందని పేర్కొన్నారు. విమానాశ్రయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... ఎన్డీయే ప్రభుత్వ హయాంలో గత 11 ఏళ్లలో దేశంలో 90నూతన విమానాశ్రయాల నిర్మాణం జరిగిందన్నారు. ఇక, నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయానికి దివంగత దిన్‌కర్ బాలు పాటిల్ పేరు పెడతామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ప్రకటించారు.

కప్పు టీ కంటే 1జీబీ డేటా చవక

ఒక కప్పు టీ కంటే తక్కువ ధరకు దేశంలో 1జీబీ వైర్‌లెస్ డేటా దొరుకుతోందని మోదీ అన్నారు. న్యూఢిల్లీలో ఇండియా మొబైల్ కాంగ్రెస్ సదస్సును మోదీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భౌగోళిక అనుకూలతలు, ప్రభుత్వం పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్న తీరు, సులభతర వాణిజ్య విధానాలు భారతదేశాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చిందన్నారు. ప్రపంచలోనే రెండో అతి పెద్ద టెలికామ్ మార్కెట్, అతి పెద్ద 5జీ మార్కెట్‌తో పాటు మానవ వనరులు, మార్పును ఆహ్వానించే తత్వం కలిగిన భారతదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ఇదే తగిన సమయమని పేర్కొన్నారు. మేడిన్ ఇండియా 4జీ స్టాక్‌ను ఇటీవలే ప్రారంభించిన భారత్.. ప్రపంచలోనే ఆ సామర్థ్యం కలిగిన ఐదో దేశంగా నిలిచిందని తెలిపారు. ఒకప్పుడు 2జీ నెట్‌వర్క్‌తో ఇబ్బందులు ఎదుర్కొన్న భారత్‌లోని దాదాపు అన్ని జిల్లాల్లో నేడు 5జీ సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. గత పదేళ్లలో డిజిటల్ స్పేస్‌లో భారత్ గణనీయమైన ప్రగతి సాధించిందని, దాని వల్లే కప్పు టీ కంటే తక్కువ ధరకు దేశంలో 1జీబీ వైర్‌లెస్ డేటా లభిస్తుందని పేర్కొన్నారు. సెమీకండక్టర్లు, మొబైళ్లు, ఎలక్ట్రానిక్ వస్తువల ఉత్పత్తి రంగంలో భారతదేశంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేందుకు పెట్టుబడిదారులు, స్టార్టప్‌లు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అలాగే, ఎలక్ట్రానిక్ మాన్యూఫాక్చరింగ్‌కు సంబంధించిన అంతర్జాతీయ కంపెనీలతో భారత కంపెనీలు భాగస్వాములు కావాలని సూచించారు.

లోకం తీరు



భారత్‌లోనే జెట్ ఇంజన్ల తయారీ!

» రోల్స్‌రాయిస్‌తో ఒప్పందానికి రంగం సిద్ధం?

» నేడు మోదీ, స్టార్మర్ భేటీలో స్పష్టత

ముంబై, అక్టోబరు 8: భారత్‌లో తదుపరి తరం యుద్ధ విమానాల తయారీకి అవసరమైన అధునాతన జెట్ ఇంజన్ల అభివృద్ధి, తయారీకి మార్గం సుగమం అవుతోంది. యూకేకు చెందిన ప్రముఖ జెట్ ఇంజన్ల తయారీ సంస్థ రోల్స్‌రాయిస్, భారత సంస్థలు ఉమ్మడిగా జెట్ ఇంజన్ల అభివృద్ధి, తయారీ చేపట్టాలన్న ప్రతిపాదనలపై గురువారం ముంబైలో ప్రధాని మోదీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌ల భేటీలో స్పష్టత రానుంది. దీనిపై ఒప్పందం కూడా జరిగే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఈ ఒప్పందం కుదిరితే దేశీయ యుద్ధ విమానాలకు జెట్ ఇంజన్ల కోసం విదేశాలపై ఆధారపడే దుస్థితి తప్పుతుంది. మన యుద్ధ విమానాల అభివృద్ధి, తయారీ ప్రక్రియలు వేగం పుంజుకుంటాయి. బుధవారం కీర్ స్టార్మర్ బృందంలో భారత పర్యటనకు వచ్చిన రోల్స్‌రాయిస్ సీఈవో టుఫన్ ఎర్గిన్‌బిల్గిక్ దీనికి సంబంధించి పరోక్షంగా వివరాలు వెల్లడించారు. "రోల్స్‌రాయిస్‌కు భారత్‌ను సొంత మార్కెట్ (హోం మార్కెట్)గా అభివృద్ధి చేసుకోవాలన్నది మా సంకల్పం. ఉపరితల, వాయు, సముద్ర రంగాల్లో సాంకేతికంగా మాకు ఉన్న ఆధిపత్యం భారత దేశంలోని వ్యవస్థల సామర్థ్యాలను పెంచేందుకు, వ్యూహాత్మక భాగస్వామ్యాలను విస్తరించేందుకు తోడ్పడుతుంది. వికసిత భారత్ దిశగా అభివృద్ధిని వేగవంతం చేస్తుంది. స్వయం సమృద్ధం కావాలన్న ఆత్మనిర్భర్ భారత్ ప్రయాణంలో భాగస్వామిగా రోల్స్‌రాయిస్ నిలుస్తుంది" అని చెప్పారు.

భారత్‌కు బ్రిటన్ ప్రధాని స్టార్మర్

న్యూఢిల్లీ, అక్టోబరు 8: భారత్, యూకే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చల కోసం బ్రిటన్ ప్రధాని స్టార్మర్ బుధవారం ముంబైకి చేరుకున్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం 125 మంది వాణిజ్య, విద్య, సంస్కృతిక రంగాల ప్రముఖులతో కూడిన భారీ బృందంతో వచ్చారు. భారత్, యూకే మధ్య ఇటీవల స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో.. వివిధ రంగాల సంస్థలతో వాణిజ్య భాగస్వామ్యాలపై స్టార్మర్ బృందం చర్చలు జరపనుంది. అలాగే ప్రధాని మోదీతో స్టార్మర్ భేటీ కానున్నారు. బుధవారం స్టార్మర్ బృందం ముంబైలో ప్రముఖ బాలీవుడ్ సినీ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిల్మ్స్ స్టూడియోను సందర్శించింది. యూకే సంస్థలతో ఉమ్మడిగా సినిమాల నిర్మాణంపై, యూకేలో షూటింగ్‌లపై పలు నిర్మాణ సంస్థల ప్రతినిధులతో చర్చించింది. అనంతరం స్టార్మర్ ఒక ప్రకటన విడుదల చేశారు. బ్రిటన్‌కు బాలీవుడ్ వస్తుందని, సినిమాల నిర్మాణం చేస్తుందని పేర్కొన్నారు. మరోవైపు వచ్చే ఏడాది మొదట్లో బ్రిటన్‌లోని లొకేషన్లలో తమ సినిమాల షూటింగ్‌లు నిర్వహించనున్నట్టు యశ్‌రాజ్ సంస్థ ప్రకటించింది. గురువారం మహారాష్ట్ర రాజ్ భవన్‌లో ప్రధాని మోదీతో స్టార్మర్ భేటీకానున్నారు. భారత్-యూకే సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ)తో ఇరుదేశాలకు సమకూరే ప్రయోజనాలు.. ప్రపంచ వాణిజ్యం, కొత్త సాంకేతికతలు, రక్షణ, పర్యావరణ పరిరక్షణ అంశాలతోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై వారు చర్చించనున్నారు. కాగా, బుధవారం కీర్ స్టార్మర్ రాకను స్వాగతిస్తూ ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.



ముంబైలోని తాజ్‌మహల్ ప్యాలెస్ హోటల్‌లో దీపావళి వేడుకల్లో స్టార్మర్

కాలిఫోర్నియాలో

దీపావళికి సెలవు!

» అధికారికంగా ప్రకటించిన మూడో స్టేట్

న్యూఢిల్లీ, అక్టోబరు 8: భారత్‌లో అత్యంత వేడుకగా నిర్వహించే దీపావళి పండుగను కాలిఫోర్నియా ప్రభుత్వం అధికారిక సెలవు దినంగా ప్రకటించింది. దీనికి సంబంధించిన బిల్లుపై ఆ రాష్ట్ర గవర్నర్ గవిన్ న్యూసమ్ మంగళవారం సంతకం చేశారు. ఈ చట్టం ప్రకారం.. హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు జరుపుకొనే దీపావళి పండుగ రోజున అన్ని విద్యాంస్థలకు సెలవు ఇస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు ఆ రోజు వేతనంతో కూడిన సెలవు తీసుకొనే అవకాశం ఉంటుంది. ఇప్పటికే అమెరికాలోని రెండు రాష్ట్రాలు ఈ పండుగకు సెలవు ప్రకటించగా ఇప్పుడు మూడో రాష్ట్రంగా కాలిఫోర్నియా నిలిచింది. 2024లో దీపావళిని రాష్ట్రవ్యాప్త సెలవు దినంగా ప్రకటించిన తొలి రాష్ట్రం పెన్సిల్వేనియా కాగా ఈ ఏడాది ప్రారంభంలో కనెక్టికట్ ఈ జాబితాలో చేరింది.

జోహో ఈమెయిల్‌కు మారిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

న్యూఢిల్లీ, అక్టోబరు 8 : కేంద్ర హోంమంత్రి అమిత్‌షా జోహో ఈమెయిల్‌కి మారిపోయారు. స్వదేశీ యాప్‌లనే ఉపయోగించాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. తాను జోహో ఈమెయిల్‌కి మారిపోయినట్లు అమిత్‌షా బుధవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. తన జోహో ఈమెయిల్ ఐడీని amitshah.bjp@zohomail.in గా తెలిపారు. ఇకపై తనతో ఉత్తరప్రత్యుత్తరాలకు దాన్నే ఉపయోగించాలని కోరారు.

భారత్‌తో సంబంధాలను పునరుద్ధరించండి

» ట్రంప్‌నకు అమెరికా చట్టసభ్యుల వినతి

వాషింగ్టన్, అక్టోబరు 8: అగ్రరాజ్యం అమెరికా భారత్‌పై ఎడాపెడా సుంకాలను బాదడంతో ఇరు దేశాల మధ్య సంబంధాలపై ప్రభావం పడిన నేపథ్యంలో అమెరికా చట్టసభ్యులు కొందరు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు తాజాగా ఓ లేఖ రాశారు. భారత్‌తో సంబంధాలను పునరుద్ధరించాలని అందులో కోరారు. సుంకాల విధింపు నేపథ్యంలో చైనా, రష్యాలకు భారత్‌ను దగ్గర చేసినట్టు పేర్కొన్నారు. ఈ లేఖ రాసిన 19 మంది చట్టసభ్యుల్లో ఇండియన్-అమెరికన్ సభ్యులు కూడా ఉన్నారు. ఇటీవల 'మీ యంత్రాంగం తీసుకున్న చర్యలతో ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంతో సంబంధాలు దెబ్బతిన్నాయని, ఇరు దేశాలకు ప్రతికూల పరిణామాలను సృష్టిస్తున్నాయి' అని తెలిపారు. ఇదే సమయంలో ఈ చర్యలు అమెరికాకు వ్యతిరేకమైన చైనా, రష్యాలతో భారత ప్రభుత్వం దౌత్య, ఆర్థిక సంబంధాలను పెంచుకునేలా చేశాయన్నారు. భారత్‌తో కీలకమైన భాగస్వామ్యాన్ని పునరుద్ధరించడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు ట్రంప్‌ను కోరారు.

ముగ్గురు శాస్త్రవేత్తలకు రసాయనశాస్త్ర నోబెల్

» ఎంవోఎఫ్‌లను అభివృద్ధి చేసిన సుసుము కిటగావా, రిచర్డ్ రాబ్సన్,

» ఒమర్ ఎం యాఘీలకు సంయుక్తంగా ప్రకటించిన నోబెల్ కమిటీ



సుసుము కిటగావా | రిచర్డ్ రాబ్సన్ | ఒమర్ యాఘీ

స్టాక్‌హోం, అక్టోబరు 8: ఈ ఏడాది వైద్య, భౌతిక శాస్త్ర నోబెల్ పురస్కారాలను ముగ్గురేసి శాస్త్రవేత్తలకు ప్రకటించిన నోబెల్ కమిటీ.. రసాయన శాస్త్ర నోబెల్‌నూ ముగ్గురు శాస్త్రవేత్తలకు ప్రకటించింది. మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ (ఎంవోఎఫ్‌ల) అభివృద్ధిలో కీలకపాత్ర పోషించినందుకుగాను.. జపాన్‌కు చెందిన సుసుము కిటగావా (74), ఇంగ్లండ్‌కు చెందిన రిచర్డ్ రాబ్సన్ (88), జోర్డాన్‌లోని ఒక పేద కుటుంబం నుంచి అమెరికాకు వలసవచ్చి ఉన్నతచదువులు చదివిన ఒమర్ ముహాన్నెస్ యాఘీలను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు వెల్లడించింది. 1989ల్లో జరిపిన విశేష పరిశోధనలతో వీరు ముగ్గురూ ఒక కొత్త తరహా మాలిక్యులార్ ఆర్కిటెక్చర్‌ను అభివృద్ధి చేశారని నోబెల్ కమిటీ ప్రశంసించింది. మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ గురించి సులభంగా అర్థమయ్యేలా చెప్పాలంటే.. లోహ అయాన్లు (మెటల్), కర్బన సమ్మేళనాల(ఆర్గానిక్)తో వీరు ఒక జాలీ లాంటి నిర్మాణాన్ని అభివృద్ధి చేశారు. అత్యంత సూక్ష్మమైన రంధ్రాలు కలిగిన స్పాంజీ నీటిని పీల్చుకున్నట్టుగా.. వీరు తయారుచేసిన మెటల్-ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్ వాయువులను తన లోపలికి పీల్చేసుకుంటుంది. ఇంధన రూపంలో ఉదజని (హైడ్రోజన్) నిల్వకు.. వాతావరణంలోని బొగ్గుపులుసువాయువు (కార్బన్‌డయాక్సైడ్)ను క్యాప్చర్ చేయడానికి.. ఔషధాల రవాణా, తదితర రంగాల్లో ఈ మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్ వర్క్స్ ఎంతగానో ఉపయోగపడతాయి. ఎడారి గాలుల నుంచి నీటిని సంగ్రహించడానికి, విషవాయువుల నిల్వకు, రసాయన ప్రతిస్పందనల ప్రేరేపణకు ఈ ఫ్రేమ్‌వర్క్స్‌ను ఉపయోగించవచ్చని నోబెల్ కమిటీ ఒక ప్రకటనలో వివరించింది. కాగా, ఈ ముగ్గురిలో.. సుసుము కిటగావా 1989లో ఎంవోఎఫ్‌ల అభివృద్ధికి కీలకమైన పోరస్ కో-ఆర్డినేషన్ పాలిమర్స్ అనే భావనను పరిచయం చేశారు. వాయువుల నిల్వకు, వాయువులను వేరుచేయడానికి వాటిని ఎలా వాడుకోవాలనేదానిపై విస్తృతంగా పరిశోధనలు చేశారు. అందుకే ఆయన్ను మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ పితామహుడుగా పరిగణిస్తారు. రిచర్డ్ రాబ్సన్ 1990లో.. లోహ అయాన్లు, ఆర్గానిక్ లింకర్లను కలిపి 2డి, త్రీడీ జాలీలను నిర్మించవచ్చని నిరూపించారు. అందుకే ఆయన్ను 'నెట్‌వర్క్ కెమిస్ట్రీ పయనీర్'గా అభివర్ణిస్తారు. వీరిద్దరి పరిశోధనల ఆధారంగా 1995లో ముహాన్నెస్ యాఘీ ఎంవోఎఫ్‌లను సైద్ధాంతికంగా, నిర్మాణాత్మకంగా, మరింత అధునాతనంగా అభివృద్ధి చేశారు. అందుకే ఆయన్ను ఎంవోఎఫ్‌ల వ్యవస్థాపకుడుగా పేర్కొంటారు. సుసుము కిటగావా ప్రస్తుతం క్యోటో యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. రాబ్సన్ యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్‌లో, యాఘీ యూనివర్సిటీ ఆఫ్ క్యాలిఫోర్నియా (బర్కిలీ)లో సేవలందిస్తున్నారు.

పాక్‌కు అమెరికా క్షిపణులు

» అత్యాధునిక ఏఐఎమ్-120ల విక్రయానికి ఒప్పందం ఖరారు!

» క్షిపణుల అమరికకు వీలుగా ఎఫ్-16లను ఆధునీకరించనున్న అమెరికా

వాషింగ్టన్, అక్టోబరు 8: అత్యాధునిక ఏఐఎమ్-120 క్షిపణులను పాకిస్థాన్‌కు అమెరికా అందించనున్నట్టు తెలిపింది. గగనతలం నుంచి గగనతలంలోని లక్ష్యాన్ని ఛేదించే మధ్యశ్రేణి క్షిపణులివి. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఈ ఏడాది మేలో యుద్ధ విరమణ తర్వాత అమెరికాకు దాయాది దేశం దగ్గరయిన నేపథ్యంలో భారీ ఆయుధ ఒప్పందం కుదిరినట్టు తెలిసింది. ఇదే పని మీద గత జూలైలో పాకిస్థాన్ వాయుసేన చీఫ్ మార్షల్ జహీర్ అహ్మద్ బాబర్ అమెరికాకు వెళ్లారు. ఈ సందర్భంగా కుదిరిన ఆయుధ ఒప్పందాన్ని ధ్రువీకరిస్తూ అమెరికా రక్షణశాఖ నోటిఫికేషన్ జారీచేసినట్టు సమాచారం. ఆ నోటిఫికేషన్‌లో ఏఐఎమ్-120 కొనుగోలుదారుల జాబితాలో తక్కినదేశాలతోపాటు పాక్ పేరును కూడా అమెరికా చేర్చిందంటూ డాన్ పత్రిక ఒక కథనం ప్రచురించింది. ఏఐఎమ్-120లో సీ8, డీ అనే రెండు తరాల క్షిపణలున్నాయి. ఇందులో డీ తరహావి అమెరికా సైన్యం వినియోగిస్తోంది. వాటితో పోల్చితే సీ8 మరింత ఆధునికమైనది. వీటిని తయారుచేసే ఆయుధ సంస్థకు ఇప్పటికే 41.6 మిలియన్ల డాలర్ల విలువైన ఆర్డర్‌ను ఇచ్చినట్టు అమెరికా రక్షణ శాఖ ఈ ఏడాది సెప్టెంబరు 30న పత్రికలకు విడుదల చేసిన ప్రకటనను ఉటంకిస్తూ డాన్ పత్రిక తెలిపింది. మొత్తం కాంట్రాక్టు విలువ 2.51 బిలియన్ డాలర్లు. తయారీ పూర్తయి ఈ క్షిపణులు పాక్ సహా కొనుగోలుదేశాలకు 2030 మేకు గాని చేరవు. వాటిలో ఎన్ని పాక్‌కు అమెరికా ఇస్తుందో స్పష్టత లేదు. అయితే, ఈ సందర్భంగా పాక్ వాయుసేనకు చెందిన ఎఫ్-16 యుద్ధ విమానాలను అమెరికా ఆధునీకరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే, పాక్ వద్ద ఉన్న యుద్ధ విమానాల్లో ఎఫ్-16లు మాత్రమే ఏఐఎమ్-120 అమరికకు అనువైనవంటూ ఆర్మీ వర్గాలను ఉటంకిస్తూ డాన్ పత్రిక కథనం తెలిపింది. ఈ రకం క్షిపణులను కొన్నింటిని గతంలో పాక్ ఉపయోగించింది. బాలాకోట్‌లోని జైషే మహ్మద్ శిబిరాన్ని కూల్చివేసి, పెద్దఎత్తున ముష్కరులను భారత్ మట్టుబెట్టిన నేపథ్యంలో 2019లో ఈ క్షిపణులతోనే పాక్ ప్రతిదాడులకు దిగింది. ఇప్పుడు వాటిని పెద్ద ఎత్తునే సమకూర్చుకునేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది.

రెండేళ్లలోపు పిల్లలకు దగ్గు సిరప్‌లు అమ్మొద్దు

» ఫార్మసీలకు ఫార్మసిస్టుల అసోసియేషన్ ఆదేశం

» తమిళనాడులో ఔషధ తయారీ కంపెనీ శ్రీసెన్ సీజ్

» 'కోల్డ్‌రిఫ్' నమూనాల్లో కల్తీ అవశేషాలు



న్యూఢిల్లీ/చెన్నై (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 8: ఇటీవల కలుషిత దగ్గు సిరప్‌ల కారణంగా చిన్నారుల మరణాలు పెరుగుతున్న నేపథ్యంలో ఫార్మసీలు రెండేళ్ల లోపు పిల్లలకు ఈ ఉత్పత్తులను విక్రయించకుండా భారత ఫార్మసిస్టుల అసోసియేషన్ నిషేధం విధించింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ మేరకు లేదా తల్లిదండ్రులు కోరినా కూడా రెండేళ్ల వయసు లోపు చిన్నారులకు దగ్గు సిరప్ లేదా యాంటీహిస్టామిన్లు, డీకాగ్నెస్టెంట్లు, యాంటీటస్సీవ్‌ల కాంబినేషన్ లేదా ఉపశమనం కలిగించే మందులు ఇవ్వరాదని సూచించింది. కేంద్ర ఆరోగ్య శాఖ, సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ జారీ చేసిన మార్గదర్శకాలను ఫార్మసిస్టులందరూ పాటించాలని ఆదేశించినట్టు జాతీయ మీడియా వెల్లడించింది. దగ్గు సిరప్‌లు వాడటం వల్ల చిన్నారులకు కలిగే దుష్పరిణామాల గురించి వివరించాలని, వాటికి ప్రత్యామ్నాయంగా సురక్షితమైన, ఔషధ రహిత మందులు సూచించాలని ఆదేశించాయి. మరోవైపు, అన్ని రకాల ఔషధాలను కట్టుదిట్టంగా పరీక్షించాల్సిందిగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలుకు ఆరోగ్య సేవల డైరెక్టరేట్ జనరల్ (డీజీహెచ్ఎస్) గట్టి ఆదేశాలు జారీ చేసింది. తయారీ కేంద్రాల్లో విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సిందిగా డ్రగ్ కంట్రోలర్లకు సూచించింది.

'కోల్డ్‌రిఫ్'తో కలకలం

మధ్యప్రదేశ్‌లో విషపూరిత దగ్గు సిరప్‌లు వాడటం వల్ల 20 మంది పిల్లలు మరణించిన నేపథ్యంలో తమిళనాడులోని కాంచీపురం జిల్లా సుంకువారి సత్రం వద్ద ఉన్న ఔషధ తయారీ కంపెనీ శ్రీసెన్‌ను ఆ రాష్ట్ర ప్రభుత్వం సీల్ చేసింది. ఆ కంపెనీ లైసెన్స్‌ను రద్దు చేసింది.

అల్లూరి జిల్లా సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో 16 మంది మావోయిస్టులు బుధవారం పోలీసుల ఎదుట లొంగిపోయారు.

పదేళ్లలో అంతరిక్ష టూరిజం

- ఖర్చు తగ్గించే దిశగా పెద్దఎత్తున పరిశోధనలు
- ఎస్‌డీఎస్‌సీ-షార్ కంట్రోలర్ అండ్ డీడీ రమేశ్



బొబ్బిలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో అంతరిక్ష టూరిజం మరో పదేళ్లలో అందుబాటులోకి వస్తుందని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్(ఎస్‌డీఎస్‌సీ)- షార్ కంట్రోలర్ అండ్ డిప్యూటీ డైరెక్టర్ జి.రమేశ్ బాబు అన్నారు. విజయనగరం జిల్లా బొబ్బిలిలోని రాజా కళాశాలలో నిర్వహిస్తున్న అంతరిక్ష వారోత్సవాలకు బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. స్పేస్ టూరిజం చాలా ఖర్చుతో కూడుకున్నదని, ఈ వ్యయాన్ని తగ్గించే దిశగా పెద్దఎత్తున పరిశోధనలు జరుగుతున్నాయని చెప్పారు. అంతరిక్ష రంగంలో వెచ్చించే ప్రతీ రూపాయి కూడా సామాన్యుల ప్రయోజనాల కోసం ఉపయోగపడాలన్నది ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 'ఇతర గ్రహాల్లో జీవరాశి ఉందా? అక్కడ జీవనానికి అవకాశం ఉందా? అనే అంశాలపై పరిశోధనలు ఊపందుకున్నాయి. మైక్రో గ్రావిటీపై అన్ని దేశాల్లో పెద్దఎత్తున పరిశోధనలు జరుగుతున్న నేపథ్యంలో అందుకు దీటుగా మనం కూడా అభివృద్ధి చెందాల్సి ఉంది. 2047లోగా ఇతర గ్రహాలపైకి మనం అడుగుపెట్టే అవకాశాలు ఉన్నాయి. ఇస్రోతో పాటు ప్రైవేట్ సంస్థలు సైతం అంతరిక్ష పరిశోధనా రంగంలో దూసుకుపోతున్నాయి. స్టార్టప్ కంపెనీలు కూడా ముందుకొస్తున్నాయి. ఇలాంటివారిని మన సీనియర్ శాస్త్రవేత్తలు వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారు. నేడు అంతరిక్ష పరిశోధన రంగానికి బడ్జెట్‌లో 2శాతం వెచ్చిస్తున్నాం. దీన్ని గణనీయంగా పెంచేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. ఆపరేషన్ సిందూర్‌లో భారత్ అనుసరించిన యుద్ధ శైలిని చూసి ప్రపంచం నివ్వెరపోయింది. సాంకేతిక బలం, ఉపగ్రహాల సహకారంతో సామాన్య పౌరులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా టెర్రరిస్టుల శిబిరాలపైనే దాడులు చేయగలిగాం. అంతరిక్ష యానంలో భారత్ అనేక విజయాలు సాధించింది. మనకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి నిరాకరించిన దేశాలే మన నుంచి కొనుగోలు చేసుకునే స్థితికి ఎదిగాం. గ్రహాంతర వాసుల జాడపై ఎలాంటి ఆధారాలులేవు. పూర్వీకుల నుంచి వచ్చిన ధర్మాన్ని పాటించాలి. దాన్ని సైన్స్ అండ్ టెక్నాలజీతో ముడిపెట్టకూడదు. సమాజంలో మూఢనమ్మకాలు పోవాలంటే నూరు శాతం అక్షరాస్యత చాలా అవసరం' అని రమేశ్ వివరించారు.



ఏపీ నగరాల సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న నెట్టెం రఘురాం

టీడీపీలోనే బీసీలకు ప్రాధాన్యం

- నగరాల కార్పొరేషన్ చైర్మన్ బాధ్యతల స్వీకరణ సభలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం

విజయవాడ(వన్‌టౌన్), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, రాజకీయంగా తెలుగుదేశం పార్టీ బీసీలకు అధిక ప్రాధాన్యమిస్తుందని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం అన్నారు. ఆంధ్రప్రదేశ్ నగరాల సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రఘురాం మాట్లాడుతూ బీసీల మద్దతుతోనే టీడీపీ ఎప్పుడూ అధికారంలోకి వస్తుందనేది చరిత్ర చెబుతున్న సత్యమన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను సీఎం చంద్రబాబు అమలు చేస్తూ, బీసీలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. మరో 15 ఏళ్లు కూటమి అధికారంలో ఉంటేనే సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. మరో ముఖ్య అతిథి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రభుత్వం సాధికారత కమిటీ ఏర్పాటు చేసి కులాల వారీగా గుర్తింపు ఇవ్వడంపై హర్షం వ్యక్తమవుతోందన్నారు.

ఏయూ స్నాతకోత్సవం వాయిదా

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15వ తేదీన నిర్వహించ తలపెట్టిన ఆంధ్ర విశ్వవిద్యాలయం 91, 92వ సంయుక్త స్నాతకోత్సవం వాయిదా పడినట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. స్నాతకోత్సవాన్ని తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.

భక్తులకు అందుబాటులో

టీటీడీ 2026 డైరీలు, క్యాలెండర్లు

తిరుమల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): 2026 టీటీడీ డైరీలు, క్యాలెండర్లు గురువారం నుంచి భక్తులకు లభిస్తాయి. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, విశాఖపట్టణం, విజయవాడ సహా అనేక ప్రాంతాల్లో వీటిని భక్తులకు అందుబాటులో ఉంచారు. 12 పేజీల పెద్ద క్యాలెండర్, 6 పేజీలు క్యాలెండర్, టేబుల్-టాప్ క్యాలెండర్లు, డీలక్స్ డైరీలు, చిన్న డైరీలు, శ్రీవేంకటేశ్వ స్వామి, అమ్మవారి పెద్ద, చిన్న క్యాలెండర్లు అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. టీటీడీ ఆలయాలు, పలు కళ్యాణమండపాల వద్ద ఇవి లభిస్తాయి. టీటీడీ అధికారిక వెబ్‌సైట్ 'తిరుమల.ఓఆర్జీ', 'టీటీడీదేవస్థానమ్స్ ఏపీ.జీవోవీ.ఇన్' ద్వారా కూడా బుక్ చేసుకోవచ్చు. తిరుమలలోని పబ్లికేషన్ స్టాల్‌లోనూ, తిరుపతిలో టీటీడీ పరిపాలన భవనం ఎదురుగా ఉన్న సేల్స్ సెంటర్, గోవిందరాజస్వామి ఆలయం ముందున్న ధ్యాన మందిరం, శ్రీనివాసం, విష్ణు నివాసం, తిరుచానూరులో ఉన్న టీటీడీ పబ్లికేషన్స్ స్టాల్స్‌లో ఇవన్నీ లభిస్తాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

విషం-విషాదం

మీ దేశంలో సరే, పసిపిల్లలను పొట్టనబెట్టుకున్న ఆ దగ్గు మందును ఇతర దేశాల్లోనూ అమ్ముకున్నారా? అని ప్రపంచ ఆరోగ్యసంస్థ మనల్ని నిలదీస్తోంది. అవునని మనం గనుక అంటే, భారతదేశం నుంచి వచ్చిన సదరు విషపూరిత దగ్గుమందుతో మీ పిల్లల ప్రాణాలను ప్రమాదంలో పడవేయకండి అంటూ ప్రపంచ దేశాలన్నింటిలోనూ అది టమకు వేయిస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థకు మనమీద ప్రత్యేకమైన పగలూవగలూ ఏమీలేవు. కానీ, మన దగ్గుమందుకు విదేశాల్లో సైతం పసిప్రాణాలను పెద్దసంఖ్యలో చిదిమేసిన ఘనమైన గతం ఉన్నది కనుక, మరో కొత్త విషం విషయంలో ఆరోగ్యసంస్థ ఇలా ఉలిక్కిపడటం తప్పేమీ కాదు.

ఈ కాలకూట విషానికి రోజూ ఒక్కరొక్కరుగా ప్రాణాలు వదిలేస్తూనే ఉన్నారు. మధ్యప్రదేశ్‌లో అత్యధికంగా, రాజస్థాన్‌తోనూ కలిపి ఇప్పటి వరకూ 22మంది పిల్లలు మరణించారు. నాగపూర్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరుగురు చిన్నారుల్లో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నదని, ఇంకా కొన్ని మారుమూల ప్రాంతాల్లో తెలియక ఈ దగ్గుమందువాడే ప్రమాదం కూడా లేకపోలేదని అధికారులు అంటున్నారు. తమిళనాడులో ఎన్నికలు ఉన్నందువల్ల కాబోలు, ఈ విషాదఘట్టం కూడా రాజకీయమైపోయింది. సదరు దగ్గుమందు తయారైంది కాంచీపురంలో కనుక, ఆ కంపెనీమీదా, దాని యజమాని మీద మేము చెప్పినమేరకు, ఆదేశించిన రీతిలో తమిళనాడు ఆరోగ్య శాఖ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కేంద్రం నిలదీస్తోంది. శ్రేసన్ ఫార్మామీద దాడి సహా చేయాల్సినవన్నీ చేస్తూనే ఉన్నామని తమిళనాడు వాదిస్తోంది. రాజకీయానికి ఇది సమయం కాదని అంటూనే ఈ విమర్శలు, ప్రతివిమర్శల పర్వం సాగుతోంది.

పరిమితికి ఐదురెట్లు అధికంగా డైఎథిలీన్ గ్లైకాల్ వినియోగించిన ఈ కోల్డ్‌రిఫ్ దగ్గుమందును చాలా రాష్ట్రాలు నిషేధించాయి, ప్రకటనలు కూడా జారీ చేశాయి. దీనిని ముందు జాగ్రత్త అనుకోవాలో, చేతులు కాలాక ఆకులుపట్టుకోవడమేనని బాధపడాలో తెలియదు. అంతమంది పిల్లలు కన్నుమూస్తే కానీ, తమిళనాడు ప్రభుత్వం మేలుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఫిర్యాదు అందుకున్న తమిళనాడు అధికారులు సదరు ఫార్మా కంపెనీలో కాలూని, అక్కడి వాతావరణం చూసి నిర్ఘాంతపోయారని మీడియా అంటోంది. ఫార్మారంగంతో సంబంధం లేని కార్మికులు తుప్పుపట్టిన పరికరాలు వాడుతూ, గ్లౌజులు, మాస్కులు లేకుండా గ్యాస్‌స్టవ్‌లపైన రసాయనాలు వండుతున్నారనీ, అపరిశుభ్రమైన నీరు, దుమ్మూ ధూళి కలగలసి ఆ సిరప్పులు తయారవుతున్నాయని మీడియా తెలియచేసింది. ఈ మందులో వినియోగించాల్సిన రసాయనాలను పెయింట్ పరిశ్రమ డీలర్లనుంచి కొనుగోలు చేస్తున్నారని, వాటిని కచ్చితంగా తూచకుండా, పరీక్షించకుండా కలిపివేస్తున్నారని అధికారులు గ్రహించారు. చట్టం ప్రకారం ఈ సంస్థ నలభై అతి కీలకమైన, మూడువందలకు పైగా అతిముఖ్యమైన ఉల్లంఘనలకు పాల్పడిందని తమిళనాడు అధికారులకు అప్పుడు గానీ తెలియ రాలేదట.

సదరు కంపెనీ మీద తమిళనాడు ఏ చర్యలు తీసుకున్నా, డాక్టర్‌ను అరెస్టుచేసి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల వంటివారిని మధ్యప్రదేశ్ ప్రభుత్వం సస్పెండ్ చేసినా అంతా ఉపరితలవిన్యాసమే. ఒక అనుమతిపొందిన కంపెనీ తయారుచేసిన దగ్గుమందును చీటీమీద రాసినందుకు వైద్యుడిని ఎలా అరెస్టుచేస్తారని వారి సంఘం ప్రశ్నిస్తున్నదట. చవుక బారు రసాయనాలతో, తప్పుడు విధానాలతో, నాణ్యతలేని ఒక దగ్గు మందును తయారుచేసి, ఐదారురెట్ల ధరకు దానిని విక్రయిస్తున్న ఆ కంపెనీని మాత్రమే తప్పుబట్టి ప్రయోజనం లేదు. దాని లాభాల్లో వాటాలు పొందుతున్న వైద్యులు, అధికారులు కూడా పాపంలో భాగస్వాములే. రసాయనాల కొనుగోలు, తయారీ, పంపిణీ ఇత్యాది ప్రతీ దశా మన వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనం. రాజకీయ నాయకుల పరోక్ష అనుమతితో, అధికారుల ప్రత్యక్ష సహకారంతో కళ్లముందు తయారవుతున్న విషం ఇది. ఐదేళ్ళక్రితం జమ్మూకశ్మీర్ సహా కొన్ని రాష్ట్రాల్లో చిన్నారులను చిదిమేసిన ఘటనలు మన మనసుకు తాకలేదు. మరో రెండేళ్ళకు గాంబియాలోనూ, ఆ తరువాత ఏడాది ఉజ్బెకిస్థాన్‌లోనూ మన దగ్గుమందు పెద్దసంఖ్యలో పసిప్రాణాలతో పాటు అంతర్జాతీయంగా భారత్ పరువు కూడా తీసింది. ఫార్మా కంపెనీలు, ఫ్యాక్టరీల మీద నిఘా, పర్యవేక్షణ మరింత పెరగాలి. పాలకులకు, అధికారులకు చిత్తశుద్ధిలేనంత కాలం ఇటువంటివి జరుగుతూనే ఉంటాయి.

ప్రజాస్వామ్య భరోసానివ్వని బిహార్ ‘సర్’

బిహార్ ఓటర్ల తుది జాబితాలు వెలుడ్డాయి. అసెంబ్లీ ఎన్నికల తేదీలూ ప్రకటించారు. పూర్తయిన ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్–సర్) కార్యక్రమాన్ని నిశితంగా పరీక్షిస్తే మా దృష్టికి వచ్చిన వాస్తవాలను వివరించడమే ఈ వ్యాస లక్ష్యం. కొత్త ఓటర్ జాబితాల నాణ్యతను అంచనా వేసేందుకు గాను ఓటర్ల నమోదు కార్యక్రమాలకు అంతర్జాతీయ స్థాయిలో అంగీకార యోగ్యమైన మూడు మార్గదర్శక సూత్రాలను ప్రాతిపదికగా తీసుకున్నాం: సమగ్రత, నిష్పాక్షికత, నిర్దుష్టత.


■ యోగేంద్ర యాదవ్

తొలుత ఓటర్ జాబితా సమగ్రతను చూద్దాం. ఓటర్ జాబితాలో చోటు చేసుకున్న అర్హులైన జనుల నిష్పత్తిని దీనికి కొలమానంగా తీసుకున్నాం. గత జూలైలో ప్రచురితమైన ముసాయిదా ఓటర్ జాబితాలలో చోటుచేసుకున్న వయోజనుల నిష్పత్తి ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో దిగ్భ్రాంతికరంగా 97 శాతం నుంచి 88 శాతానికి తగ్గిపోయింది. తుది ఓటర్ల జాబితాలో కొంత మేరకు మెరుగుదల కనిపించినప్పటికీ, విస్తృత పరిశీలనలో పరిస్థితుల్లో పెద్దగా మార్పు లేదని స్పష్టమయింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కారణంగా ఓటర్లకు–జనాభాకు మధ్య నిష్పత్తి గణనీయంగా పడిపోయింది మరి. భారత ప్రభుత్వ నిపుణుల బృందం విడుదల చేసిన జనాభా అంచనాల ప్రకారం సెప్టెంబర్ 2025లో బిహార్‌లో 8.22 కోట్ల మంది ఓటర్లు ఉండాలి. తుది ఓటర్ జాబితాలో ఉన్నవారు 7.42 కోట్లు మాత్రమే! అంటే దాదాపు 80 లక్షల మంది సంభావ్య ఓటర్లు తుది జాబితాలో కనిపించడం లేదు! ఇదేమంత సంతోషించదగిన విషయం? దీన్నెలా అంగీకరించాలి?

తుది ఓటర్ జాబితాలు భ్రమపూరితమైన ఉపశమనాన్ని మాత్రమే కలిగిస్తున్నాయి. ఎందుకని? తుది జాబితా నుంచి తొలగింపులు ముసాయిదా జాబితాల నుంచి తొలగించబడిన 65లక్షల కంటే తక్కువ కాబట్టి. నిజానికి రెండు కోట్ల మంది ఓటర్లు తొలగింపుకు గురవుతారని భయపడ్డాము. అంత పెద్ద సంఖ్యలో ఓటు హక్కు తొలగింపులు సంభవించ లేదంటే అందుకు కారణం ‘సర్’ గానీ, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కానీ కాదు. దేశ సర్వోన్నత న్యాయస్థానం అప్రమత్తత వల్లే అటువంటి అప్రజాస్వామిక చర్య చోటుచేసుకోలేదు. సుప్రీంకోర్టు కృత నిశ్చయంతో ‘సర్’ అమలును పర్యవేక్షించింది. గౌరవ భంగం కాకుండా ఉండేందుకు ఈసీఐ తన ఆదేశాలకు, కార్యనిర్వహణ పద్ధతులకు భిన్నంగా వ్యవహరించింది. తొలుత ఎన్యూమరేషన్ ఫామ్‌లను సమర్పించని ఓటర్లు పెద్ద సంఖ్యలో లేరనే వాస్తవాన్ని కప్పిపుచ్చేందుకు కచ్చితంగా ప్రయత్నించింది. ఈ ప్రకారం కనీసం 20 శాతం ఎన్యూమరేషన్ ఫామ్‌లను బీఎల్‌ఓలే నింపి ఈసీఐకు సమర్పించడం జరిగింది. ఈ ఫోర్జరీని ఈసీఐ ప్రోత్సహించింది. పిదప సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆధార్ కార్డును ఓటర్ నమోదుకు ఒక ప్రామాణిక పత్రంగా ఈసీఐ అంగీకరించింది.

తుది జాబితాలలో నిష్పాక్షికత ఉన్నదా? ఓటు హక్కుకు అర్హులైన జనాభాలో తమ నిష్పత్తికి సమరీతిలో అన్ని సామాజిక బృందాలకు ప్రాతినిధ్యం లభించిందా? దళితులకు, వచ్చిపోయే వలసకారులకు ఈ విషయంలో న్యాయం ఏ మేరకు జరిగింది? వీటిపై మరింత నిశిత శోధన జరగవలసివున్నది.

మహిళలు, ముస్లింలకు న్యాయం జరగలేదన్నది మా పరిశీలనలో స్పష్టంగా వెల్లడయింది. బిహార్ ఓటర్ జాబితాలలో మహిళల నిష్పత్తి రాష్ట్ర జనాభాలో వారి వంతు కంటే ఎప్పుడూ తక్కువగా ఉండడం పరిపాటి. ఇటీవలి సంవత్సరాలలో ఈ అంతరం తగ్గింది. 2012లో 21 లక్షలుగా ఉండగా అది ఈ ఏడాది 7 లక్షలకు తగ్గింది. ‘సర్’తో ఈ అంతరం మరింతగా తగ్గక పోగా 16 లక్షలకు పెరిగింది.

ముస్లింల విషయంలో సాక్ష్యాధారాలు స్పష్టంగా లేవు. ఈసీఐ రికార్డులో ముస్లింలు ఒక అధికారిక వర్గంగా లేక పోవడమే అందుకు కారణం. అయితే పేర్ల గుర్తింపు సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించగా ఆందోళనకరమైన వాస్తవాలు వెల్లడయ్యాయి. ముసాయిదా ఓటర్ జాబితాల నుంచి మినహాయింపబడిన 65 లక్షల మంది ఓటర్లలో ముస్లింలు 24.7 శాతం కాగా తుది జాబితాల నుంచి తీసివేసిన 3.88 లక్షల పేర్లలో వారు 33 శాతంగా ఉన్నారు. రాష్ట్ర జనాభాలో వారి నిష్పత్తి 16.9 శాతంగా ఉండడం గమనార్హం. అంటే ఆరు లక్షల ముస్లిం ఓటర్ల పేర్లను అదనంగా తొలగించారు.



> బిహార్‌లో ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ నిష్పాక్షికంగా జరగలేదు. బిహార్ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోకుండా దేశ వ్యాప్తంగా ‘సర్’ అమలుకు ఈసీ పూనుకుంటే భారీ సంఖ్యలో ప్రజల ఓటుహక్కు రద్దయ్యేందుకు అవకాశమున్నది. పర్యవసానంగా ఎన్నికలపై ప్రజలు విశ్వాసం కోల్పోతారు. భారత ప్రజాస్వామ్యానికి ఇదెలా మేలుచేస్తుంది?

తుది ఓటర్ జాబితాలు నిర్దుష్టంగా ఉన్నాయా? ప్రత్యేక సమగ్ర సవరణతో ఈ విషయంలో పరిస్థితి మరింత దిగజారినట్టు అర్థమవుతున్నది. ‘సర్’ ముందు జాబితాలు, ‘సర్’ తరువాతి జాబితాలలోని నిర్దుష్టతపై మరింత పరిశీలన జరగవలసి ఉన్నది. అయితే మా ప్రాథమిక విశ్లేషణ ప్రకారం ఓటర్ జాబితాలను ప్రక్షాళన చేశామన్న ఈసీఐ వాదన సమర్థనీయంగా లేదు. తుది ఓటర్ జాబితాలలో 24 వేల పేర్లు అర్థంకాని రీతిలో ఉన్నాయి. 5.2 లక్షల పేర్లు నకిలీవి. 6,000 మంది ఓటర్ల జెండర్ ఏమిటో స్పష్టంగా తెలియడం లేదు. రెండు లక్షల మంది ఓటర్ల ఇంటి నెంబర్లు సక్రమంగా లేవు. ప్రక్షాళన జరగాల్సింది ఇలాగేనా? చాలా అంశాలలో ముసాయిదా జాబితాల కంటే తుది జాబితాలు మరింత ఘోరంగా ఉన్నాయి.

ఓటర్ జాబితాల నుంచి విదేశీయుల (బంగ్లాదేశీయులు, రోహింజ్యాలు అని చదువుకోండి) పేర్లను తొలగించడమే ‘సర్’ లక్ష్యమని బీజేపీ వాదించింది. ఈ వాదనతో ఈసీఐ ఏకీభవించింది. అయితే ‘సర్’కు సంబంధించి ఈసీఐ తొలగించిన ఓటర్ల పేర్లను ఏ కారణాలతో తొలగించడం జరిగిందో రోజువారీ బులెటిన్‌లో వివరంగా తెలిపారు. అయితే ఇంటింటికి వెళ్లి ధ్రువీకరించుకున్న కార్యక్రమంలో ఎంతమంది విదేశీయులు తమ దృష్టికి వచ్చారన్న విషయమై ఎలాంటి వివరాలను ఈసీఐ వెల్లడించలేదు. విదేశీయుడు అన్న కారణంగా ఏ ఒక్క ఓటరు విషయంలోనూ బీజేపీ తన అభ్యంతరాన్ని ఈసీఐకి తెలుపలేదు. బిహార్ సీఈఓ వెబ్‌సైట్ ముసాయిదా జాబితాలకు 2.4 లక్షల ఫిర్యాదులు తమకు అందాయని పేర్కొంది. వీటిలో 1,087 మాత్రమే (మొత్తం ఓటర్లలో వీరు 0.015 శాతం మాత్రమే) భారతీయ పౌరులు కారనే కారణంతో చేసినవి. ఈ ఫిర్యాదుల్లో 226 మాత్రమే ముస్లింలకు వ్యతిరేకంగా ఉన్నవి కనుక మిగతా 779 విదేశీయులు అన్న ఆక్షేపణతో చేసినవి అయివుంటాయి. బహుశా వారంతా నేపాలీలు అయి వుండొచ్చు. ఈ ఫిర్యాదుల్లో 390ని మాత్రమే ఈసీఐ ఆమోదించింది. తుది జాబితాల నుంచి సదరు ఓటర్ల పేర్లను తీసివేసింది. ఇలా తీసివేతకు గురైన వారిలో ముస్లింలు 87 మంది మాత్రమే ఉన్నారు.

పారదర్శకత, సక్రమత అనే ప్రమాణాల ప్రాతిపదికన ఈ తుది జాబితాల నాణ్యతను నిర్ధారించేందుకు సంపూర్ణ తనిఖీకి వేచివుండవలసిన అవసరం లేదు. 2003 నాటి సమగ్ర సవరణ ఉత్తర్వు ప్రతిని అందించాలని సమాచార హక్కు చట్టం కింద చేసిన అభ్యర్థనకు ఈసీఐ ప్రతిస్పందించనే లేదు. తుది ఓటర్ల జాబితాలను సరైన రీతిలో విడుదల చేయనే లేదు. అనేక విషయాలలో నియమ నిబంధనలకు విరుద్ధంగా ఈసీఐ వ్యవహరించింది. కనుకనే ముసాయిదా ఓటర్ జాబితాల నుంచి తొలగించిన 65 లక్షల ఓటర్ల పేర్లను సంపూర్ణంగా ప్రకటించాలని సుప్రీంకోర్టు ఆదేశించడం అనివార్యమయింది. ప్రతి ఎన్నికల సంఘం విధిగా చేయవలసిన దానికి, గతంలో తాను నెలకొల్పిన సంప్రదాయాలకు విరుద్ధంగా ఈసీఐ వ్యవహరించింది. ‘సర్’ నిర్వహణపై ముందుగా సంప్రదింపులు చేయకపోవడం, హడావుడిగా అమలుపరచడం, అన్ని నిర్ణయాలనూ పారదర్శకంగా తీసుకోకపోవడం, ప్రతిపక్షాలతో కలహశీలంగా వాదప్రతివాదాలు చేయడం మొదలైనవన్నీ భారత ఎన్నికల సంఘం తటస్థ మధ్యవర్తిగా వ్యవహరించడం లేదనే భావనను ప్రజలలో నెలకొల్పాయి.

వర్ధమాన దేశాలలోని ఎన్నికల సంఘాలకు ఆదర్శప్రాయంగా వెలుగొందిన, దేశ ప్రజల సంపూర్ణ విశ్వాసాన్ని పొందిన ఈసీఐ బిహార్‌లో ‘సర్’ను అమలుపరిచిన తీరు ఆమోదయోగ్యంగా లేదని చెప్పక తప్పదు. బిహార్‌లో అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోకుండా దేశ వ్యాప్తంగా ‘సర్’ అమలుకు పూనుకుంటే భారీ సంఖ్యలో ప్రజల ఓటు హక్కు రద్దు జరిగేందుకు అవకాశమున్నది. పర్యవసానమేమిటి? ఎన్నికలపై ప్రజలు విశ్వాసం కోల్పోతారు. భారత ప్రజాస్వామ్యానికి ఇదెలా మేలు చేస్తుంది?

(రాహుల్ శాస్త్రి సహకారంతో)

(వ్యాసకర్త ‘స్వరాజ్ ఇండియా’ అధ్యక్షుడు)

ఇరు మతాల మధ్య ఎటూ కాని మాలలు!

భారతదేశంలో హిందూ మతం వదిలి క్రైస్తవ మతం స్వీకరించిన అంటరాని జాతులు ఎదుర్కొనబోయే పరిస్థితుల గురించి డా. అంబేడ్కర్ ‘అస్పృశ్యులకొక హెచ్చరిక’, ‘హిందువుల నుంచి దూరంగా’, ‘కులం – మతాంతీకరణ’, ‘మతం మార్చుకొన్న దళితుల పరిస్థితి’ మొదలైన వ్యాసాలలో విపులంగా చర్చించారు. ఆయన ఈ వ్యాసాలు రాసి దాదాపు వందేళ్ళవుతోంది.

భారత రాజ్యాంగం అమలులోకి వచ్చాక అంటరాని జాతుల ప్రజలను షెడ్యూల్డు కులాలు అని పిలుస్తున్నారు. దేశవ్యాప్తంగా 35కోట్ల మంది అంటరాని జాతుల ప్రజలు నేటికీ హిందువులుగా ఉన్నారు. ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలలో కన్వర్టెడ్ క్రిస్టియన్లు 2శాతం, హిందూ మాల, హిందూ మాదిగ కుల సర్టిఫికెట్లతో విద్య, ఉద్యోగ, సంక్షేమ పథకాలు పొందుతూ చర్చిలకు వెళ్ళే ప్రజలు 20శాతం ఉంటారు.

1928లో సైమన్ కమిషన్ దక్షిణ భారత పర్యటన సందర్భంగా... ఇక్కడి క్రైస్తవ వర్గాల వారు తమ స్థితిగతులపైన కుల సమస్యపైన సమర్పించిన వినతి పత్రంలో “మతాంతరీకరణ పొందిన దళిత క్రైస్తవుల జీవన స్థితిగతులు, మతమార్పిడి చెందని హిందూ దళిత వర్గాల జీవన స్థితిగతులు ఒకేరకంగా ఉన్నాయి” అని పేర్కొన్నారు. 2025లో కూడా ఇంకా ఈ పరిస్థితులే కొనసాగుతున్నాయి. నేడు క్రైస్తవంలో కూడా కులాధిపత్యం, మత వివక్ష తీవ్రంగా కొనసాగుతున్నాయి. కమ్మ, రెడ్డి, కాపు, బ్రాహ్మణ, మాల, మాదిగ క్రైస్తవులు తమ కులాల క్రైస్తవులతో మాత్రమే సంబంధ బాంధవ్యాలు కలుపుకుంటున్నారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రభావం చూపిన కారంచేడు, చుండూరు ఉద్యమ ఫలాలను క్రైస్తవ సంస్థలు, ఎన్‌జీఓలు వందల కోట్ల నిధుల రూపంలో జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి తెచ్చుకున్నాయి. దళిత ఉద్యమ ఫలితంగా ప్రభుత్వాలు స్పందించి విద్య, ఉపాధి, ఉద్యోగ, సంక్షేమ, పునరావాస పథకాలను బాధితులకు అందించాయి. దళిత ఉద్యమ ఫలితంగానే యస్.సి, యస్.టి అత్యాచార చట్టం అమలులోకి వచ్చింది. క్రైస్తవ చర్చిలు, ఎన్‌జీఓలు మాత్రం రకరకాల దళిత ఉద్ధరణ ప్రాజెక్టుల ద్వారా వందల కోట్ల విదేశీ నిధులు తెచ్చుకొని బాధితులకు కానీ, దళిత క్రైస్తవులకు కానీ పైసా విదల్చలేదు. నేటికీ చర్చిలు, ఎన్‌జీఓలు దళిత ఉద్ధరణ పేరుతో విదేశీ నిధులు పొందుతూ విలాసవంతమైన సామ్రాజ్యాలు నిర్మించుకుంటున్నాయి.



> హిందూ మతం దళితులను అంటరాని వారిగా సమాజానికి దూరంగా తరిమివేసింది. క్రైస్తవ మతం మాల మాదిగ పల్లెలను కేథలిక్కులు, ప్రొటెస్టెంట్లు, బాప్టిస్టులు, బ్రదరన్ గ్రూపు, యెహోవా సాక్షులు... ఇలా ముక్కలు చెక్కలుగా దళితుల సంఘటిత శక్తిని నిర్వీర్యం చేసింది.

ప్రస్తుతం భారతదేశంలో 2 కోట్ల 80 లక్షల మంది క్రైస్తవులు ఉన్నారు. వీరిలో 30 లక్షల మంది అగ్రకులస్థులు. 2 కోట్ల 50 లక్షల మంది హిందూ మతం వదిలి క్రైస్తవ మతం స్వీకరించిన దళితులు. వీరంతా కన్వర్టెడ్ క్రిస్టియన్లు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో అధికారికంగా క్రైస్తవం స్వీకరించిన వారు బీసీ(సీ)గా పరిగణించబడుతున్నారు. వీరు దళిత కులాల జనాభాలో 2శాతం. వీరు కాకుండా దళిత కులాలలో 20శాతం మంది హిందూ, మాల మాదిగ కులాలుగా ధ్రువీకరణ పత్రాలు పొంది విద్య, ఉద్యోగ, రాజకీయ, ఉపాధి, సంక్షేమ ఫలాలు పొందుతూ చర్చిలకు వెళుతున్నారు. హిందువులుగా కొనసాగుతున్న 80శాతం మంది మాలలకు ఎలాంటి అస్తిత్వం లేదు. కారణం హిందువులుగా కుల ధ్రువీకరణ పత్రాలు పొంది క్రైస్తవ మత విశ్వాసంలో ఉన్న మాలలే విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో ముందున్నారు. హిందూ మాలలు 80శాతం మందిని హిందూ సమాజం దూరంగా నెట్టివేస్తే, అన్ని రంగాలలో ముందున్న క్రైస్తవ మాల సమాజం అన్యులుగా ముద్ర వేసి మరింత దూరం పెట్టింది.

దళిత ఉద్యమ, పోరాటాల ఫలితంగా, విద్యా, ఉద్యోగ సంక్షేమ రంగాలలో ఎస్సీ, ఎస్టీల కోసం బడ్జెట్ కేటాయింపులు పెరిగి ఉచిత, విద్య, వైద్యం, హాస్టళ్ళు, ఫీజు రీయింబర్స్‌మెంటు వంటి అనేక ఆర్థికాభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుబాటులోకి వచ్చాయి. క్రైస్తవ మిషనరీలు పూర్తిగా సంక్షేమ కార్యక్రమాలు ఆపివేసాయి. మిషనరీల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న విద్యా సంస్థలు, హాస్పిటల్ సేవలు అన్నీ ఫీజులు చెల్లించి పొందాల్సిన పరిస్థితి దళిత క్రైస్తవులకు ఏర్పడింది. మతం మార్చుకొని, క్రైస్తవ జీవన విధానంలో ఉన్న అంటరాని వారి సామాజిక స్థాయిని క్రైస్తవం పెంచగలిగిందా అంటే అదీ లేదు. దళిత క్రైస్తవ విద్యావంతులకు తమ కుల సమస్యల పట్ల స్పందించి పోరాడే గుణం లేదు. హిందూ మతం దళితులను అంటరాని వారిగా సమాజానికి దూరంగా తరిమివేసింది. క్రైస్తవ మతం మాల మాదిగ పల్లెలను కేథలిక్కులు, ప్రొటస్టెంట్లు, బాప్టిస్టులు, బ్రదరన్ గ్రూపు, యెహోవా సాక్షులు... ఇలా ముక్కలు చెక్కలుగా దళితుల సంఘటిత శక్తిని నిర్వీర్యం చేసింది. దళిత విద్యావంతులు, రిజర్వుడు ఉద్యోగులు తమ దళిత సోదరుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయకుండా, అంతా ప్రభువే చూసుకుంటాడు అని శుష్క పలుకులు పలుకుతున్నారు. హిందువులుగా ఉన్న 80 శాతం మాలలు హిందూ సమాజం నుంచి, తమ పొరుగున ఉన్న దళిత క్రైస్తవ సమాజం నుంచి కూడా తిరస్కారం పొందుతున్నారు. వారు అగ్రకుల హిందువులకు, దళిత క్రైస్తవులకు మధ్య నలిగి అస్తిత్వాన్ని కోల్పోయారు.

హిందువులుగా ఉన్న మాలలు ఆచరిస్తున్నది నేడు సమాజంలో ఉన్న కులాధిపత్య, నిచ్చెనమెట్ల, ఛాందస బ్రాహ్మణ, మనువాద, సనాతన హిందూ ధర్మం కాదు. భారత దేశాన్ని నిర్మించి, పాలించిన, సింధూ నాగరికత, వ్యవసాయ సంస్కృతి, సహోదరత్వం, సకల జనుల క్షేమం పునాదిగా ఉన్న మాతృస్వామిక పురాతన హిందూ ధర్మాన్ని వారు ఆచరిస్తున్నారు. బేతాళ పురాణం, మాల చెన్నయ్య కథ, జాంబపురాణం, కాకతీయ సామ్రాజ్య సేనాధిపతి యుగంధరుడు, పల్నాటి సర్వసైన్యాధ్యక్షుడు మాలకన్నమనీడు, మాలమాస్టీన్‌లు, వీరవిద్యావంతులు, హరిదాసులు, గతించిన నాగరాజ్యాలు, గణాలు, ఉరుముల కథకులు, కాటిపాపరులు, పోలేరమ్మ, గొంతేలమ్మ, గంగమ్మ, అంకాలమ్మ, పోచమ్మ జాతరులు, దేవర స్థలాలు... ఇవన్నీ నేటికీ మనుగడలో ఉండి హిందూ మాలల సంస్కృతికి సజీవ సాక్ష్యాలుగా ఉన్నాయి. సర్వమానవాళి శ్రేయస్సును కాంక్షించే పురాతన హిందూ ధర్మాన్ని నేటికీ ఆచరిస్తున్న మాల హిందువులు క్రైస్తవ సంస్థల ఉన్మాదం, వివక్ష, దోపిడీతో పాటు అన్ని రకాల మతోన్మాదాలను సమైక్యంగా తిప్పికొట్టి, తమ అస్తిత్వాన్ని కాపాడుకోవాలి.

• మల్లెల వెంకట్రావు
మాలమహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు

నేడు ఏఐబీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన

రాజ్యాంగం నుంచి ‘లౌకిక’, ‘సామ్యవాద’ పదాలను తొలగించేందుకు మరోసారి కుట్ర జరుగుతోంది. ఇది కొత్తది కాదు. వాజ్‌పేయి హయాంలోనూ ఇలాంటి ప్రయత్నం జరిగినప్పుడు, కాన్షీరాం నేతృత్వంలో దేశవ్యాప్తంగా రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమం జరిగింది. ఇప్పుడు అదే తరహా కుట్రలు మళ్లీ పునరావృతం అవుతున్నాయి. ఈ రాజకీయ సంక్లిష్టతలో బహుజనులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, క్రైస్తవ మైనారిటీలకు రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత మరింత పెరిగింది. లౌకికతను తొలగించడం ద్వారా మతపరమైన మౌలికవాదానికి మార్గం సుగమమవుతుంది. మతపరమైన రాజకీయాలు బలహీన వర్గాలను విభజించి, వారి ఐక్యతను దెబ్బతీస్తాయి. సామ్యవాదాన్ని తొలగించడం ద్వారా కార్పొరేట్ శక్తులు, సంపన్న వర్గాలు పాలనపై ఆధిపత్యం చెలాయిస్తాయి. ఇది బహుజనుల హక్కులను, అవకాశాలను, జీవిత నాణ్యతను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.

కాన్షీరాం 1984లో బహుజన్ సమాజ్ పార్టీని స్థాపించారు. 1993లో బీఎస్పీ–ఎస్పీ కూటమి ద్వారా ఉత్తర ప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, బహుజనుల పాలన సాధ్యమయ్యే దిశలో చారిత్రక అడుగు వేశారు. ఆయన చేపట్టిన ఉద్యమం లక్షలాది మందిని రాజ్యాంగం, హక్కుల పట్ల చైతన్యవంతులుగా మార్చింది. ఆయన వర్ధంతి అయిన అక్టోబర్ 9న ఏఐబీఎస్పీ రాజ్యాంగ విలువల పరిరక్షణ లక్ష్యంతో విజయవాడ ధర్నా చౌక్‌లో ఉదయం 9 గంటలకు నిరసన కార్యక్రమం నిర్వహించనున్నది. ఇది కేవలం ఒక నిరసన కాదు, రాజ్యాంగ విలువలను కాపాడే ప్రజాశక్తికి ప్రదర్శన. ముఖ్యంగా యువత, విద్యార్థులు, ప్రజా సంఘాలు ఈ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలి.

– డా. జె. పూర్ణచంద్రరావు
మాజీ డీజీపీ, నేషనల్ కో ఆర్డినేటర్–ఏఐబీఎస్పీ

వికసిత్ భారత్‌కు ‘యువజన’ బాట

ఒక దశాబ్దం క్రితం వరకు పేదరికం, నిరుద్యోగం, ఆహార సంక్షోభం వగైరా సమస్యలకు దారితీస్తోందనే సాకుతో జనాభా పెరుగుదలపై ఆందోళనలు వ్యక్తమవుతుండేవి. అంతకంతకు పెరుగుతున్న జనాభాను మానవవనరులుగా పరిగణించే సానుకూల భావన ఇటీవల ప్రాచుర్యంలోకి వచ్చింది. ఆ మధ్య తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్కువమంది పిల్లల్ని కనాలంటూ పిలుపునివ్వడం తెలిసిందే. ఈ నేపథ్యంలో జనాభా పెరుగుదల అనేది ప్రతికూలత కన్నా ఎక్కువగా అనుకూలతను వ్యాప్తి చేస్తోంది. యువశక్తిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే ఉద్దేశం కొంతవరకు సరైనదే అయినా... వనరులు, మౌలిక సదుపాయాలు లేకుండా జనాభా పెరుగుదల అనారోగ్యకరమని అంగీకరించాల్సిందే. విద్య, ఉపాధి, ఆరోగ్య సేవలు సమర్థంగా లేని పరిస్థితిలో, అధిక జనాభా సామాజిక అసమానతలను, వనరులపై ఒత్తిడిని మరింత పెంచుతుంది.

‘పాపులేషన్ హాలిడే’ భావన అనేది నిర్దిష్ట కాలానికి జనాభా పెరుగుదలపై అంక్షలు విధించడాన్ని సూచిస్తుంది. ఇది పంటకు ఇచ్చే విరామం లాంటిది. భూసారం పెంచేందుకు పంటల విరామం పాటించడం ఆనవాయితీ. దీన్ని క్రాప్ హాలిడే అంటారు. ముక్కారు పంటలు పండే చోట కూడా నేలను కొంత కాలం ఖాళీగా ఉంచి విరామం ఇవ్వడం వల్ల భూమిలో పోషకాల సమతుల్యత సర్దుబాటు అవుతుందనేది శాస్త్రవేత్తల మాట. సహజవనరుల ఆదాకు చైనా లాంటి దేశాలు జనాభా విరామాన్ని అధికారికంగా అమలు చేసే క్రమంలో దశాబ్దం గడిచే సరికి సంతానోత్పత్తి రేటు దారుణంగా క్షీణించింది. అయితే మనదేశంలో కుటుంబ నియంత్రణ కేరళ, తమిళనాడు రాష్ట్రాలలో ప్రభుత్వ పరంగా కాకుండా ప్రజలస్వామ్యంతో విజయవంతమయింది. చిన్న కుటుంబాల సిద్ధాంతం విజయవంతం కావడం అనేది మహిళల విద్య, ఆరోగ్య పరిరక్షణలో పెట్టుబడి వల్ల సాధ్యమైంది. దీన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తే జనాభా నియంత్రణ సాధ్యపడుతుంది. చిన్న కుటుంబాలకు పన్ను లాభాలు, ప్రోత్సాహకాలు ఇవ్వడం ఈ విధానాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

జనాభా పెరుగుదల సహజవనరులైన నేల, నీరు, ఇంధనం వగైరాలపై ఒత్తిడి కలిగించి, వాటి కొరతకు దారితీస్తుంది. అధిక జనాభా వల్ల పర్యావరణానికి జరిగే నష్టం అంతా ఇంతా కాదు. సమాజంపై దాని ప్రభావం తీవ్రంగానే ఉంటుందనడానికి పెచ్చరిల్లే నిరుద్యోగం, పేదరికం, నివాసాల లేమి, ఆహార సంక్షోభం, విద్యా వైద్య వనరుల్లో కోత ఆపై పట్టణాలు, నగరాలు కిక్కిరిసిపోవడం... ఇలా అనేక సమస్యలకీ అధిక జనాభా ప్రధాన కారణమవుతుంది. ఈ సమస్యలు మన దేశంలో స్పష్టంగా కనిపిస్తాయి. మొత్తంగా అభివృద్ధి, మౌలిక సదుపాయాలపై జనాభా పెరుగుదల భారంగా పరిణమిస్తుంది. జనాభా పెరుగుదల అదుపులోకి రావాలంటే సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అవసరమవుతుంది.

జనాభా పెరుగుదల ఆర్థికవృద్ధికి దారితీయదు. ప్రపంచంలోని కొన్ని పేద దేశాలలో అధిక జనాభా ఉంది. శ్రమశక్తిలో చురుకుగా పాల్గొనే కార్మికుల విద్య, నైపుణ్యాలు ఆర్థిక వృద్ధిని ప్రభావితం చేస్తాయి. జనాభా గణాంకాలు ఆర్థిక వృద్ధి భవితవ్యాన్ని నిర్ణయించవు. అయితే అవి ఆర్థిక వ్యవస్థ వృద్ధి సామర్థ్యానికి కీలకం కావచ్చు. అభివృద్ధి చెందిన దేశాలలో తగ్గుతున్న జనన రేటుతో పాటు వృద్ధాప్య జనాభా భవిష్యత్తులో ఆర్థిక వృద్ధిలో తగ్గుదలను సూచిస్తుంది. విద్య, నైపుణ్యాలు, ఉత్పాదకత పెరుగుదల వగైరా చర్యలు జనాభా మార్పుల ప్రభావాన్ని తగ్గించగలవు. సాంకేతిక పురోగతి ఉత్పాదకత పెంపుదలకు ఒక మూలం. జనాభాలో యువజన సంఖ్య ఎక్కువగా ఉన్న దేశాలు బాగా లబ్ధి పొందుతాయి. ప్రపంచంలో అధిక యువజనాభా కలిగిన దేశాలలో భారతదేశం ఒకటి. 2024లో దాదాపు 65 శాతం భారతీయ జనాభా 35 ఏళ్లలోపు వారే. ప్రపంచవ్యాప్తంగా పనిచేసే వయస్సు కలిగిన కార్మిక జనాభా తగ్గుతుండగా, పనిచేయని జనాభా పెరుగుతోంది. శ్రామికశక్తి జనాభా తగ్గుతున్నప్పటికీ, సాంకేతిక పరిజ్ఞానంలో పురోగతి కారణంగా యూరప్ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందింది. జపాన్‌లో, కొరియాలో వృద్ధుల జనాభా ఆందోళన కలిగిస్తోంది. సామాజిక భద్రత, వైద్య సేవలు సవాలుగా మారాయి. అమెరికా, యూరోపియన్ దేశాలలో శ్రామిక వయస్సు జనాభా గరిష్ఠ స్థాయికి చేరుకున్నట్లు కనిపిస్తోంది. 2040 నాటికి యువ జనాభా కనీస స్థాయికి చేరుకుని శ్రామిక సంక్షోభం తలెత్తుతుందని అంచనా. తక్కువ శ్రామికశక్తి జనాభా కారణంగా ప్రపంచ ఆర్థిక వృద్ధి భవిష్యత్తులో తగ్గే అవకాశాన్ని సూచిస్తోంది. సాంకేతిక పురోగతి ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇస్తున్నది. ఆర్థిక వృద్ధిని నిలబెట్టుకోవాలంటే, జనన రేటు పెద్ద మొత్తంలో పెరగాలి లేదా ఉత్పాదకత పెరుగుతూనే ఉండాలని చాలామంది భావిస్తున్నారు. సాంకేతిక ఆవిష్కరణల కారణంగా ప్రజలు తమ ఉద్యోగాలను కోల్పోయే అవకాశం ఉన్నప్పటికీ, సంబంధిత నైపుణ్యాలలో శిక్షణ పొందిన వారికి లబ్ధి చేకూరుతుంది.


> జనాభాలో యువజన సంఖ్య ఎక్కువగా ఉన్న దేశాలు బాగా లబ్ధి పొందుతాయి. ప్రపంచంలో అధిక యువజనాభా కలిగిన దేశాలలో భారతదేశం ఒకటి. 2024లో దాదాపు 65 శాతం భారతీయ జనాభా 35 ఏళ్లలోపు వారే. ఆర్థిక వృద్ధిని నిలబెట్టుకోవాలంటే, జననాల రేటు పెద్ద మొత్తంలో పెరగాలి లేదా ఉత్పాదకత పెరుగుతూనే ఉండాలి.



ఇదిలావుంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆ మధ్య, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న భారత, రష్యా ఆర్థిక వ్యవస్థలను ఉద్దేశించి ‘డెడ్ ఎకానమీ’ (నిర్వీర్య ఆర్థిక వ్యవస్థ)లు అంటూ ఎత్తి పొడిచారు. ప్రపంచంలో అతి పెద్ద జనసంఖ్య కలిగిన దేశంగా మారిన భారతదేశం ఏ రకంగా చూసినా డెడ్ ఎకానమీ అనిపించుకోదు. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగిన సదుపాయాల కల్పనపై ప్రభుత్వాలు దృష్టి పెడితే, జనవనరుల ద్వారా అద్భుతాలు చేసే వీలుంది. దేశీయంగా బలమైన మార్కెట్ ఉన్న దేశం ఎప్పటికీ నిర్జీవం కాదు. అసలు అతిపెద్ద వినిమయ దేశంగా ఉన్న అమెరికానే ఇప్పుడు ఆర్థిక సంక్షోభం కోరల్లో ఉంది. అమెరికా అభివృద్ధి చెందిన దేశమే అయినా, దాని ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధి రేటు నమోదు చేయడం లేదు. అమెరికా ప్రభుత్వ రుణభారం 35 ట్రిలియన్ డాలర్లు మించిపోయింది. అదే సమయంలో భారతదేశంలో తయారీ రంగం, మౌలిక సదుపాయాలు వేగం అందుకున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ ఆశాజనకంగానే ఉంది. ట్రంప్ చెప్పిన దానికి, వాస్తవానికి పొంతన లేనేలేదు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే ముందు మన ప్రజల ప్రయోజనాలే అంతిమ లక్ష్యంగా మోదీ ప్రభుత్వం అడుగులు వేయాలి.

ట్రంప్ ‘డెడ్ ఎకానమీ’ ఎత్తి పొడుపును సవాల్‌గా తీసుకున్న ప్రధాని మోదీ ‘వికసిత భారత్’ లక్ష్యాన్ని మరింత దృఢంగా పునరుద్ఘాటించారు. ఈ లక్ష్య సాధన ప్రభుత్వ విధానాలు, ప్రణాళికలు, ప్రజల ఆశయాల్లో భాగంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. భారత్‌ను 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం, ఇంధన స్వాతంత్ర్యం కలిగి ఉండడం, డిజిటల్ రంగంలో ప్రపంచ నాయకత్వాన్ని సాధించడం, ఉత్పత్తి–సేవల రంగాల్లో అంతర్జాతీయ పోటీతత్వం ప్రదర్శించడం మొదలైన లక్ష్యాల సాధనకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఈ లక్ష్యాలను నిజంగా అభివృద్ధిగా మార్చాలంటే, ఎన్నో విషయాల్లో పురోగతి చెందాలి. ముఖ్యంగా నిర్మాణాత్మక సంస్కరణలు అవసరం. కార్మిక చట్టాల సరళీకరణ, భూసంస్కరణలు, బ్యాంకింగ్ రంగంలో నాన్–పెర్ఫార్మింగ్ అసెట్స్ క్లీన్–అప్, పచ్చదనం, డిజిటలైజేషన్, మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు అనే సంస్కరణలు లేకుండా సుస్థిర అభివృద్ధి సాధ్యం కాదు. ఈ మార్పులతో మాత్రమే భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ప్రపంచ నాయకత్వ స్థానాన్ని సొంతం చేసుకొనే మార్గం సుగమం అవుతుంది.

■ నిమ్మగడ్డ లలితప్రసాద్
డైరెక్టర్, బ్రహ్మయ్య అండ్ కో





మార్గ్ కృష్ణాయ హోటల్ సమీపంలోని బస్టాప్ వద్ద ప్రయాణికుల అవస్థలు

నగరంలో భారీ వర్షం కురిసింది. గంటకుపైగా కుండపోతగా పడింది. అడుగున్నర ఎత్తున రోడ్లపై నీరు చేరడంతో ప్రధాన రోడ్లు కాల్వలను తలపించాయి. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. వర్షం తగ్గిన తర్వాత ఒక్కసారిగా అందరూ రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ప్రధాన కూడళ్లలో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



జలవాడ

బందరు రోడ్డుపై మోకాలి లోతు నీటిలో స్థానికుల ఇక్కట్లు



బందర్ రోడ్డులో నిలిచిన ట్రాఫిక్

నగరంలో భారీ వర్షం

సాయంత్రం 4 గంటల నుంచి కుండపోత • గంట పాటు ఉరుములు, మెరుపులతో బీభత్సం



బందరు రోడ్డులో విద్యార్థుల అవస్థలు

- అడుగున్నర ఎత్తున రోడ్లపై చేరిన నీరు
- ఎక్కడికక్కడ నిలిచిపోయిన వాహనాలు
- **ప్రధాన కూడళ్లలో భారీగా స్తంభించిన ట్రాఫిక్**
- **తీవ్ర ఇబ్బందులు పడ్డ స్థానికులు, ప్రయాణికులు**

విజయవాడ సిటీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచి తీవ్రమైన ఎండ.. సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షంతో నగరం బుధవారం ఉక్కిరిబిక్కిరయింది. గంట పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రధాన కూడళ్లన్నీ ట్రాఫిక్‌తో స్తంభించిపోయాయి. వివరాల్లోకి వెళితే.. నగరంలో ఉదయం నుంచే సూరీడు సుర్రుమనిపించాడు. మధ్యాహ్నం **మిగతా 6లో..**



పిన్నమనేని పాలీక్లీనిక్ రోడ్డులో వర్షపు నీటిలో సైకిల్‌పై హల్‌చల్



పిన్నమనేని పాలీక్లీనిక్ రోడ్డులో వాహనచోదకుల ఇక్కట్లు



నిర్మలా కాన్వెంట్ రోడ్డులో..



డి.వి.మ్యానర్ నుంచి సిద్ధార్థ కళాశాలకు వెళ్లే రోడ్డులో నీరు



రహదారులకు మహర్దశ

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 16 రోడ్ల అభివృద్ధికి

రూ.36.80 కోట్లు మంజూరు

- **రాష్ట్ర రహదారులు 8, జిల్లా ప్రధాన రహదారులు 8 ఎంపిక**
- **108.30 కిలోమీటర్లు అభివృద్ధి కానున్న రహదారులు**
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

అధ్వానంగా ఉన్న రహదారుల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఎనిమిది రాష్ట్ర రహదారులు, మరో ఎనిమిది జిల్లా ప్రధాన రహదారులకు రూ.36.80 కోట్లు మంజూరు చేసింది. వీటితో 108.30 కిలోమీటర్ల మేర రహదారులు అభివృద్ధి కానున్నాయి. వీటికి సంబంధించిన పనుల్లో ఇక రహదారులు, భవనాల శాఖ నిమగ్నం కానుంది.

ఆంధ్రజ్యోతి- విజయవాడ సిటీ: ఉమ్మడి కృష్ణాజిల్లాలోని రాష్ట్ర రహదారుల(ఎస్‌హెచ్) అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎనిమిది రాష్ట్ర రహదారులకు రూ.36.80 కోట్లు, ఎనిమిది జిల్లా ప్రధాన రహదారులకు రూ.31.70 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులతో 52.26 కిలోమీటర్లు రాష్ట్ర రహదారులను, 56.4 కిలోమీటర్లు జిల్లా ప్రధాన రహదారులను అభివృద్ధి చేసేందుకు రహదారులు, భవనాల శాఖ సమాయత్తం అవుతోంది. ఆర్‌అండ్‌బీ విజయవాడ, మైలవరం, మచిలీపట్నం డివిజన్‌లలో రాష్ట్ర రహదారులు, జిల్లా ప్రధాన రహదారులు(ఎండీఆర్) రోడ్లు చాలా వరకు దెబ్బతిన్నాయి. గత ఐదేళ్లలో రోడ్ల మరమ్మతులకు సైతం నిధులు మంజూరు కాకపోవడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల కారణంగా ఎంతో మంది ప్రమాదాలకు గురైన ఉదంతాలు ఉన్నాయి. మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా ఈ ఏడాది జూలై నుంచి కురిసిన భారీ వర్షాలు రోడ్లను మరింత **మిగతా 6లో..**

కౌన్సిల్ సమావేశం రసాభాస

- నూతన పింఛన్ల అంశంపై అధికార, ప్రతిపక్షాల వాగ్వాదం
- ఆర్వో వాటర్ ప్లాంట్లలో ఇకోలై బ్యాక్టీరియా వల్లే డయేరియా
- వినాయక చవితి రోజు 4 వాటర్ ప్లాంట్ల నీరు వాడకం
- పరీక్షల్లో ఇకోలై బ్యాక్టీరియా పాజిటివ్
- కూటమి ప్రభుత్వం కొత్తగా ఒక్క పింఛన్ ఇవ్వలేదన్న వైసీపీ
- అభ్యంతరం వ్యక్తం చేసిన టీడీపీ
- సభను సక్రమంగా నడపాల్సిన మేయర్ టీడీపీ సభ్యులపై ఎదురు దాడి

6లో



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

గ్రావెల్ దొంగలు!

మెట్లపల్లి అటవీ ప్రాంతంలో గుట్టుగా తవ్వకాలు.. రాత్రివేళ తరలింపు

- టాక్టర్లు, జేసీబీలను పట్టుకుని గార్డుకు అప్పగించిన స్థానికులు
- వదిలేసిన అటవీశాఖ అధికారులు
- అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌కు ఫిర్యాదుతో వెలుగులోకి..



మెట్లపల్లి అడవిలో జూలైలో జరుగుతున్న తవ్వకాలు (ఇన్‌సెట్‌లో) జామాయిల్ చెట్లు నరికిన ఆనవాళ్లు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మెట్లపల్లి అడవిలో గుట్టుగా జరిగిన గ్రావెల్ తవ్వకాల బాగోతం ఆలస్యంగా వెలుగుచూసింది. ఎకరం పైగా అటవీ విస్తీర్ణంలో గ్రావెల్ తవ్వకాలు జరిగాయి. సరిగ్గా ఈ ఏడాది జూన్, జూలైల మధ్యలో ఈ అక్రమ తవ్వకాలు జరిగినట్టు తెలుస్తోంది. అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ (పీసీసీఎఫ్)కు ఫిర్యాదు అందటంతో ఈ వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయి. అటవీశాఖ అధికారుల సహాయ సహకారాలతోనే ఈ అక్రమ తవ్వకాలు జరిగినట్టుగా తెలుస్తోంది. మెట్లపల్లి అడవిలో జరిగిన అక్రమ తవ్వకాలు బయటకు వెలుగు చూడకుండా అటవీ శాఖాధికారులు జాగ్రత్తలు పడ్డారు. తొలుత మెట్లపల్లి గ్రామస్థులు ఈ అక్రమ తవ్వకాలను గుర్తించి అడ్డుకున్నారు. అడవిలోనే అనధికార క్వారీ ఏర్పాటు చేసి గ్రావెల్‌ను తరలిస్తుండటంతో స్థానికులు నిఘా పెట్టారు. మొత్తం **మిగతా 6లో..**

జామాయిల్ మొక్కల నరికివేత

మెట్లపల్లి అడవిలో మరో దారుణం చోటు చేసుకుంది. అడవిలో ఉన్న జామాయిల్ చెట్లను కూడా అదే సమయంలో భారీగా నరికివేతకు పాల్పడిన విషయం కూడా వెలుగులోకి వచ్చింది. అడవిని పరిరక్షించాల్సినవారే జామాయిల్ మొక్కలను నరికివేయించారన్న విమర్శలు, ఆరోపణలు వస్తున్నాయి. వందల ట్రక్కులలో జామాయిల్ కలపను గుట్టుగా తరలించినట్టు తెలుస్తోంది. జామాయిల్ మొక్కలను నరికిన తర్వాత.. వాటికి చిగుళ్లు వచ్చి పెరిగిన తర్వాత వాటి కర్రలను కూడా నరికించి భారీగా తరలించటం తీవ్ర వివాదాస్పదంగా మారుతోంది.

మొక్కలు నాటడంలోనూ అక్రమాలు

మెట్లపల్లి అటవీ ప్రాంతంలో అరణ్యాన్ని పెంచటం కోసం మొక్కలు నాటే కార్యక్రమానికి అటవీశాఖాధికారులు శ్రీకారం చుట్టారు. మొక్కలైతే నాటారు కానీ, ప్రభుత్వ ఆదేశాలకు భిన్నంగా వ్యవహరించారని ఆరోపణలు ఉన్నాయి. మొక్కలను కూలీల చేత నాటించాలని నిర్దేశించగా.. అటవీశాఖాధికారులు మాత్రం ప్రొక్లెయిన్లు తెప్పించి నాటించారు. ప్రొక్లెయిన్ల కారణంగా ఖర్చు తక్కువ అవుతుంది. ఈ వ్యవహారంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వస్తున్నాయి. రికార్డులలో మాత్రం కూలీలతో పనిచేయించినట్టుగా చూపించినట్టు తెలుస్తోంది. నిర్దేశించిన మొక్కలు ఎన్ని నాటారన్నదానిపైనా అనేక విమర్శలు ఉన్నాయి. కాగా, గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ఓ వైపు విచారణ నడుస్తుంటే.. మరో వైపు అధికార యంత్రాంగం ఇలా చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నకిలీ కహానీలు!

నకిలీ మద్యం కేసులో వెలుగులోకి మరిన్ని లింక్‌లు

- శ్రీనివాస వైన్స్‌ను ముందే అనుమానించిన అధికారులు
- మేనేజర్ కల్యాణ్ అరెస్టు
- జనార్దన్‌తో మరికొన్ని వైన్స్‌కు లింకులు
- ఉమ్మడి కృష్ణాజిల్లాలోని మద్యం వ్యాపారులతో సత్సంబంధాలు



నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావుతో మద్యం దుకాణాల యజమానులకు లింక్‌లు ఉన్నాయా? మందుబాబులు 'ఫుల్'గా ఉన్న సమయంలో నకిలీ మద్యం విక్రయించారా? అంటే ఎక్సైజ్ వర్గాలు అవుననే అంటున్నాయి. రాష్ట్రంలో సంచలనం రేపిన నకిలీ మద్యం కేసులో కీలక సూత్రధారిగా ఉన్న అద్దేపల్లి జనార్దనరావు ఎక్సైజ్ పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడు. త్వరలోనే తాను అన్ని విషయాలు వెల్లడిస్తానని చెప్పిన ఆయన న్యాయస్థానాల ద్వారా కేసులో రక్షణ పొందే ప్రయత్నం చేస్తున్నాడు. అసలు జనార్దనరావుతో ఎవరెవరికి లింక్‌లు ఉన్నాయో బయటకు లాగే ప్రయత్నంలో ఎక్సైజ్ శాఖ అధికారులు ఉన్నారు.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): మద్యం వ్యాపారంలో పదేళ్లుగా జనార్దనరావు ఉన్నాడు. మొలకలచెరువులో నకిలీ మద్యం తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం వెనుక జనార్దనరావు ఆలోచనలు ఉన్నట్టు తెలుస్తోంది. ఇబ్రహీంపట్నం కేంద్రంగా ఏఎన్ఆర్ బార్‌ను నడుపుతున్న ఆయన విజయవాడతోపాటు ఉమ్మడి కృష్ణాజిల్లాలో మద్యం దుకాణాల యజమానులతో మంచి సంబంధాలు నిర్వహిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. జనార్దనరావు బార్‌ను నడపడమే కాకుండా విద్యాధరపురంలోని శ్రీనివాస వైన్స్‌లో భాగస్వామిగా ఉన్నాడు. ఈ వైన్స్‌ను తెలివిగా తన స్నేహితుడి పేరు మీద పెట్టించాడు. జనార్దనరావు మొలకలచెరువులో తయారు చేయించిన నకిలీ మద్యానికి సంబంధించిన కేసులను శ్రీనివాస వైన్స్‌లో విక్రయించినట్టు తేలింది. ఈ వైన్స్‌కు మేనేజర్‌గా వ్యవహరించిన వాగు సెంటర్‌కు చెందిన అంగులూరి కల్యాణ్‌ను పోలీసులు **మిగతా 6లో..**



ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు ముగిసిన తర్వాత కూడా భక్తుల రద్దీ కొనసాగుతోంది. బుధవారం క్యూలైన్లలో భక్తులు పోటెత్తారు. దుర్గమ్మను దర్శించుకుని పరవశించిపోయారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

స్క్రీన్లతో చూపు చీకట్లోకి..



- చిన్న వయస్సులోనే దృష్టి లోపం
- ఫోన్లు, టీవీలపై ఎక్కువ సమయం గడపడమే ప్రధాన కారణం
- నేడు ప్రపంచ దృష్టి దినోత్సవం

8లో


విజయేంద్రప్రసాద్‌కు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న అధికారులు

దుర్గమ్మ సేవలో విజయేంద్ర ప్రసాద్

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను బుధవారం రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ సినీరచయిత విజయేంద్ర ప్రసాద్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.


స్టేషన్‌లో ప్రయాణికుల టికెట్ చెకింగ్ చేస్తున్న టీటీఈ

విజయవాడ డివిజన్‌లో రైల్వే టికెట్ డ్రైవ్

» రూ.35.46 లక్షల జరిమానా వసూలు

రైల్వేస్టేషన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ డివిజన్‌లో రైల్వే అధికారులు టికెట్ తనిఖీ డ్రైవ్‌లో రికార్డుస్థాయిలో రూ.35.46 లక్షల మేరకు జరిమానా వసూలు చేశారు. డ్రైవ్ తరువాత ప్రజల ఫిర్యాదులు గణనీయంగా తగ్గాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి అత్యధిక టికెట్ చెకింగ్ ఆదాయం ఇదేనని డివిజన్ పీఆర్వో నుస్రత్ ఎం మండ్రూపకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6న మెగా టికెట్ చెకింగ్ డ్రైవ్ నిర్వహించింది. దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ బి.ప్రశాంతకుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో సుమారు 747 మంది సిబ్బంది పాల్గొన్నారు. 5,512 కేసులు నమోదు చేసి రికార్డుస్థాయిలో రూ.35.46 లక్షలు జరిమానా వసూలు చేశారు. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా ఒకరోజు ఆదాయం రికార్డుగా నిలిచింది. గత నెల 28న జరిగిన రూ.35.16 లక్షల రికార్డును అధిగమించింది. డివిజన్ అంతటా పెద్దఎత్తున తనిఖీలు జరిగాయి. ఈఇంటెన్సివ్ టికెట్ చెకింగ్ డ్రైవ్‌లో టికెట్ లేకుండా ప్రయాణించినందుకు 2,154 కేసులు, సక్రమంగా ప్రయాణించనందుకు 3,277 కేసులు, లగేజీకి సంబంధించి 81 కేసులు నమోదు చేశారు. పండుగలు, సెలవుల సీజన్‌లో రద్దీకి సంబంధించి ప్రయాణికుల ఫిర్యాదులకు ప్రతిస్పందనగా డివిజన్ టికెట్ చెకింగ్ డ్రైవ్‌ను నిర్వహించింది. ఇంటెన్సివ్ డ్రైవ్ తరువాత రోజుకు 22 ఫిర్యాదులకు గణనీయమైన తగ్గుదల నమోదైంది.

కాలం చెల్లిన, నిషేధిత మందులు విక్రయిస్తే కఠిన చర్యలు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఔషధ దుకాణాల్లో కాలం చెల్లిన, నిషేధిక మందులు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. కలెక్టర్ లక్ష్మీశ బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఔషధ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఔషధ దుకాణాల కార్యకలాపాలపై ఆరా తీశారు. అనుభవం లేని వ్యక్తులు మందులు విక్రయిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏ దుకాణంలోనైనా ఫార్మసిస్టులు లేకుండా ఔషధాలు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. తప్పనిసరిగా ప్రిస్క్రిప్షన్ ప్రకారం మాత్రమే ఫార్మసిస్టులు మందులు అందజేయాలని తెలిపారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ఎప్పటికప్పుడు తనిఖీలకు సంబంధించి నివేదికలు అందించాలని ఆదేశించారు. సమావేశంలో ఔషధ నియంత్రణ పరిపాలన అసిస్టెంట్ డైరెక్టర్ కె.అనిల్ కుమార్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.


గుణదల విద్యుత్‌సౌధలో యాజమాన్యాలతో కార్మిక సంఘం ప్రతినిధుల సమావేశం

ఎన్టీటీపీఎస్ కార్మికుల సమస్యలపై విద్యుత్ సంస్థల సానుకూల స్పందన

» తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పర్వతనేని సాంబశివరావు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ ఎన్టీటీపీఎస్‌లోని ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలపై విద్యుత్ సంస్థల యాజమాన్యాలు జెన్కో, ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ సీఎండీలు సానుకులంగా స్పందించినట్టు తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పర్వతనేని సాంబశివరావు తెలిపారు. బుధవారం గుణదల విద్యుత్‌సౌధలో యాజమాన్యలతో కార్మిక సంఘం ప్రతినిధులు ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై చర్చించగా సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యుత్ సంస్థల బలోపేతానికి పనిచేస్తున్న యూనియన్‌కు యాజమాన్యాలు న్యాయం చేయాలని కోరామన్నారు. చర్చలు హామీలకే పరిమితం కాకుండా యాజమాన్యాలు ముందుగుడు వేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పి.సుగుణాకరరావు తదితరులు పాల్గొన్నారు.



సుంకర జ్యోత్స్నకు నివాళులర్పిస్తున్న బెజవాడ బార్ న్యాయవాదులు

సుంకర జ్యోత్స్నకు న్యాయవాదుల నివాళి

విజయవాడ లీగల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి సుంకర జ్యోత్స్న ఏడాది క్రితం రోడ్డుప్రమాదంలో మృతిచెందడం బాధాకరమని బెజవాడ బార్ అధ్యక్షుడు ఏకే బాషా అన్నారు. బార్ అసోసియేషన్‌లో బుధవారం జ్యోత్స్న చిత్రపటానికి న్యాయవాదులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ, న్యాయవాదుల టూర్‌లో వెళ్లిన జ్యోత్స్న గత ఏడాది రోడ్డుప్రమాదానికి గురై మృతిచెందడం బాధాకరమన్నారు. మహిళల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేసిన జ్యోత్స్న అందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్, కుటుంబసభ్యులతో పాటు న్యాయవాదులు చిలువేరు మార్కండేయ, సప్పా రమేష్, బొమ్మసాని రవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కూన రవికుమార్, పక్కన కలెక్టర్ లక్ష్మీశ

లెక్క చెప్పాల్సిందే..

» శాసన వ్యవస్థ కమిటీలను తేలిగ్గా తీసుకుంటే ఉపేక్షించేది లేదు

» ప్రభుత్వ రంగ సంస్థల పనితీరుపై కమిటీ చైర్మన్ సమీక్ష

» ఉన్నతాధికారుల గైర్హాజరుపై అసంతృప్తి

కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఖర్చుచేసే ప్రతి పైసా గురించి ప్రభుత్వరంగ సంస్థలు శాసనవ్యవస్థకు సమాధానం చెప్పాల్సి వుంటుందని సంస్థల సంఘం చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏడు ప్రభుత్వ రంగసంస్థల పనితీరుపై బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశానికి హాజరైన పీయూసీ చైర్మన్, సభ్యులకు కలెక్టర్ లక్ష్మీశ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, సొసైటీలతో కలిపి రాష్ట్రంలో సుమారు 236 ప్రభుత్వరంగ సంస్థలున్నాయని తెలిపారు. వీటికి సంబంధించిన వార్షిక ఆడిట్ నివేదికలు, ఆదాయ, వ్యయాలు, ఖాతాల (అకౌంట్స్)పై కమిటీ అధ్యయనం చేస్తుందని చెప్పారు. శాసన వ్యవస్థ స్టాట్యూటరీ కమిటీలలో ప్రభుత్వ లెక్కల సంఘం (పీఏసీ), అంచనాల సంఘం, ప్రభుత్వ రంగ సంస్థల సంఘం (పీయూసీ) ఉన్నాయని చెప్పారు. కొన్నేళ్లుగా ప్రభుత్వ రంగ సంస్థల సంఘం కాగితాలకే పరిమితమైందని, దీనిగురించి సంస్థల ఉన్నతాధికారులకు కూడా అవగాహన ఉండటం లేదన్నారు. కమిటీ ఆదేశాలను తేలిగ్గా తీసుకొంటే ఉపేక్షించేది లేదని, ఏ స్థాయి అధికారి అయినా పీయూసీ ముందు హాజరు కావాల్సిందేనని చెప్పారు. కొన్ని సంస్థల ఎండీలు ముందస్తు సమాచారం ఇవ్వకుండా గైర్హాజరు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీసీపీడీసీఎల్, ఏపీ ఆయిల్ ఫెడ్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్‌ల నివేదికలపై కూలంకషంగా చర్చించారు. ఏపీసీపీడీసీఎల్‌కు ప్రభుత్వం, ప్రజల నుంచి అందాల్సిన బకాయిల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సెక్యూరిటీ డిపాజిట్ మొత్తాన్ని ఎందుకు చెల్లించడం లేదని, ఎక్కువ వసూలు చేసి తక్కువ ఎలా తిరిగిస్తారని ప్రశ్నించారు.

కమిటీ సభ్యుడు, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో వుండటం వల్ల జి.కొండూరు మండలంలో ఒకరు చనిపోయారని వీటిపై దృష్టిపెట్టాలని సూచించారు. మరో సభ్యుడు బత్తుల ఆనందరావు మాట్లాడుతూ, జూనియర్ లైన్‌మెన్‌లు వేరేవారి విద్యుత్ స్తంభంపైకి ఎక్కిస్తున్నారని, కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇలాంటివి జరగకుండా చూడాలని చెప్పారు. ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోయర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ (ఏపీ ఆయిల్ ఫెడ్) లాభాల్లో కొనసాగుతుండటంపై ప్రభుత్వరంగ సంస్థల కమిటీ అభినందనలు తెలిపింది. సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ, ప్రభుత్వ రంగ సంస్థల సంఘం సభ్యులైన ఎమ్మెల్యేలు గౌతు శిరీష, అయితా బత్తుల ఆనందరావు, వర్ల కుమార్ రాజా, తెనాలి శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, శాసనసభ సంయుక్త కార్యదర్శి సుబ్బారెడ్డి, సహాయ కార్యదర్శి నాగమునెయ్య, విభాగాధికారి సతీష్, విజయవాడ ఆర్డీవో చైతన్య, డీఆర్ఎం ఎం.లక్ష్మీనరసింహం, వివిధ ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


వ్యాపారుల ఇళ్ల వద్ద అధికారుల తనిఖీలు

విజయవాడలో ఐటీ దాడులు

» నకిలీ వ్యాపారుల గుట్టురట్టు



విజవాడ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : కంది పప్పు, పెసరపప్పు, మినపప్పు ఇలా నకిలీ పప్పులను మార్కెట్లోకి దించి కోట్లాది రూపాయలు ఆర్జించిన వ్యాపారుల గుట్టును ఇన్‌కం ట్యాక్స్ అధికారులు రట్టు చేశారు. రాష్ట్రంలో ఈ తరహా వ్యాపారులు చేస్తున్న వారి ఇళ్లలో సోదాలు చేశారు. విజయవాడలో దేసు మురళీ ఇంట్లో ఇన్‌కం టాక్స్ అధికారులు సోదాలు చేశారు. పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ పప్పుల వ్యాపారం ద్వారా కోట్లాది రూపాయలు వెనుకేసినట్టు తెలుస్తోంది.


అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో జేసీ ఇలక్కియా

ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోండి

» ఎన్టీఆర్ జిల్లా జేసీ ఇలక్కియా

కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు సంబంధిత అంశాలపై జేసీ ఎస్.ఇలక్కియా బుధవారం జిల్లాస్థాయి ధాన్యం కొనుగోలు కమిటీ సభ్యులు, పౌరసరఫరాల మేనేజర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఏఎస్వోలు, సీఎస్ డీటీలు, ఏడీఏలు, ఎంఏవోలు, వీఏఏలతో ఆమె ఛాంబర్‌లో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లాలో మొత్తం 3,03,154 మెట్రిక్ టన్నుల ధాన్యం సాగు జరిగినట్టు జేసీ తెలిపారు. అందులో 2,00,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాథమికంగా అక్టోబరు 20 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్టు తెలిపారు. అలాగే, ఆర్ఎస్‌కేలలో గోనె సంచుల ఏర్పాటు, మిల్లుల నుంచి బ్యాంక్ గ్యారెంటీ సేకరణ వంటి అంశాలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ క్రాప్ నమోదును వేగవంతం చేయాలని, అలాగే వాహనాల రిజిస్ట్రేషన్, జీపీఎస్ వ్యవస్థాపనను త్వరితగతిన పూర్తిచేయాలని జేసీ సూచించారు.

రహదారులకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

దెబ్బతీశాయి. వరద నీటి ప్రవాహంతో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మొన తేలిన రాళ్లపై ప్రయాణం నరకప్రాయమైంది. అయితే ఈ మూడు సర్కిల్‌లలో దెబ్బతిన్న రోడ్లను ఆర్ అండ్ బీ అధికారులు ఎప్పటికపుడు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించారు.

రాష్ట్ర రహదారులకు మోక్షం

ప్రాధాన్యత క్రమంలో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు ఆర్ అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. విజయవాడ డివిజన్‌లోని రెండు రోడ్లకు, మైలవరం డివిజన్‌లోని ఒక రోడ్డుకు, మచిలీపట్నం డివిజన్‌లోని ఐదు రోడ్లకు నిధులు విడుదలయినట్లు పేర్కొన్నారు. వీటిల్లో చిల్లకల్లు-వేదాద్రి-బండిపాలెం-కొణకంచి రోడ్డు ఎనిమిది కిలోమీటర్ల అభివృద్ధికి, జగ్గయ్యపేట-వేదాద్రి రోడ్డు 3.5 కిలోమీటర్ల అభివృద్ధికి రూ.4 కోట్లు, నందిగామ-పొక్కునూరు రోడ్డు ఐదు కిలోమీటర్ల అభివృద్ధికి రూ.2.80 కోట్లు, మైలవరం-నూజివీడు రోడ్డు 4.08 కిలోమీటర్ల అభివృద్ధికి రూ.6 కోట్లు, గన్నవరం-పుట్టగుంట రోడ్డు 8.8 కిలోమీటర్ల అభివృద్ధికి రూ.7 కోట్లు, మచిలీపట్నం-కమ్మవారిచెరువు(వయా చిన్నాపురం) రోడ్డు ఏడు కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.6 కోట్లు, మచిలీపట్నం-కమ్మవారిచెరువు(వయా కోన) రోడ్డు 3.63 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.3 కోట్లు, కౌతవరం-నిడుమోలు-ఐలూరు రోడ్డు 7.45 కిలోమీటర్ల అభివృద్ధికి రూ.4 కోట్లు, నడుపూరు-వాడవల్లి-కోరుకొల్లు రోడ్డు 4.8 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.4 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లా ప్రధాన రహదారులు ఇవే..

విజయవాడ నగరంలోని ఇంద్రకీలాద్రి టన్నెల్, మద్రాస్- కోల్‌కతా పాత రోడ్డు 4.10 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి రూ.2.70 కోట్లు, కేవీఫై బైపాస్, ఎన్‌హెచ్-65 నుంచి గోకరాజుపల్లి వయా గండేపల్లి, నందలూరు, తాటిగుమ్మి 10.40 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి రూ.4.10 కోట్లు, జగ్గయ్యపేట-షేర్ మహ్మద్‌పేట రోడ్డు 1.60 కిలోమీటర్ల అభివృద్ధికి రూ.3.50 కోట్లు, ఉప్పులూరు నుంచి మద్దూరు, పునాదిపాడు నుంచి పెదపారుపూడి 7.70 కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధికి రూ.4.90 కోట్లు, ఎంవీ రోడ్డు నుంచి కోసూరుకు వయా నిమ్మకూరు, అవురుపూడి 8 కిలోమీటర్ల రోడ్డుకు రూ.3.10 కోట్లు, పర్ణశాల, గండేపూడి రోడ్లకు రూ.4.20 కోట్లు, నాగాయలంక- కోడూరు రోడ్డుకు 4.50 కోట్లు, ఎర్రమాడు, కొమ్మిరెడ్డిపల్లి, తిరువూరు రోడ్ల అభివృద్ధికి రూ.4.70 కోట్లు మంజూరయ్యాయి.

జలవాడ

(5వ పేజీ తరువాయి)

సమయంలో తీవ్ర ఎండతో ప్రజలు అల్లాడారు. ఉక్కపోత తో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మధ్యాహ్నం 3.30 గంటలకు అనూహ్యంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని వాతావరణం ఒక్కసారిగా చల్లబడి మేఘాల నీడలోకి నగరం చేరింది. ఉరుముల గర్జన, మెరుపు వెలుగులతో నాలుగు గంటలకు మొదలైన చినుకు అతికొద్ది క్షణాల్లోనే భారీ వర్షంగా మారింది. దీంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఏ రోడ్డు చూసినా కార్లు, బైక్‌లతో నిండిపోయింది. ఐదు గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఆకాశానికి చిల్లు పడిందా అనే రీతిలో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. బెంజిసర్కిల్ వంటి కొన్ని మెరక ప్రాంతాల్లోనూ నీరు నిలిచిపోయింది. పలు అపార్ట్‌మెంట్‌ల సెల్లార్లులోకి నీరుచేరింది. బందరు రోడ్డులోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి రైతుబజారు రోడ్డు వరకు నీరు నిలిచిపోయింది. జమ్మిచెట్టుసెంటర్, పాలిక్లీనిక్ రోడ్డు, నిర్మలా కాన్వెంట్ రోడ్డు, ఇందిగాంధీ స్టేడియం, సీతారామపురం, గుణదల ఈఎస్‌ఐ రోడ్డులో వర్షపు నీరు భారీగా చేరింది.

స్తంభించిన ట్రాఫిక్

వర్షంతో ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. సాయంత్రం ఐదు గంటల తర్వాత వర్షం ఆగిపోవడంతో వాహనాలన్నీ ఒకేసారి రోడ్డెక్కాయి. అదే సమయంలో స్కూల్, కాలేజీలు వదలడంతో నగరం ట్రాఫిక్ చక్రబంధంలో ఇరుక్కుపోయింది. పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి ఎంజీ రోడ్డుపై, ఏలూరు రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. బెంజిసర్కిల్ నుంచి పీవీపీ మాల్ వరక ఒక వైపు, ఆటోనగర్ గేటు వరకు మరో వైపు వాహనాలు నిలిచాయి. ఏలూరు రోడ్డులోని విజయటాకీస్ సెంటర్, చుట్టుగుంట వద్ద ట్రాఫిక్ స్తంభించింది. గుణదల వైపు నుంచి, మహానాడు జంక్షన్ నుంచి వస్తున్న వాహనాలతో రామవరప్పాడు రింగ్ వద్ద భారీ స్థాయిలో వాహనాలు నిలిచిపోయాయి.

కంచికచర్లలో నకిలీ ప్రకంపనలు!

» పలు బెల్టు షాపుల్లో విక్రయాలు జరిగాయని ఆరోపణ


కేసీఎల్ స్టిక్కరు వేసిఉన్న మద్యం సీసాలు

(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి) : నకిలీ మద్యం ప్రకంపనలు కంచికచర్లను తాకాయి. ఈ ప్రాంతంలోని పలు బెల్టుషాపుల్లో నకిలీ మద్యం విక్రయించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై జిల్లా ఎక్సైజ్ ఉన్నతాధికారులు రహస్యంగా విచారణ జరుపుతున్నారు. కంచికచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో మొత్తం ఎనిమిది మద్యం దుకాణాలున్నాయి. దుకాణాల నిర్వాహకులు సిండికేట్‌గా ఏర్పడ్డారు. వారి ఆధ్వర్యంలోనే మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. రెండు మండలాల్లో బెల్టు షాపులకు కొదవలేదు. ఒకవైపు సిండికేట్, మరోవైపు ఎక్సైజ్ అండతో బెల్టు షాపులు యథేచ్ఛగా నడుస్తున్నాయి. మద్యం బాటిళ్లపై ఎక్సైజ్ స్టిక్కర్‌ను తొలగించి, సిండికేట్లు ప్రత్యేకంగా తయారు చేయించిన స్టిక్కర్లు వేస్తుండటం విశేషం. సిండికేట్‌లో పనిచేసే ఓ వ్యక్తి, ఎక్సైజ్ స్టేషన్‌లో కాంట్రాక్టు పద్ధతిపై పనిచేసే మరొకరు కలిసి నకిలీ మద్యం బెల్టు షాపులకు సరఫరా చేశారన్న ఆరోపణలున్నాయి. సిండికేట్లకు కూడా తెలియకుండా వీరు ఇబ్రహీంపట్నం మండలం దొనబండ వద్ద ఒక ఫ్లైయాష్ ఇటుకల ప్లాంట్‌లో స్టాక్ పెట్టారని తెలిసింది. అక్కడి నుంచి ఎంపిక చేసిన బెల్టు షాపులకు సరఫరా చేశారని చెపుతున్నారు. కొద్దిరోజుల క్రితం గనిఆత్కూరు గ్రామంలో నకిలీ మద్యం వెలుగుచూసింది. ఎక్సైజ్ అధికారులు ఒత్తిళ్లకు లొంగి తూతూమంత్రంగా తనిఖీలు చేసి, చేతులు దులుపుకున్నారని సమాచారం. దీనికితోడు నకిలీమద్యం కేసులో ఏ1గా ఉన్న జనార్దన్ కంచికచర్లలోని ఓ దుకాణంలో వాటాదారుడని సమాచారం. కంచికచర్లలో కూడా నకిలీ మద్యం విక్రయించినట్టు ఆధారాలు లభించటంతో ఎక్సైజ్ ఉన్నతాధికారులు కొంతమంది బెల్టు షాపుల నిర్వాహకులను అదుపులోకి తీసుకుని విచారించినట్టు తెలిసింది. స్థానిక ఎక్సైజ్ అధికారులను విజయవాడ పిలిపించి మద్యం దుకాణాలకు సంబంధించి రోజువారీ విక్రయాలు, స్టాకు ఇండెంట్ల వివరాలను పరిశీలిస్తున్నారు.

నకిలీ కహానీలు!

(5వ పేజీ తరువాయి)

అరెస్టు చేశారు. జనార్దనరావు నుంచి వారానికి 10-15 నకిలీ కేసులను కొనుగోలు చేసి వైన్స్‌లో విక్రయించాడు. ఇందులో వచ్చిన ఆదాయంలో సగభాగాన్ని కల్యాణ్ తీసుకున్నాడు. దీనికి సంబంధించిన ఆధారాలు లభించడంతో అధికారులు అతడికి సంకెళ్లు వేశారు. నకిలీ మద్యం కేసులో ఇప్పటి వరకు మొత్తం నలుగురు నిందితులను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు.

'ఫుల్' పండగ

జనార్దనరావు నకిలీ మద్యాన్ని విక్రయించడంలో చాలా తెలివిగా వ్యవహరించాడు. మందు బాబులకు ఏమాత్రం అనుమానం రాకుండా, వారు చూసినా గుర్తు పట్టలేని విధంగా సరుకును చలామణి చేశారు. మొలకలచెరువులో నకిలీ యూనిట్ నడవడం మొదలుపెట్టిన తర్వాత ఇబ్రహీంపట్నంలో తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. మందుబాబులు ఎక్కువగా వచ్చి రద్దీగా ఉన్నప్పుడు నకిలీ మద్యం సీసాలు బయటకు వచ్చేవి. ఇబ్రహీంపట్నంలో ఏఎన్ఆర్ బార్‌లో మందు బాబులు ఎక్కువ సంఖ్యలో ఉన్నప్పుడు టేబుళ్ల మీద నకిలీ మద్యం సరుకు ప్రత్యక్షమయ్యేది. మంజీర, కేరళ, ఓల్డ్‌మ్యాన్షన్ వంటి నకిలీ బ్రాండ్లను మందుబాబులకు విక్రయించారు. ఏఎన్ఆర్, శ్రీనివాస వైన్స్‌లో ఇదే జరిగినట్టు తెలుస్తోంది. పైగా ఒడిశాకు చెందిన యువకులు ద్విపాత్రాభినయం చేసేవారు. జనార్దనరావు, సోదరుడు జగన్మోహనరావుకి సంబంధించి షాపుల్లో ఉద్యోగులుగా మారిపోయారు. ఒడిశాకు చెందిన బాదల్ దాస్, ప్రదీప్ దాస్‌లను జగన్మోహనరావుకు సంబంధించి కిరాణా షాపులో, జనార్దనరావు చెందిన ఏఎస్ఆర్ బార్‌లో ఉద్యోగులుగా అవకాశాలు ఇచ్చారు. నకిలీ మద్యం తయారీ, చలామణిలో కీలకంగా వ్యవహరిస్తే అధిక వేతనాలు ఇస్తామని మభ్యపెట్టారు. నకిలీ మద్యం విక్రయించిన జాబితాలో ప్రస్తుతం శ్రీనివాస వైన్స్ పేరు వెలుగులోకి వచ్చింది. ఇంకా కొన్ని మద్యం దుకాణాలకు ఈ లింక్‌లతో సంబంధం ఉందని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

సీఎం యాప్ ద్వారానే కొనుగోళ్లు చేయాలి

» కపాస్ కిసాన్ యాప్‌పై పత్తి రైతుల విముఖత

» స్లాట్ బుకింగ్స్‌తో కొత్త సమస్యలు వస్తాయని ఆవేదన

» 15 నుంచి పత్తి కొనుగోళ్లకు సీసీఐ నిర్ణయం

» పకడ్బందీగా నిబంధనల అమలు


పత్తి బోరాలు

(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి) : పత్తి కొనుగోళ్లకు సంబంధించి సీసీఐ ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ యాప్‌ను రైతులు వ్యతిరేకిస్తున్నారు. కపాస్ కిసాన్ యాప్ వల్ల పలు ఇబ్బందులు తలెత్తుతాయని, గతంలో మాదిరిగా సీఎం యాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకుని, పంట కొనాల్సిందిగా కోరుతున్నారు. నందిగామ డివిజన్ పరిధిలో ఈ ఏడాది 30 వేల ఎకరాలకు పైగా రైతులు పత్తి సాగుచేశారు. కొద్ది రోజుల్లో పత్తి తీతలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 15 నుంచి రాష్ట్రంలో ఎంపిక చేసిన 30 కేంద్రాల్లో పత్తి కొనుగోలు చేయాలని, భారత పత్తి సంస్థ (సీసీఐ) నిర్ణయించింది. ఈ ఏడాది దేశంలోనే మొదటిసారిగా పత్తి కొనుగోళ్లకు సంబంధించి సీసీఐ కపాస్ కిసాన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. దేశవ్యాప్తంగా ఈ యాప్ ద్వారానే పత్తి కొనుగోళ్లు చేయాలన్న పట్టుదలతో సీసీఐ అధికారులు ఉన్నారు. పత్తి రైతులందరూ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, పేరు, ఆధార్ నెంబర్, బ్యాంకు ఖాతా వివరాలు, పంటసాగు విస్తీర్ణం, దిగుబడి వివరాలు నమోదు చేయాలని సూచించింది. తర్వాత పత్తి విక్రయాలకు యాప్ ద్వారానే స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంది. ఈ సీజన్‌కు సంబంధించి కేంద్రం ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ. 8,110లు పొందేందుకు తప్పనిసరిగా ఈయాప్‌ను రైతులందరూ వినియోగించాలని సీసీఐ కోరుతున్నది. దీనివల్ల నిరీక్షించాల్సిన అవసరం ఉండదని, రైతులకు ముందుగా సమాచారం తెలుస్తుందని చెబుతోంది. అయితే ఈ యాప్‌ను వాడేందుకు రైతులు విముఖత చూపుతున్నారు. గతంలో సీఎం యాప్ ద్వారానే కొనుగోళ్లు జరిగేవి. రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి సీఎం యాప్‌లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలి. స్లాట్ పద్ధతి గందరగోళంగా ఉంటుందని, తెలియని వారికి కొత్త సమస్యలు వస్తాయని రైతులు చెపుతున్నారు. రైతుల కోరిక మేరకు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల ఉన్నతాధికారులు కూడా ఈ ఏడాది కపాస్ కిసాన్ యాప్ వద్దని, సీఎం యాప్ ద్వారా కొనుగోళ్లు జరపాల్సిందిగా సీసీఐను కోరారు. రెండు రోజుల క్రితం సీసీఐ ఇచ్చిన నోటిఫికేషన్‌లో కపాస్ కిసాన్ యాప్ ద్వారా కొనుగోళ్లు జరుగుతాయని పేర్కొనగా, ఈ ఏడాది సీఎం యాప్ ద్వారా కొనుగోళ్లు జరుగుతాయని ఉన్నతాధికారులు, స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులకు సమాచారం అందించారు.

నిబంధనలు పకడ్బందీగా అమలు

ఈ ఏడాది ముఖ్యంగా తేమకు సంబంధించి నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సీసీఐ భావిస్తోంది. పత్తిలో తేమశాతం ఎనిమిది శాతానికి లోబడి ఉన్నట్టయితే మద్దతు ధర లభిస్తుంది. ఎనిమిది శాతానికి మించితే మద్దతు దరలో ఒక శాతం వంతున ధర తగ్గిస్తుంది. తొమ్మిది శాతానికి రూ. 81.11లు, పది శాతానికి రూ.162.22లు, 11శాతానికి రూ.243.33లు, 12శాతం ఉన్నట్లయితే రూ. 324.44లు వంతున ధరలో కోత పెడుతుంది. ఇక తేమ 12 శాతానికి మించి ఉన్నట్లయితే పత్తిని కొనుగోలు చేయదు. ఈ నిబంధనను పకడ్బందీ అమలు చేస్తామని సీసీఐ పేర్కొన్నది.

గ్రావెల్ దొంగలు!

(5వ పేజీ తరువాయి)

ఎనిమిది ట్రాక్టర్లు, రెండు జేసీబీలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అప్పట్లో గార్డుకు అప్పగించారు. ఆ తర్వాత పైస్థాయిలో ఏ అధికారిణి నుంచి ఆదేశాలు వచ్చాయో తెలియదు కానీ వాటిని వదిలేశారు. స్థానికులు గమనిస్తున్నారన్న ఉద్దేశ్యంతో రాత్రుళ్లు తవ్వకాలకు తెరలేపారు. దీంతో మెట్లపల్లి అడవిలో పెద్ద ఎత్తున గ్రావెల్ తోలకం జరిగింది. గ్రావెల్ అక్రమార్కులు ఎవరన్నది సస్పెన్స్‌గా మారింది. వేళ్లన్నీ అటవీశాఖ అధికారులవైపే చూపిస్తున్నాయి. గ్రావెల్ అక్రమ తవ్వకాల వెనుక అటవీ అధికారులే చక్రం తిప్పారన్న చర్చ నడుస్తోంది. మెట్లపల్లి అటవీ ప్రాంతం వీరపనేనిగూడెం పరిశ్రమల ప్రాంతానికి దగ్గరగా ఉంటుంది. అప్పట్లో కంపెనీల అవసరాలకు పెద్ద ఎత్తున గ్రావెల్‌ను తరలించినట్టుగా తెలుస్తోంది. నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలలో అవసరం ఉన్న చోట డిమాండ్‌ను బట్టి విక్రయించినట్టుగా సమాచారం. చిన్న, మధ్య తరహా నాన్ లే అవుట్లకు కూడా ఇక్కడి నుంచే గ్రావెల్ అనధికారికంగా తరలివెళ్లిపోయినట్టుగా తెలుస్తోంది. అర్ధరాత్రుళ్లు భారీగా మెట్లపల్లి అడవిలో గ్రావెల్‌ను తవ్వుతున్నారన్న సమాచారంతో స్థానికులు నిఘా పెడుతుండటంతో అక్రమ తవ్వకాలు ఆగిపోయాయి.

జోగి రమేశ్‌పై కేసు నమోదు


ఇబ్రహీంపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నం ఏఎన్నార్ పాత బార్ ప్రాంతంలో ఎక్సైజ్ అధికారుల విధులకు ఆటంకం కలిగించినందుకు వైసీపీ నేత, మాజీమంత్రి జోగి రమేశ్ అతడి అనుచరులపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ములకలచెరువు నకిలీ మద్యం ఆనవాళ్లు ఇబ్రహీంపట్నం ఏఎన్నార్ బార్ వద్ద లభించడంతో విచారణకు వచ్చామని, అక్కడ విధులు నిర్వహిస్తుండగా జోగి రమేశ్ అనుచరులతో వచ్చి తమ విధులకు ఆటంక పర్చడమే కాకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయించారని ఈస్ట్ ఎక్సైజ్ అధికారి పెద్దిరాజు, టాక్స్‌ఫోర్స్ ఎస్ఐ వర్మలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జోగి అతడి అనుచరులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు సీఐ ఎ.చంద్రశేఖర్ తెలిపారు.

వసతి గృహ ఆకస్మిక తనిఖీ

» బాలికలకు ఏర్పాట్లపై కలెక్టర్ ఆరా

కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ లక్ష్మీశ పాయకాపురంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు తాగునీరు అందిస్తున్న వ్యవస్థను పరిశీలించారు. తాగేందుకు మినరల్ వాటర్ అందిస్తున్నామని వసతి గృహ అధికారులు తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ ఆవరణలోని కిచెన్ గార్డెన్ పరిశీలించి, గార్డెన్ అభివృద్ధికి అవకాశం వున్నందున ఆ దిశగా దృష్టి సారించాలని ఆదేశించారు. పిల్లలు అనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్తగా చూడాలని ఆదేశించారు. ఈ మధ్య ఎవరైనా విష జ్వరాలు లేదా డయేరియా బారిన పడ్డారా అని అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లతో పాటు మిగిలిన అన్ని వసతులు సరైన విధంగా వుండేలా చూసుకోవాలని, పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. వసతి గృహాలపై నిరంతర పర్యవేక్షణ వుంటుందని తెలిపారు. కలెక్టర్ వెంట వసతిగృహ సంక్షేమ అధికారులు కె.సరోజ, గ్రేస్, పి.సుజాత పాల్గొన్నారు.

విజయవాడ తూర్పు


ఏయూ ఉపకులపతి వెంటనే రాజీనామా చేయాలి: ఏఐఎస్ఎఫ్

గాంధీనగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీలో విద్యార్థి మణికంఠ మృతికి కారణమైన ఉపకులపతి వెంటనే రాజీనామా చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. స్థానిక దాసరిభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఉపాధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడారు. యూనివర్సిటీలో బీఈడీ సెకండ్ ఇయర్ చదువుతన్న మణికంఠ అనారోగ్యం బారినపడటంతో తోటి విద్యార్థులు యూనివర్సిటీ అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. ఆక్సిజన్ అందక అతను మృతి చెందాడని అంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్లు కూడా లేకపోవడం సిగ్గుచేటన్నారు. సాదిక్‌బాబు, రంజిత్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని టూరిజంగా అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తమ కూటమి ప్రభుత్వ హయాంలో నగరాన్ని పారిశ్రామికంగానే కాకుండా టూరిజంగా కూడా అభివృద్ధి చేస్తామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. తూర్పు పరిధి 4వ డివిజన్ ఎల్ఐసీ కాలనీలో నెల్సన్ మండేలా పార్కు పరిసర ప్రాంతాల్లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ బుధవారం పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం 4వ డివిజన్‌లో రూ.24లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన తాగునీటి సరఫరా పైపులు అమర్చే పనులకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పరిసర ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపన ద్వారా ఇక్కడి యువతకు వేల సంఖ్యలో ఉద్యోగాలు వస్తాయని, నగరాన్ని టూరిజంగా అభివృద్ధి చేయడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. రోడ్లనిర్మాణంతో పాటుగా డ్రెయినేజీ సౌకర్యాలను కూడా కల్పిస్తామన్నారు. అభివృద్ధిలో భాగంగా 4వ డివిజన్‌లో రూ.24లక్షల అంచనా వ్యయంతో తాగునీటి పైపులను అమర్చే పనులను ప్రారంభించినట్లు తెలిపారు. పార్టీ నాయకులు వటపట్ల గోపాలకృష్ణ, నందిపాటి దేవానంద్, గద్దె రమేష్, యలమంచిలి రాజేష్, దోమకొండ రవి, కొర్రపాటి సురేంద్ర, కార్పొరేషన్ ఏఈ దీక్షిత్, తదితరులు పాల్గొన్నారు.


తాగునీటి సరఫరా పైపులు అమర్చే పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గద్దె

క్రమశిక్షణకు క్రీడలు దోహదం

లబ్బీపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం లభిస్తాయని పటమట జడ్పీహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు వీవీఎస్ సత్యనారాయణ పేర్కొన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్14, 17 మండల స్థాయి ఎంపికలు మంగళవారం నుంచి పటమట జడ్పీహెచ్ స్కూల్‌లో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ క్రీడలతో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ పెంపొందుతాయని అన్నారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు డివిజనల్ స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, చెస్ షటిల్ బ్యాడ్మింటన్, యోగా తదితర అంశాలలో ఎంపికలు నిర్వహించారు. జిల్లా కార్యదర్శి దుర్గారావు, డివిజన్ ఇన్‌చార్జ్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

వెలగని వీధిలైట్లు ....కాలనీ వాసుల తిప్పలు

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: మెయిన్ రోడ్డు, అంతర్గత రోడ్డులో సరిగా వెలగని వీధిలైట్లతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడో డివిజన్ పరిధిలోని శ్రీరామచంద్రనగర్ కాలనీ వినాయకుడి గుడి రోడ్డుతో పాటు పలు అంతర్గత రోడ్లలో ఏర్పాటుచేసిన వీధిలైట్లు సరిగ్గా వెలగడం లేదు. అంతేకాకుండా మహానాడు రోడ్డు నుంచి శ్రీరామమందిర్ వరకు వెళ్లే రోడ్డులో ఉన్న విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రి సమయంలో ఈ రోడ్లు మొత్తం అంధకారంగా మారుతున్నాయి. దీంతో ఆ సమయంలో బయటకు రావాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


వినాయకుడి గుడి రోడ్డులో పనిచేయని వీధిలైటు
రామమందిరం రోడ్డులో కొత్తగా వేసిన విద్యుత్ స్తంభం

నిరుపయోగంగా రక్షిత పథకం

తాగునీటి కోసం రామలింగేశ్వరనగర్ వాసుల పాట్లు

రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి: 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ శ్మశాన వాటిక సమీపంలో కృష్ణా నదీ తీరాన ఉన్న వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నదీ తీరాన ఉన్న సాయి రోడ్డు, రఘు రోడ్డు, గాంధీ కాలనీ, పలు వీధులలో మంచినీటి కుళాయి కనెక్షన్లు లేక వీధి పంపుల వద్ద క్యూలో నిలబడి పట్టుకోవలసి వస్తుందని, అయినా నీరు చాలక పంపుల వద్ద కొట్లాటలు, గొడవలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. ఈ విషయమై ప్రజలు అధికారులను పలుమార్లు కోరగా వారు నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్ అమలులోకి వస్తే కుళాయి కనెక్షన్లు ఇస్తామని చెప్పారని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఎప్పుడు ప్రారంభమవుతుందో మా నీటి కష్టాలు ఎప్పటికి తీరతాయోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మంచినీటి కనెక్షన్ల నిమిత్తం రామలింగేశ్వరనగర్ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులు గమనించి త్వరితగతిన మంచినీటి వాటర్ ట్యాంక్ ను ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.


రామలింగేశ్వరనగర్ మంచినీటి ట్యాంక్

11న కృష్ణ అభిమానుల ఆత్మీయ సదస్సు

గవర్నర్‌పేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సూపర్‌స్టార్ కృష్ణకు కేంద్ర ప్రభుత్వం దాదాసాహెబ్ పాల్కే అవార్డు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న మధ్యాహ్నం 4 గంటల నుంచి 5 రాష్ట్రాలకు చెందిన కృష్ణ అభిమానుల ఆత్మీయ సమావేశం జరుగుతుందని ఆలిండియా సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు కె. సుధాస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి దాదాసాహెబ్ పాల్కే అవార్డు కృష్ణకు ప్రకటించేలా రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేస్తూ సమావేశంలో తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. కృష్ణ సోదరుడు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు ఆశీస్సులతో జరిగే సమావేశానికి అభిమానులు హాజరుకావాలని కోరారు.


నగరంలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రధాన కాలనీల రోడ్లు జలమయం అయ్యాయి. డీవీ మనార్ రోడ్డు, పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డు, పీవీపీ రోడ్డు, ఐదోనెంబర్ రోడ్డులోని ఐటీఐ కాలేజీ సెంటర్, ఎల్ఐసీ కాలనీ అంతర్గత రోడ్లు, నిర్మల కాన్వెంట్ రోడ్డు భారతీనగర్ కాలనీ సర్వీస్ రోడ్డు, కరెన్సీనగర్ కాలనీ అంతర్గత రోడ్లలో వరదనీరు చేరడంతో రోడ్లన్నీ నీట మునిగాయి. ఈ సమయంలో అన్ని రోడ్లలో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.
- భారతీనగర్, ఆంధ్రజ్యోతి

సిద్ధార్థ మెడికల్ కాలేజీలో పందుల సంచారం

● పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యం ● పట్టించుకోని అధికారులు

విజయవాడ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మెడికల్ కాలేజీలో పందులు తిరుగాడుతూ పరిసరాలను అపరిశుభ్రం చేయడంతో సిబ్బంది, విద్యార్థులు, పక్కనే ఉన్న ఆసుపత్రికి వచ్చే వైద్యుల సహాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని నెలల కిందట ఇదే కాలేజీ ఆవరణలో గంజాయి బ్యాచ్‌లు గంజాయి, మద్యం తాగుతూ పరిసరాల్లో గందరగోళం సృష్టించిన విషయం తెలిసిందే. అది మరువక ముందే పందులు సంచరిస్తూ కాలేజీ వాతావరణంతో పాటు ఆసుపత్రి వాతావరణాన్ని దుర్గంధంగా మారుస్తున్నా సిబ్బంది, అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందులోను కొత్తగా నిర్మిస్తున్న భవనం వద్ద ఈ పరిస్థితి కనిపించడం గమనార్హం. కాలేజీ ఆవరణలోనే ఇలా ఉంటే ఆసుపత్రిలో పరిస్థితి ఎలా ఉంటుందోనని రోగుల సహాయకులు అనుకుంటున్నారు. వందల మంది సెక్యూరిటీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు ఉన్నప్పటికీ కాలేజీలో ఆవరణలో పందులు నివాసం ఏర్పరచుకోవడంతో పారిశుధ్యం, సెక్యూరిటీ సిబ్బందిపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.



కుట్టు శిక్షణతో మహిళలకు ఆర్థిక స్వావలంబన

అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు

ఆటోనగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కుట్టు శిక్షణ ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన లభిస్తుందని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు అన్నారు. ఆటోనగర్‌లోని కమల ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ కుట్టుమిషన్‌ల శిక్షణ కేంద్రంలో ఉచితంగా కుట్టుపై శిక్షణ పొందిన మహిళలకు బుధవారం సాయంత్రం మెస్సీయ ఫెలోషిప్ కార్యాలయంలో సర్టిఫికెట్‌లు, పేద మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్‌లను పాస్టర్ డాక్టర్ సజ్జా రత్నకుమార్‌తో కలిసి పాపారావు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాపారావు మాట్లాడుతూ మహిళలకు చేయూతనిచ్చేందుకు ఈశిక్షణ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. శిక్షణ కేంద్రం కోఆర్డినేటర్ సజ్జా జ్యోతి, పలువురు నేతలు పాల్గొన్నారు.


మహిళలకు కుట్టుమిషన్‌లు పంపిణీ చేస్తున్న పాపారావు, రత్నకుమార్

సత్ఫలితాలిస్తున్న ట్రక్కర్స్ ప్రాజెక్టు

● ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రచారం

ఆటోనగర్, ఆంధ్రజ్యోతి: మెకానికల్ ఫీల్డ్‌లో ఉండే లారీ డ్రైవర్‌లు, క్లీనర్‌లు, మెకానిక్ తదితరులకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రచారం చేసి వాటి నియంత్రణలో తమ వంతు బాధ్యతను పోషిస్తుంది విజయవాడ జవహర్ ఆటోనగర్‌లోని హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ. ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో పనిచేసే ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్(కేడీఎల్‌వోఏ) సంయుక్తంగా గత 22 ఏళ్ల నుంచి ట్రక్కర్స్ ప్రాజెక్టు నిర్వహిస్తోంది. ఇందులో పనిచేసే సిబ్బంది ఫీల్డ్‌కు వెళ్లి కరపత్రాల ద్వారా హెచ్ఐవీపై ప్రచారం నిర్వహిస్తారు. అలాగే జాతీయ రహదారులతోపాటు ప్రధాన రోడ్లపైకి వెళ్లి లారీలు, ట్రక్కులు నడిపే డ్రైవర్లు, క్లీనర్లకు ఎయిడ్స్‌పై కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తారు. ఈప్రాజెక్టులో పనిచేసే సిబ్బందికి జీతాలతో పాటు పేషంట్‌లకు మందులు, రక్త పరీక్షలు తదితర వాటికి అయ్యే ఖర్చును ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, లారీ ఓనర్స్ అసోసియేషన్ భరిస్తోంది.


పరీక్షలు నిర్వహిస్తున్న ఏఎన్ఎం

క్యాంప్‌ల నిర్వహణ

జవహర్ ఆటోనగర్‌లోని పలు ప్రైవేట్ సంస్థల కార్యాలయాలు, నేషనల్ హైవేస్, ప్రధాన రహదారులు తదితర ప్రాంతాల్లో నిరంతరం క్యాంప్‌లు నిర్వహిస్తూ ఎయిడ్స్‌పై ప్రచారం చేస్తున్నారు. ఎయిడ్స్ నియంత్రణకు పాటించాల్సిన జాగ్రత్తలను సిబ్బంది వివరిస్తారు. నెలకు 3500 మందికి కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 525 మందికి రక్త పరీక్షలు, 20 క్యాంప్‌లు నిర్వహిస్తున్నారు. హెచ్ఐవీ ఉందని పరీక్షల్లో తేలితే ప్రాథమిక చికిత్స చేసి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పంపిస్తారు.

కరపత్రాల ద్వారా ప్రచారం



తమ సంస్థ సిబ్బంది ఫీల్డ్‌లో పర్యటిస్తూ హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై కరపత్రాల ద్వారా ట్రక్ డ్రైవర్లు, క్లీనర్‌లు, మెకానిక్‌లకు అవగాహన కల్పిస్తున్నారు. 2002 నుంచి నిర్వహిస్తున్న ఈప్రాజెక్టు సత్ఫలితాలిస్తోంది.

-ఎస్ఎస్ సాంబశివరావు, ప్రాజెక్టు మేనేజర్, హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ఆటోనగర్

సమర్థవంతంగా నిర్వహిస్తున్నాం



జవహర్ ఆటోనగర్‌లో ఏయిడ్స్ కంట్రోల్ సొసైటీ, తమ అసోసియేషన్ సంయుక్తంగా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఏర్పాటు చేసి సమర్థవంతంగా నిర్వహిస్తున్నాం. దీని వల్ల తమ పరిధిలో హెచ్ఐవీ నియంత్రణకు తమ వంతు కృషి చేస్తున్నాం. గతంలో మెకానికల్ ఫీల్డ్‌లో హెచ్ఐవీ కేసులు వచ్చేవి, ఇప్పుడు వాటి సంఖ్య గణనీయంగా తగ్గించాం. దీనికి తమ సంస్థ ద్వారా చేస్తున్న ప్రచారం ఎంతగానో దోహదపడింది.

-నాగుమోతు రాజా, ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

కంప్యూటర్ శిక్షణ నూతన బ్యాచ్‌లు ప్రారంభం

గవర్నర్‌పేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకె) కంప్యూటర్ శిక్షణా విభాగంలో ఎంఎస్ ఆఫీస్ విత్ ఏఐ, ఫోటోషాప్, ట్యాలీ కోర్సులకు నూతన బ్యాచ్‌లు ఈనెల 11న ప్రారంభమతున్నాయని కంప్యూటర్ విభాగం బాధ్యులు టి. క్రాంతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోర్సులు పట్ల ఆసక్తి ఉన్నవారు రాఘవయ్య పార్కు సమీపంలోని ఎంబీవీకే కేంద్రంలో సంప్రదించాలని కోరారు.







స్క్రీన్లతో చూపు చీకట్లోకి..!



[illegible]

సమయానికి గుర్తించకపోవడంతో అధిక తీవ్రత ● ఆహారపు అలవాట్లలో మార్పు ఒక కారణం ● ఫోన్లతో పిల్లల్లో దూరమవుతున్న సృజనాత్మకత

జీజీహెచ్‌కు నెలకు సుమారు 2వేల నుంచి 2,200 ఓపీలు సేవలు నమోదవుతున్నాయి. వీరిలో అధికంగా చిన్నపిల్లలు, యుక్తవయస్కులుండడం ఆందోళన కలిగించే అంశం. నెలలో కనీసం 130 నుంచి 150 వరకు మేజర్, 135 వరకు మైనర్ సర్జరీలు జరుగుతున్నాయి. ఎక్కువ సమయం ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లను చూడడం వల్లే ఈ సమస్యలు ఏర్పడుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. స్మార్ట్‌ఫోన్లు ఎక్కువ సమయం చూడడంతో కళ్లపై ఒత్తిడి పడి కళ్లమంట, తర్వాత పొడిబారిపోతాయి. ఆ సమయంలోనైనా గుర్తించి ఫోన్ చూడడం మానకపోయినా, వైద్యులను సంప్రదించపోయినా కళ్ల మసకబారడంతో పాటు దృష్టిలోపం ఏర్పడుతుందని వైద్యులు చెబుతున్నారు.



దృష్టిలోపానికి కారణాలు

కంటిని ఎక్కువగా నలపడం వల్ల కన్ను గుడ్డు ముందుకు (వీ ఆకారంలో) పొడుచుకు రావడం వల్ల కూడా దృష్టిలోపానికి ఒక కారణమని వైద్యులు చెబుతున్నారు. కన్ను దురద పుట్టినప్పుడు, ఇతర కారణాలతో అదేపనిగా కంటిని నలపడం వల్ల కర్వేచర్ (కంటిలోని నల్లగుడ్డు) ఆకారం కోనికల్ షేప్‌లోకి మారిపోతుంది. దీంతో నల్లగుడ్డులోని రెండు పొరల మధ్య వ్యత్యాసం పెరిగిపోయి దృష్టిలోపం ఏర్పడుతుంది. దీనికి లాసిక్ సర్జరీ చేసి లేజర్ కిరణాలతో వాటి మధ్య అంతరాన్ని తగ్గించి దృష్టి లోపాన్ని సరిచేస్తారు. అలాగే కంటికి వచ్చే అనేక రకాల వ్యాధుల వల్ల చూపు మందగిస్తుంది. శుక్లాల (కాంటాక్ట్- కంటి చివరన గడ్డలు ఏర్పడడం), నీటి కాసులు (గ్లకోమా-కంటిలోని నరాలు దెబ్బతిడం) వల్ల దృష్టిలోపం ఏర్పడుతుంది. గ్లకోమా వచ్చాక కొద్దికొద్దిగా చూపు మందగించి మొత్తం చూపు కోల్పోయే ప్రమాదముంది. కంటిలో ఉండే రెటీనా ఫిల్మ్‌లా పనిచేస్తుంది. కంటిలోకి వచ్చే కాంతిని తీసుకుని ఆ సిగ్నల్స్‌ను నరాల ద్వారా మెదడుకు చేరవేస్తుంది. మధుమేహం ఎక్కువగా ఉన్నా రెటీనా రక్తనాళాలు దెబ్బతిని చూపు మందగిస్తుంది. కంటిపొర (టెరీజియం- కన్నుగుడ్డుపై ఉండే పలచనిపొర)కు దెబ్బతగిలితే నల్లగా ఉన్న కనుగుడ్డు తెల్లగామారిచూపు కోల్పోతారు. ఈ పొరను మార్చడం వల్ల చూపు తిరిగిపొందవచ్చని వైద్యులు వెల్లడించారు. రిఫ్రాక్టివ్ ఎర్రర్ (కాంతి తరంగాలు రెటీనాపై సరిగా పడకపోవడం) వల్ల మయోపియా (దూరంగా ఉన్న వస్తువులు మసకగా కనపడడం), హైపరోపియా (దగ్గర వస్తువులు మసకగా కనిపించడం) సమస్యలు వస్తాయి. కార్నియల్ బ్లైండ్‌నెస్ (కంటిముందు భాగంలో ఉండే గాజులాంటి పొర మసకబారడం) సమస్య వల్ల కూడా దృష్టిలోపం ఏర్పడుతోంది. కొన్ని రకాల దృష్టిలోపాలు వయసు పెరిగే కొద్దీ, ఇతర వ్యాధులతో వచ్చినప్పటికీ, పిల్లల్లో మాత్రం ఫోన్లు, ట్యాబ్‌ల వల్లే వస్తాయని నిపుణులు చెబుతున్నారు. చాలా తక్కువ మంది పోషకాహారం లోపంతో దృష్టిలోపంతో బాధపడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. విటమిన్-ఏ లోపం వల్ల కన్ను డ్రై అవడం, నల్లగుడ్డుపై మచ్చలు ఏర్పడడం వంటి సమస్యలతో అధికాశాతం మంది పిల్లలు ఆసుపత్రికి వస్తున్నట్టు వైద్యులు తెలిపారు. విటమిన్ లోపం అధికంగా ఉంటే కన్ను డ్రై అయిపోయి చూపుపోయే ప్రమాదముందని, విటమిన్‌లోపం రేచీకటి సమస్యకు దారితీస్తుందన్నారు.



నేడు ప్రపంచ దృష్టి దినోత్సవం

పంచేద్రియాల్లో ముఖ్యమైన వాటిలో కళ్లు ఒకటి. ఇవి చాలా సున్నితమైనవి. ఒకప్పుడు ముదిమి వయసు వచ్చినప్పటికీ కళ్లు స్పష్టంగా కనిపించేవి. కానీ నేటి తరం పిల్ల ల్లో పట్టుమని పదేళ్లు నిండకముందే కళ్లకు అద్దాలు పడుతున్నాయి. నాడు పలక బలపం పట్టిన బాల్యం నేడు స్మార్ట్‌ఫోన్‌లు, ట్యాబ్ లు గంటల తరబడి చూడడంతో కంటి సమస్యలు ఏర్పడుతున్నాయి. చిన్నారులు ఫోన్ చూస్తున్నప్పుడు కళ్లకు దగ్గరగా పెట్టుకుని చూడడమే వల్లే దృష్టి లోపానికి కారణమని వైద్యనిపుణులు చెబుతున్నారు. మారి న ఆహారపు అలవాట్లు, కంటికి స్క్రీన్‌కు మధ్య కనీస దూరం పాటించకపోవడం వల్లే పిల్లల్లో దృష్టిలోపం ఏర్పడుతోంది. స్మార్ట్ ఫోన్లు వచ్చినప్పటి నుంచి పెద్దలతో పాటు పిల్లల్లోనూ సృజనాత్మకత లోపిస్తుంది. ఏ విషయం తెలుసుకోవాలన్నా పుస్తకాలను వెతకడం మానేసి ఇంటర్నెట్‌పై ఆధారపడుతున్నారు. దీంతో నేటితరం పిల్లలు, యువతలో ఆలోచించే తత్వంతో పాటు విషయజ్ఞానమూ తగ్గుతోందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా 6 నుంచి పదహారేళ్లలోపు చిన్నారుల్లో ఈ సమస్యలు అధికంగా ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు. నేడు ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- ఆంధ్రజ్యోతి - విజయవాడ

చిన్నారులకు ఫోను అలవాటు ప్రమాదం.. సత్యనారాయణ ఆప్తమాలజీ హెచ్‌వోడీ, జీజీహెచ్

నేటితరం యువతలో 20ఏళ్ల నిండక ముందే దృష్టిలోపం ఏర్పడుతోంది. దీనికి ప్రధానకారణం ఫోన్లు, ట్యాబ్‌లు ఎక్కువగా చూడడమే. స్క్రీన్‌లను దగ్గరగా చూడడం వల్ల కళ్లు మంటపుట్టడం, క్రమంగా డ్రై అయిపోయి మసకబారిపోతాయి.

కళ్లు మసకబారిన విషయం పిల్లలు తల్లిదండ్రులకు చెప్పకపోవడం, విషయం తెలిసిన తర్వాత వైద్యులను సంప్రదించినప్పటికీ తీవ్రత పెరిగిపోతోంది. దీంతో సాధారణం కంటే ఎక్కువస్థాయి దృష్టిలోపానికి సంబంధించిన కళ్లద్దాలు ఇవ్వకతప్పడం లేదు. అలాగే చిన్నారుల్లో విటమిన్ లోపం ఎక్కువగా ఉంటోంది. ఏ-విటమిన్ అందాలంటే క్యారెట్, జామ, యాపిల్ పండ్లు తీసుకోవాలి. నేత్రదానమంటే కళ్లు తీసి పట్టుకెళ్తారేమోనని గ్రామాల్లో ఒక అపోహ ఉంది. కానీ కంటిపై పొర (కార్నియా)ను మాత్రమే తొలగిస్తారని చెప్పి అవగాహన కల్పిస్తున్నాం. దేశవ్యాప్తంగా 2 లక్షల మంది అంధత్వంతో బాధపడుతున్నారు. ప్రతిరోజు వేలమంది చనిపోతున్నారు. వారి కుటుంబ సభ్యులు నేత్ర దానానికి ముందుకు వస్తే దేశంలో చూపులేని వారి శాతం తగ్గుతుంది.

లులుకు ఆర్టీసీ స్థలం కేటాయింపుపై హైకోర్టులో పిల్

అమరావతి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఏపీఎస్‌ఆర్టీసీకి చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని లులు సంస్థకు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు వేసిన ప్రజాహిత వ్యాజ్యంపై బుధవారం హైకోర్టు విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను డిసెంబర్ 3కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

రాష్ట్రంలోని వివిధ సంస్థలకు భూకేటాయింపు కోసం బిడ్డింగ్ విధానాన్ని అనుసరించాలని 2012లో ప్రభుత్వం పాలసీ తీసుకొచ్చిందన్నారు. దీనికి విరుద్ధంగా భూకేటాయింపులకు సంబంధంచి ఏపీ టూరిజమ్ ల్యాండ్ అలాట్‌మెంట్ పాలసీని తీసుకొస్తూ ఈ ఏడాది మార్చి 11న ప్రభుత్వం జీవో 1 జారీ చేసిందన్నారు. రాష్ట్రానికి వచ్చే సంస్థను లార్జ్, అల్ట్రా లార్జ్, మెగా ప్రాజెక్టులుగా వర్గీకరిస్తూ సబ్ రిజిస్ట్రార్ నిర్ణయించే భూ విలువలో 1శాతానికి భూమిని కేటాయించడంతో పాటు 99ఏళ్ల లీజు ప్రయోజనం కల్పిస్తున్నారన్నారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎ.సత్యప్రసాద్ వాదనలు వినిపించారు. బిడ్డింగ్ విధానంలో భూకేటాయింపులు జరపాలని 2012లో రాష్ట్ర ప్రభుత్వం పాలసీ తీసుకొచ్చిందన్నారు. దానికి విరుద్ధంగా ఈ ఏడాది మార్చి 11న ఏపీ టూరిజమ్ ల్యాండ్ అలాట్‌మెంట్ పాలసీని తీసుకొచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో భూకేటాయింపు విధానానికి సంబంధించిన జీవోతో పాటు లులు సంస్థకు భూకేటాయింపు ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు.

ఐటీసీతో పాటు 5శాతం జీఎస్టీ కల్పించాలి

● రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు వినతిపత్రం

వన్‌టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): హాస్పటాలిటీ (స్టార్ హోటల్స్) రంగానికి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)తో పాటు 5శాతం జీఎస్టీ సౌలభ్యం కల్పించాలని ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి.స్వామి, ప్రధాన కార్యదర్శి ఎస్.మూర్తి చిట్టూరి, సభ్యుడు చరణ్ వీ బృందం మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. మంత్రి ఆహ్వానం మేరకు బృందం మంగళవారం సాయంత్రం ఆయనను కలిశారు. ఐటీసీ లేని ఏకైక పరిశ్రమ హాస్పటాలిటీ రంగమని తాము వివరించామని, పెద్ద ప్యాకేజీ ఫుడ్ పరిశ్రమకు కూడా అందుబాటులో ఉందని, కానీ రెస్టారెంట్‌లకు, హోటల్స్‌కు మాత్రం లేదని వివరించామన్నారు. ఐటీసీ లేకుండా ప్రస్తుతం ఉన్న 5 శాతం జీఎస్టీ నిర్వహణ ఖర్చులను పెంచుతుందన్నారు. హోటళ్లు, రెస్టారెంట్‌లకు వర్కింగ్ క్యాపిటల్ కూడా స్తంభింపజేస్తుందన్నారు. 5 శాతం జీఎస్టీ ఐటీసీని అధికారికంగా కల్పించాలని కేంద్ర ఆర్థిక మంత్రికి, జీఎస్టీ కౌన్సిల్‌కు సిఫారస్ చేయమని ముఖ్యమంత్రికి చెప్పమని మంత్రికి వివరించామన్నారు. దీనిపై మంత్రి స్పందిస్తూ తగిన వేదికపై ఈ అంశాన్ని ప్రస్తావిస్తామని, సీఎం దృష్టికి తీసుకువెళతామని చెప్పారన్నారు.

వృద్ధురాలి హత్యకేసులో నిందితుడు అరెస్టు

● నిందితుడికి సహకరించిన మైనర్ ప్రభుత్వ జునైల్ హోమ్‌కు తరలింపు

● నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న మృతురాలి బంగారు ఆభరణాలు, హత్యకు ఉపయోగించిన ఆయుధాలు

విద్యాధరపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): భవానీపురం హెచ్‌బీ కాలనీలో ఇటీవల ఊర్మిళానగర్‌కు చెందిన పొత్తూరి విజయలక్ష్మి (70) హత్య కేసులో నిందితులను భవానీపురం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ భవానీపురం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో నిందితుడు వంకధార హనుమాన్‌జీ సుబ్రహ్మణ్యంను మీడియా ముందు ప్రవేశపెట్టి హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఊర్మిళానగర్‌కు చెందిన పొత్తూరి విజయలక్ష్మీ ఈనెల 1న అదృశ్యమైనట్టు ఆమె కుమారుడు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. నగర పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు పశ్చిమ జోన్ ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ, పశ్చిమ ఏసీపీ దుర్గారావు పర్యవేక్షణలో భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బొమ్మసాని సుబ్బారావు నగర్ డ్రైనేజీ కాలువలో ఓ మహిళ మృతదేహం ఉన్నట్టు సమాచారం పోలీసులకు తెలిసింది. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించగా గుర్తు తెలియని మహిళ మృతదేహమని, ఆమెకు రెండు చేతులు, రెండు కాళ్లు, తల లేవని, కేవలం మొండెం మాత్రమే ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో అదృశ్యమైన విజయలక్ష్మి కేసుకు బొమ్మసానినగర్ డ్రైనేజీలో దొరికిన మృతదేహం ఒకరేనని నిర్ధారించుకున్న పోలీసులు మృతురాలి కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విజయలక్ష్మి కుమారుడు తల్లిని గత 30న ఉదయం తన బైక్‌పై చిట్టినగర్ సాయిరామ్ థియేటర్ సమీపంలోని ఓ కళ్యాణ మండపం వద్ద వదిలేసినట్టు మృతురాలి కుమారుడు పోలీసులకు తెలియపరిచాడు. పోలీసులు ఆ దిశగా కేసు దర్యాప్తు చేయగా విజయలక్ష్మిని ఆమె బంధువు భవానీపురం హెచ్‌బి కాలనీకి చెందిన వంకధార లక్ష్మీనరసింహస్వామి ఆరోజు సాయంత్రం తన బైక్‌పై ఎక్కించుకుని తన ఇంటికి తీసుకువెళ్లాడు. వంకధార హనుమాన్‌జీ సుబ్రహ్మణ్యం విజయలక్ష్మిని ఇంటిలోనే హత్యచేసి కిరాతకంగా తల, చేతులు, కాళ్లు, మొండెం వేరుచేసి రెండు గోనె సంచుల్లో భద్రపరచి కుమారుడితో కలిసి తన బైక్‌పై భవానీపురం చివర డ్రైనేజీ కాలువలో వేరు వేరు చోట్ల పడవేశాడు. ఆమెను హత్య చేసిన నిందితులు ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలు తీసుకుని పరారయ్యారు. సుబ్రహ్మణ్యం తన భార్య తనతో విడిపోవటానికి పిన్ని విజయలక్ష్మి కారణమని కక్ష పెంచుకుని హత్య చేశాడు. పోలీసు అధికారులు స్థానిక ప్రాంతాల్లో 7వేల సీసీ ఫుటేజ్‌లను పరిశీలించి నిందితులను గుర్తించారు. బుధవారం నిందితులు భవానీపురం దర్గాప్లాట్ వద్ద ఉన్నట్టు సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు నిందితుల వద్ద మృతురాలికి సంబంధించిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహం సమీపంలో ఉన్న హత్యకు ఉపయోగించిన ఆయుధాలు, మృతురాలికి సంబంధించిన చీరను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు సుబ్రహ్మణ్యంను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితుడుకు సహకరించిన అతడి కుమారుడు మైనర్ కావటంతో అతడిని విద్యాధరపురంలోని ప్రభుత్వ జునైల్ హోమ్‌కు తరలించినట్టు ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ వివరించారు. పశ్చిమ ఏసీపీ దుర్గారావు, భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్.ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది.



ఎంపీడీవోలు, డ్వామా పీడీలతో కలెక్టర్ లక్ష్మీశ వీడియో కాన్ఫరెన్స్

ఉపాధి హామీలో ముఖ ఆధారిత హాజరు

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పారదర్శకతను మరింత పెంచేందుకు, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చేసేందుకు వేతనదారుల ముఖ ఆధారిత హాజరు ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆధార్ డేటా, ఈ కేవైసీతో ఫేస్ అథెంటికేషన్ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఎంపీడీవోలు, డ్వామా అధికారులు, సిబ్బందితో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు తీరుతెన్నులను సమీక్షించడంతో పాటు పథకం అమల్లో పురోగతిపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి శ్రామికుల ముఖ గుర్తింపు హాజరు నమోదుకు సంబంధించిన ఫేస్ - ఆర్‌డీ అండ్ ఎన్ఎంఎంఎస్ యాప్‌ను ఫీల్డ్ అసిస్టెంట్లు డౌన్‌లోడ్ చేసుకొనేలా ఎంపీడీవోలు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు చూస్తే సగటు వేతనం విషయంలో గంపలగూడెం, కంచికచర్ల, జగ్గయ్యపేట మండలాలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయని, ప్రతి మండలం ఈ విషయంలో ప్రగతి చూపేందుకు కృషిచేయాలన్నారు. జిల్లాలో 2025-26లో 4వేల ఎకరాల ఉద్యానపంటల సాగును లక్ష్యంగా నిర్దేశించుకోగా ఇప్పటి వరకు 3,745 ఎకరాలను గుర్తించినట్టు తెలిపారు. మునగ సాగుకు 880 ఎకరాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో చేపట్టే సీసీ రోడ్డు, పశువుల షెడ్లు, మ్యాజిక్ డ్రెయిన్లపై చర్చించి సూచనలు చేశారు. డ్వామా పీడీ ఏ రాము పాల్గొన్నారు.

బియ్యం అక్రమ రవాణాకు స్కెచ్..!

కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంకలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు పగడ్బందీ స్కెచ్ వేశారు ఆ ఇద్దరు. వీరిలో 'ఒకరికి' కృష్ణలంక నెహ్రూనగర్ డొంకరోడ్డులో రేషన్ డిపో ఉంది. 'ఇంకొకరు' మాత్రం రేషన్ డీలర్ల నుంచి బియ్యం కొనుగోలు చేసి దళారులకు విక్రయిస్తూ ఉంటాడు. వీరిద్దరు కలవడంతో రేషన్ డీలర్లలో వణుకు ప్రారంభమైంది. కారణం తమ వెనుక సివిల్ సప్లైస్, విజిలెన్స్ అధికారుల అండదండలున్నాయంటూ ప్రగల్భాలు పలకడమే. కృష్ణలంక స్వర్గపురి రోడ్డు నుంచి రామలింగేశ్వరనగర్ వరకు ఉన్న రేషన్ డిపో డీలర్లతో వీరిద్దరూ సమావేశం ఏర్పాటు చేసి మీ షాపుల నుంచి పీడీఎస్ బియ్యాన్ని తమకే ఇవ్వాలంటూ హుకుం జారీ చేశారు. డీలర్ల నుంచి వారు బియ్యాన్ని కిలోకు రూ.17 చొప్పున చెల్లించి తీసుకెళ్తున్నారు. ఈ బియ్యాన్నంతా పోగుచేసి ఓ గోడౌన్‌లో స్టోర్ చేసి పెనమలూరుకు చెందిన బియ్యం దళారికి కిలోకు రూ.20 లాభానికి విక్రయిస్తున్నారు. ఇది అందరికీ తెలిసిన విషయ మే. అక్కడి నుంచి కాకినాడ పోర్టుకు బియ్యం తరలిపోతోంది. అయితే డీలర్లందరూ తమకే బియ్యాన్ని ఇవ్వాలంటూ వీరు హుకుం జారీ చేయడంతో డీలర్లకేం చేయాలో పాలుపోలేదు. 'అధికారుల సంగతి మేం చూసు కొంటాం' అంటూ ప్రగల్బాలు పలకడం చూ స్తుంటే నిజంగానే వీరి వెనుక అధికారుల అం డదండలున్నాయా అన్న అనుమానాలు కలగక మానడం లేదని కొందరు వాపోతున్నారు.

పిచ్చి వేషాలు వేస్తే తాట తీస్తా: ఏఎస్‌వో

డీలర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి పిచ్చివేషాలు వేస్తే తాట తీస్తానని ఏఎస్‌వో శ్రీనివాస్ డీలర్లకు హెచ్చరికలు జారీ చేశారు. కృష్ణలంకలోని దాదాపు 25 మంది డీలర్లకు మెమోల జారీతో పాటు 'ఇంకొకరికి' మాత్రం షోకాజ్ నోటీసు జారీ చేశారు. రేషన్ బియ్యంలో అక్రమాలు, తరలింపులు జరిగినట్టు తేలితే అందరినీ ఇంటికి పంపించేస్తామని, ఉపేక్షించేది లేదని హెచ్చరించినట్లు ఆంధ్రజ్యోతికి తెలిపారు.



డీలర్ ఆంజనేయులు డిపో నుంచి పట్టుకొన్న వాహనంలో రేషన్ బియ్యం

డిపో నుంచి వెళ్తున్న బియ్యం పట్టివేత

కృష్ణలంక నెహ్రూనగర్ డొంకరోడ్డులోని రేషన్ డిపో నెం 301 డీలర్ ఏ ఆంజనేయులు డిపో నుంచి మంగళవారం అర్ధరాత్రి 1 గంట సమయంలో మినీ లారీలో తరలివెళ్తున్న బియ్యాన్ని పోలీసులకు పట్టుకొన్నారు. అప్పటికే ఆంజనేయులు జంప్ కావడంతో పోలీసులు వాహనాన్ని కృష్ణలంక స్టేషన్‌కు తరలించారు. సమాచారం అందుకున్న ఏఎస్‌వో అర్ధరాత్రి 2 గంటల సమయంలో స్టేషన్‌కు వచ్చి బియ్యాన్ని పరిశీలించారు. ఆంజనేయులు, డ్రైవర్లపై క్రిమినల్ కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీ తమకిస్తే తాము 6ఏ కింద జా యింట్ కలెక్టర్ కోర్టులో కేసు నమోదు చేస్తామని పోలీసులకు చెప్పినట్టు ఏఎస్‌వో శ్రీనివాస్ తెలిపారు. పట్టుకున్న రేషన్ బియ్యం 50 కిలోల బస్తాలు దాదాపు 60 వరకు ఉండొచ్చని తెలిసింది. కంకిపాడుకు చెందిన ఓ దళారి బొలేరో వాహనం ఇచ్చి ఆంజనేయులు డిపో నుంచి బియ్యాన్ని తెమ్మని ఓ వ్యక్తిని పంపినట్టు సమాచారం. డిపోకు ఆంజనేయులు వేసిన తాళంపై తాను మరో తాళం వేసినట్టు ఏఎస్‌వో తెలిపారు.

హైదరాబాద్ - అనకాపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు పొడిగింపు

రైల్వేస్టేషన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని తట్టుకునేందుకు దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ - అనకాపల్లి మధ్య ప్రత్యేక రైళ్లను పొడిగించింది. 07035 హైదరాబాద్ - అనకాపల్లి శనివారాల్లో బయలుదేరుతుంది. 07036 అనకాపల్లి - హైదరాబాద్ ఆదివారాలలో బయలుదేరుతుంది. సికింద్రాబాద్, చర్లపల్లి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, రాయనపాడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి స్టేషన్లలో ఈ రైళ్లు ఆగుతాయి. ఈ రైళ్లకు టూ ఏసీ, త్రీఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు అనుసంధానం చేసి ఉంటాయి.

కౌన్సిల్ సమావేశం రసాభాస

నూతన పింఛన్లు, డయేరియా అంశాలపై అధికార, ప్రతిపక్షాల వాగ్వాదం

కార్పొరేషన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. నూతన పింఛన్ల అంశంపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్తగా ఒక్క పింఛన్ ఇవ్వలేదని వైసీపీ కార్పొరేటర్ మొహమ్మద్ రెహానా ప్రస్తావించగా టీడీపీ కార్పొరేటర్లు ప్రతిఘటించారు. దీంతో ఇరువర్గాలకు మాటల యుద్ధం జరిగింది. బుడమేరు శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోలేదని, బాధితులకు నష్టం పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం మోసగించిందని అధికార వైసీపీ కార్పొరేటర్లు ఆరోపించగా టీడీపీ కార్పొరేటర్లు ప్రతి ఒక్కరికి నష్టపరిహారంతోపాటు బుడమేరు గండిపడిన చోట రూ.29 కోటతో వాల్ నిర్మాణం చేశామన్నారు. టీడీపీ కార్పొరేటర్లు సూపర్ సిక్స్ పథకాలతో ప్రభుత్వం దూసుకుపోతుందని చెప్పగా వైసీపీ కార్పొరేటర్లు సూపర్ సిక్స్ ఫెయిల్యూర్ అంటూ నినాదాలు చేశారు. కొత్త రాజరాజేశ్వరిపేటలో డయేరియా ఎందుకు వచ్చిందంటే ఒక్క అధికారి కానీ ప్రజా ప్రతినిధులు కానీ చెప్పలేదని వైసీపీ కార్పొరేటర్లు ప్రస్తావించగా కమిషనర్ స్పందించారు. ఆ ఏరియాలో వీఎంసీ అందిస్తున్న మంచినీటికి పలుమార్లు పరీక్షలు నిర్వహించగా నెగిటివ్ వచ్చిందని, అక్కడున్న 4 ఆర్వో ప్లాంట్లలో మంచినీటిని పరీక్షలు చేయగా పాజిటివ్ వచ్చిందని, ఆ నీటిలో ఇకోలై అనే బ్యాక్టీరియా ఉందని దానివల్లే డయేరియా వచ్చిందని, వినాయక చవితి రోజు ఆ 4 వాటర్ ప్లాంట్ల నీటిని వినియోగించినట్లు తెలిసిందని కమిషనర్ సభకు తెలిపారు. నగరంలో పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేందుకు నిర్మించిన కల్యాణ మండపాల్లో సచివాలయాలు







కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్, టీడీపీ ఫ్లోర్ లీడర్

ఉండటం వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని, కల్యాణమండపాల్లో కనీస మౌలిక సదుపాయాలు ఉండటం లేదని పలువురు కార్పొరేటర్లు మేయర్ దృష్టికి తీసుకురాగా ఆమె వెంటనే మరమ్మతులు నిర్వహించాలని, సచివాలయాలు వేరే ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, కుక్కల దాడులతో ప్రజలు గాయాలు పడుతున్నారని సుప్రీంకోర్టు ఆదేశాలంటూ ప్రజల ప్రాణాలతో అడుకుంటున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు మేయర్‌ను కోరారు.

సహనం కోల్పోయిన మేయర్...


సభను సక్రమంగా నడపాల్సిన మేయర్ బుడమేరు, పింఛన్ల విషయంలో సహనం కోల్పోయి మేయర్ అన్న సంగతి మరిచి టీడీపీ కార్పొరేటర్లపై ఎదురుదాడికి దిగారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో ప్రతి ఆరు నెలలకు నూతన పింఛన్‌లు ఇచ్చారని, టీడీపీ అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా కొత్తగా ఒక్క పింఛన్ ఇవ్వలేదని నా డివిజన్‌లో వృద్ధాప్య పింఛన్లు తొలగించారని టీడీపీ కార్పొరేటర్లపై ఎదురుదాడి చేశారు. అధికారులు పింఛన్లు తీయలేదని చెబుతున్నా వినకుండా వారిపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో అవకతవకలు
టీడీపీ ఫ్లోర్ లీడర్ బాలస్వామి

నగరంలో ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో ఒకే విధానం అవలంభించాలని టీడీపీ ఫ్లోర్ లీడర్ ఎన్ బాలస్వామి అన్నారు. అలాగే ట్రేడ్ లైసెన్స్ జారీ విషయంలో అవకతవకలు జరుగుతున్నాయని, అధిక మొత్తం డబ్బులు వసూలు చేస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. కల్యాణ మండపాలను పూర్తిస్థాయిలో ఆధునీకరించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని, కంట్రోలర్ రూమ్ ఎదురుగా ఉన్న వైఎస్సార్ పార్కులో వంగవీటి మోహనరంగా విగ్రహ ఏర్పాటుకు ప్రతిపాదన పెట్టగా ప్రత్యేక కమిటీకి పంపించడం సరికాదన్నారు. నగరంలోని పార్కుల్లో సెక్యూరిటీ సిబ్బందితోపాటు గస్తీ ఏర్పాటు చేయాలన్నారు.

నగరంలో రోడ్ల నిర్వహణ ప్రైవేటీకరణ ఆపాలి
సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు

నగరంలో రోడ్లు నిర్వహణ ప్రైవేటీకరణ ఆపాలి, బుడమేరు ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు అన్నారు. కౌన్సిల్ సమావేశానికి ముందు బ్యానర్ చేతబూని నినాదాలు చేసుకుంటూ కౌన్సిల్ సమావేశానికి వచ్చారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయకుండా నగరాభివృద్ధిని అడ్డుకుంటుందని ఆరోపించారు.



భారత బ్యాడ్మింటన్ డబుల్స్‌పై చెరగని ముద్ర వేసిన వెటరన్ షట్లర్ గుత్తా జ్వాల సామాజిక సమస్యలపైనా గట్టిగా గళాన్ని వినిపిస్తారు. కొద్ది నెలల క్రితం తల్లి అయిన ఆమె... చనుబాల కొరతతో అలమటిస్తున్న పసిబిడ్డల గురించి తెలిసి వారి కోసం ఉద్యమించారు. తన చనుబాలను ప్రభుత్వ ఆసుపత్రుల్లోని మిల్క్ బ్యాంక్‌లకు దానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. దీని ద్వారా ఎంతో మంది చిన్నారులకు అమ్మనయ్యే అదృష్టం కలిగిందంటున్న జ్వాల 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి.

అమ్మతనానిదే ఆ గొప్పతనం...

ఒకరిని దత్తత తీసుకుంటా...

ప్రతి మహిళ జీవితంలో అమ్మతనం అనేది ఒక గొప్ప అనుభూతి. దాన్ని మాటల్లో వర్ణించలేం. అయితే, ఆర్థిక స్తోమత ఉన్న తల్లిదండ్రుల ప్రేమకు నోచుకోని అనాథలను దత్తత తీసుకుంటే వారికి ఒక మంచి జీవితాన్ని ప్రసాదించిన వారవుతారు. భవిష్యత్‌లో నేను కూడా ఒకరిని దత్తత తీసుకుంటా. అయితే నా జీవితంలోకి ఎంత మంది పిల్లలు వచ్చినా నా పెద్ద బిడ్డ మాత్రం టెడ్డీనే (పెంపుడు శునకం). వాడు లేకుండా మా కుటుంబం ఎక్కడికి వెళ్లదు. వాడు లేకుంటే మాకు నిమిషం గడవదు.

"అమ్మను అయ్యాకే నాకు తల్లి పాల విశిష్టత, విలువ తెలిసింది. నా కుమార్తెకు సరిపడినన్ని చనుబాలు ఇచ్చాక కూడా అదనంగా మిగిలే పాలతో మొదట్లో ఇబ్బంది పడ్డాను. ఈ విషయం గురించి నాకు తెలిసిన వైద్యురాలు విష్ణతను సంప్రదిస్తే... చనుబాలను దానం చేయవచ్చని చెప్పారు. ఇటీవలి కాలంలో నెలలు నిండకుండానే ప్రసవించే వారి సంఖ్య పెరిగిందని, అలాంటి తల్లులు వారం రోజుల వరకు బిడ్డకు చనుబాలు ఇవ్వలేని స్థితిలో ఉంటారనీ, మార్కెట్‌లో దొరికే పాలను పిల్లలకు పట్టించడం వల్ల వారికి రకరకాల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిసింది. తల్లి పాలు సమయానికి అందక చనిపోయిన పిల్లల గణాంకాలు చూసి విస్తుపోయాను. అలాంటి వారికి 'బ్రెస్ట్ ఫీడ్ మిల్క్ బ్యాంక్స్' ద్వారా తల్లి పాలను అందించవచ్చనని తెలుసుకున్నాను. అప్పటి నుంచి నా కుమార్తెకు ఇవ్వగా మిగిలిన పాలను టెట్రా ప్యాకెట్లలో నింపి, ఇంట్లోని డీప్ ఫ్రీజర్‌లో భద్రపరిచి దానం చేస్తున్నాను. తొలి రెండు నెలల్లో 14.5 లీటర్లు, గడిచిన నాలుగు నెలల్లో దాదాపు 30 లీటర్ల చనుబాలను దానం చేశాను. పేద తల్లులు, వారి బిడ్డలకు ఎంతో కొంత ప్రయోజనం చేకూరాలనే ఆశయంతో నా పాలను ప్రభుత్వాసుపత్రుల్లో మిల్క్ బ్యాంక్‌లు ఏర్పాటు చేసిన స్వచ్ఛంద సంస్థలకే ఇస్తున్నాను. 'అమృతం ఫౌండేషన్' ద్వారా చెన్నై ప్రభుత్వ పిల్లల ఆసుపత్రిలో, 'ధాత్రి ఫౌండేషన్' ద్వారా హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రిలో ఉన్న మిల్క్ బ్యాంకులకు అందిస్తున్నాను. చనుబాల దానంతో నా బిడ్డతో పాటు ఎంతోమంది చిన్నారులకు అమ్మనయ్యే అదృష్టం కలిగింది.

విస్తృతంగా అవగాహన కల్పించాలి..

హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రి విషయానికొస్తే ఏటా అక్కడ సుమారు తొమ్మిది వేలమంది పసిబిడ్డలు తల్లి పాలు లభించక ఇబ్బంది పడుతుంటారని తెలిసింది. వీరిలో కొంతమంది ఇక్కడే పుట్టినవారు కాగా మరికొందరు ఇతరత్రా ఆరోగ్య సమస్యలతో అక్కడికి చికిత్స కోసం వస్తుంటారు. నెలలు నిండకుండా పుట్టిన, తక్కువ బరువుతో జన్మించే పిల్లలకు తల్లి పాలు కాకుండా పాల పిండితో తయారు చేసిన పాలు, మార్కెట్‌లో దొరికే సాధారణ పాలు పట్టించడం వల్ల 'నెక్రోటైజింగ్ ఎంటరోకోలైటిస్' అనే వ్యాధి వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల పేగుల్లో చీము పట్టి, పొట్ట లోపల అవి అతుక్కుపోవడంతో వారం, పది రోజుల తర్వాత ఆ పాలు తాగలేక పిల్లలు చనిపోయే ప్రమాదం పొంచి ఉందట. ఈ మరణాలను అరికట్టడానికి ఉన్న ఏకైక మార్గం వారికి చనుబాలను అందించడమే. తల్లి పాలలోని ఔషధ గుణం కలిగిన కొన్ని అణువులు ఇలాంటి పిల్లలకు ప్రాణాధారం. పాలిచ్చే తల్లులు తమ పిల్లలకు ఇవ్వగా... అదనంగా మిగిలే పాలను వృధాగా నేలపాలు చేయకుండా ప్రభుత్వ ఆస్పత్రులకు దానం చేసే... ఇతర బిడ్డల ఆకలి తీర్చిన వారు, ప్రాణం పోసిన వారు అవుతారు. సాంకేతిక పరిజ్ఞానం ఇంత అభివృద్ధి చెందాక కూడా దీనిపై ప్రజల్లో సరైన అవగాహన లేక పోవడం బాధనిపిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వార్తా సంస్థలు ఈ విషయం గురించి ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలి.

కులం ప్రాణం పోయదు...

ప్రాణాపాయ స్థితిలో రక్తం అవసరమైనప్పుడు కూడా ఇప్పటికీ కొందరు తమ కులం వారి రక్తం కోసం వెతుకులాడడం లాంటి విషయాలు సోషల్ మీడియాలో, ఇతరత్రా మాధ్యమాల ద్వారా నా దృష్టికి వచ్చినప్పుడు విస్మయం కలుగుతుంది. ఇదే తరహా ఆలోచన తల్లి పాల దానం విషయంలో కూడా ఉందని తెలిసి ఆశ్చర్యపోయా. మా పాలను వేరే వాళ్లకు ఎందుకు ఇవ్వాలనే వారికి ఒక విషయం చెప్పదలుచుకున్నా.



ఈ సృష్టిలో మరొకరికి జన్మనిచ్చి ప్రాణం పోసే అవకాశం తల్లులకే ఉంటుంది. ఎవరూ పుట్టే ముందు ఇదే మతం, కులం, ప్రాంతంలో జన్మించాలని ఎంచుకొని పుట్టరు. కాబట్టి పండంటి పసిబిడ్డలు ఈ లోకాన్ని చూడాలంటే తల్లి మనసుతో ఆలోచించి, చనుబాలను దానం చేయడానికి ప్రతి మాతృమూర్తి ముందుకు రావాలి. వస్తారని ఆశిస్తున్నా. ఎందుకంటే అమ్మతనంలోని గొప్పతనం మహిళలను ఈ పని చేయిస్తుందని భావిస్తున్నా. ఇక పుట్టిన పిల్లలకు పాలిస్తే తమ అందం తరిగిపోతుందనే అపోహలు ఉన్నాయి. చనుబాలలోని ఔషధ గుణాలు మరే పాలల్లో ఉండదని శాస్త్రీయంగా నిరూపితమైంది. తల్లి పాలు తాగడం వల్ల పిల్లలలో వ్యాధి నిరోధక శక్తి బాగా పెరుగుతుంది. మన బిడ్డలు ఆరోగ్యంగా ఉండడానికి చనుబాల ఇవ్వడంలో తప్పేమిటి? ఒకవేళ నిజంగానే అందం పోతుందనే అనుకుందాం... మన బిడ్డలకన్నా అందం ముఖ్యం కాదు కదా! పెళ్లయ్యాక... ముఖ్యంగా గర్భం దాల్చాక అమ్మాయిల ఆలోచనల్లో, జీవన శైలిలో సహజంగా మార్పులు వస్తాయి. పిల్లలను కనడం, వారిని పెంచడంలో తండ్రి కంటే తల్లి పాత్ర ఎక్కువ ఉంటుంది. నేను షట్లర్‌గా కెరీర్ ముగించి, ఇప్పుడు తల్లి పాత్రలో ప్రవేశించాను. నా కుమార్తె (మీరా) పెరిగి పెద్దదై, తన నిర్ణయాలు తాను తీసుకునే పరిణతి వచ్చే వరకు తనను ముందుకు నడిపించడం, సంరక్షించడం నా బాధ్యత.

వాళ్లకు ఎన్ని అవార్డులు వచ్చినా వృధాయే...

నిజాన్ని నిర్భయంగా మాట్లాడలేని వారికి, అన్యాయాన్ని ప్రశ్నించలేని వారికి ఎన్ని ప్రతిష్ఠాత్మకమైన అవార్డులు, బిరుదులు వచ్చినా నా దృష్టిలో వృధానే. కళ్ల ముందు తప్పు జరుగుతున్నప్పుడు, అది తప్పని తెలిసినప్పుడు కూడా స్పందించనినప్పుడు పేరు ముందు 'పద్మశ్రీ'లు, 'పద్మభూషణ్'లు పెట్టుకుని ఏం ఉపయోగం? నా దృష్టికి వచ్చిన సమస్యలపై నేను వెంటనే స్పందిస్తా. బాధితులకు నా మద్దతు తెలియజేస్తూ గొంతు విప్పుతా. నేను స్పందించాక కూడా బాధితులకు కానీ, నాకు కానీ మద్దతుగా ఇతర తెలుగు క్రీడాకారులు కనీసం స్పందించరు. రాజకీయ పార్టీలకు, క్రీడా సంఘాలలోని పెద్దలకు భయపడి నోరు విప్పరు. నా మాదిరిగా ప్రశ్నించే వారిమీద రెబల్, కమ్యూనిస్టు, హేతువాది అని రకరకాల ముద్రలు వేసి అవార్డులు, రివార్డులు రాకుండా చేస్తారు. నాకు అవార్డులు ఇవ్వకపోవడం వారి దౌర్భాగ్యం తప్ప.. అవార్డులు రాలేదని నేను ఎప్పుడు బాధపడలేదు. పైరవీలు, సిఫార్సులు చేస్తే వచ్చే అవార్డులు నాకు అవసరం లేదు. 2011లో నాకు 'అర్జున' పురస్కారం ఇచ్చేముందు ఎవరైనా రాజకీయ నాయకులతో సిఫార్సు లేఖలు ఇప్పించాలని కొందరు సలహాలు ఇచ్చారు. నాకు అర్హత ఉంటే వస్తుంది కానీ అలాంటి పనులు చేయనని చెప్పా. ఇకపై కూడా అలానే ఉంటా."

• ఎస్.ఎస్.బి సంజయ్

కౌన్సెలింగ్

డాక్టర్! వివాహమై ఐదేళ్లు గడుస్తున్నా గర్భం దాల్చలేకపోతున్నాను. వైద్యులు సర్జరీ సూచిస్తున్నారు. ఆధునిక సర్జరీతో త్వరగా కోలుకుంటాననీ, సమస్య పరిష్కారమవుతుందనీ అంటున్నారు. ఇది నిజమేనా?

- ఓ సోదరి, హైదరాబాద్

సర్జరీతో సురక్షితమేనా?

కోలుకునే సమయాన్నీ తగ్గించడంతోపాటు, సమస్యను సమర్థంగా పరిష్కరించడమే ధ్యేయంగా సర్జరీలు సాగుతూ ఉంటాయి. అలాంటి అత్యాధునిక సర్జరీలే హిస్ట్రోస్కోపీ, ల్యాప్రోస్కోపీ! వీటికి ముందు గర్భాశయ సమస్యలన్నిటికీ గర్భాశయానికి కోతతో సాగే శస్త్రచికిత్సలు మాత్రమే అందుబాటులో ఉండేవి. వీటి వల్ల సర్జరీ సమయంతోపాటు రోగి కోలుకునే సమయం కూడా ఎక్కువగా ఉండేది. గర్భాశయం లోపల ఉన్న సమస్యలను హిస్ట్రోస్కోపీతో, గర్భాశయం బయట సమస్యలను



ల్యాప్రోస్కోపీతో సరి చేసే వెసులుబాట్లు కూడా అందుబాటులో ఉన్నాయి.

హిస్ట్రోస్కోపీ: ఇది శరీరం మీద ఎటువంటి గాటు, కుట్టు లేకుండా యోని ద్వారా చేసే సర్జరీ. గర్భసంచి లోపలకు కెమెరా చొప్పించి అంతర్గతంగా సమస్యను స్పష్టంగా చూసే వీలుండే సర్జరీ కూడా ఇదొక్కటే! ఇలా చూడడం ద్వారా గర్భసంచి ఆకారం, పరిమాణం సరిగా ఉందా, లేదా? అనేది తెలుసుకోవచ్చు. పాలిప్ లేదా ఫైబ్రాయిడ్లు గర్భసంచిలో పెరిగాయా? అనేదీ గమనించవచ్చు. గర్భాశయం లోపల కోతలు, గాట్లు ఏర్పడి, వాటి కారణంగా గర్భధారణ జరగడం లేదా? అనేదీ నిర్ధారించుకోవచ్చు. అలా ఈ సర్జరీ ద్వారా పాలిప్స్, ఫైబ్రాయిడ్లు, గాట్లను తొలగించవచ్చు.

ల్యాప్రోస్కోపీ: పాలీసిస్టిక్ ఓవరీస్‌లో అండాలు ఎక్కువగా పేరుకుపోయినప్పుడు, వాటి నుంచి కొన్నిటిని తొలగించడం కోసం, ఫైబ్రాయిడ్లు, ఎండోమెట్రియాసిస్ సంబంధిత మాస్‌ను తొలగించడానికి ఈ సర్జరీ అవసరం అవుతుంది. కొంతమందిలో పొట్టలో తలెత్తే ఇన్‌ఫెక్షన్ల వల్ల ఫెలోపియన్ ట్యూబ్‌లు, పేగులు అతుక్కుపోయి, అండాన్ని ట్యూబులు అందుకోలేకపోతూ ఉంటాయి. ఈ సమస్యను కూడా ల్యాప్రోస్కోపీతో సరిచేయవచ్చు. బొడ్డు దగ్గర చిన్న కోత పెట్టి, అక్కడి నుంచి కెమెరాను పంపించి, పొట్ట దగ్గర ఐదు మిల్లీ మీటర్ల వ్యత్యాసంతో మూడు చిన్న గాట్లు పెట్టి పరికరాలు చొప్పించి ల్యాప్రోస్కోపీ సర్జరీ చేయవలసి ఉంటుంది. సర్జరీ చేసిన రోజు లేదా మరుసటి రోజు ఆస్పత్రి నుంచి వెళ్లిపోవచ్చు.

డాక్టర్ నర్మదా కటకం
గైనకలాజిస్ట్, ఫర్టిలిటీ స్పెషలిస్ట్,
హైదరాబాద్.

మేఘన్ మెయిల్ చేసింది...



పిల్లలు చిన్నతనంలో చేసిన అల్లరి పనుల గురించి తల్లిదండ్రులు మురిపెంగా అందరికీ చెబుతూ ఉంటారు. వాళ్ల అందమైన బాల్యాన్ని కొంతవరకూ డైరీలు, ఫొటోలు, వీడియోల రూపంలో దాచిపెడుతూ ఉంటారు. కానీ పిల్లలకు మాత్రం అవేవీ గుర్తుండవు. పిల్లలు పెద్దయ్యాక వారి బాల్యాన్ని కళ్ల ముందు నిలపడమే కాదు ఎప్పుడు కావాలంటే అప్పుడు చూసుకుని మురిసిపోయేలా ఏర్పాటు చేసింది మేఘన్ మార్కెల్ అనే అమెరికన్ అమ్మ. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పిల్లలకు అద్భుతమైన బహుమతిని సిద్ధం చేస్తోంది. పిల్లల పేరిట ఈ మెయిల్ ఐడీని సృష్టించి వాళ్ల బాల్యాన్ని వాళ్లకే మెయిల్ చేస్తోంది. ఈ సరికొత్త ఆలోచన సెలబ్రిటీలను సైతం ఆకర్షించడం విశేషం.

ఆలియా కూడా...

ఆలియా భట్ కూడా తన రెండేళ్ల కూతురు రాహా కోసం ఈ మెయిల్ ఐడి క్రియేట్ చేసినట్లు ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ చెప్పింది. నెలవారీ సంఘటనల సమాహారాన్ని ఫొటోలు, వీడియోలతో సహా తన కూతురికి మెయిల్ చేస్తున్నట్లు తెలిపింది. రాహా పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నో అమూల్యమైన క్షణాలను మెయిల్ చేశానంది. ఈ మెయిల్ ఐడీని రాహాకు పద్దెనిమిదేళ్లు వచ్చాక ఆమెకు బహుమతిగా ఇవ్వడానికి ప్లాన్ చేస్తున్నట్లు చెప్పింది. ఓ స్నేహితురాలి ద్వారా ఈ అంశం తెలిసిందనీ తనకు బాగా నచ్చిందనీ తన కూతురికి ఇంతకంటే మంచి బహుమతి వేరే ఏదీ ఉండదని చెప్పుకొచ్చింది ఆలియా.



ఎవరీ మేఘన్?

పేరు వినగానే ఎక్కడో విన్నట్టు అనిపిస్తుంది కదా! ఆమె ఎవరో కాదు ప్రిన్స్ హ్యారీని పెళ్లి చేసుకుని బ్రిటిష్ రాజకుటుంబంలో అడుగుపెట్టిన అమెరికన్ మహిళ. వీరికి ఇద్దరు పిల్లలు. కొడుకు ఆర్చీకి ఆరేళ్లు కాగా కూతురు లిలిబెత్‌కు నాలుగేళ్లు. వివాహానికి ముందు మేఘన్ మార్కెల్ మంచి నటిగా పేరుతెచ్చుకున్నారు. తరువాత స్వశక్తితో శ్రమించి వ్యాపారవేత్తగా కూడా ఎదిగారు.

ఆలోచన అద్భుతం!

అమ్మకు పిల్లలే ప్రపంచం. వాళ్ల బాగోగులు చూస్తూ జాగ్రత్తగా పెంచడంలోనే ఆమెకు సమయమంతా గడుస్తుంటుంది. పిల్లలు పెరిగి పెద్దయ్యే క్రమంలో ఎప్పుడు ఎలాంటి అల్లరి పనులు చేశారో అన్నీ అమ్మకు గుర్తుంటాయి. అమ్మ తనివితీరా మాతృత్వాన్ని ఆస్వాదిస్తుంది. ఎన్నో మధురానుభూతులను మూటకట్టుకుంటుంది. చూస్తుండగానే రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచి పిల్లలు పెద్దయిపోతారు. చదువులు, పరీక్షలు అంటూ క్షణం విరామం లేకుండా ఉంటారు. వాళ్లకి సమయం ఉన్నప్పుడు మాత్రమే చిన్నప్పటి తీపి జ్ఞాపకాల గురించి అమ్మానాన్నలు చెప్పాల్సి వస్తుంది. దీని వల్ల పిల్లలు పూర్తి స్థాయిలో సంతోషాన్ని ఆస్వాదించలేకపోతున్నారని భావించింది మేఘన్. పిల్లల్ని పెంచుతూ ఒక అమ్మగా తను ఎంత ఆనందం పొందిందో... అంతే సంతోషాన్ని పిల్లలకు కూడా అందించాలనుకుంది. తమ బాల్యాన్ని మళ్లీ మళ్లీ చూసుకుంటూ పిల్లలు మురిసిపోవాలనుకుంది. ఈ క్రమంలోనే ఆమెకు తన స్నేహితురాలు అనుసరిస్తున్న ఈ మెయిల్ ప్రక్రియ గురించి తెలిసింది. వెంటనే పిల్లల పేరిట ఈ మెయిల్స్ క్రియేట్ చేసేసింది మేఘన్.

మార్కెల్ మెయిల్...

రోజూ పడుకునే ముందు ఆ రోజు పిల్లలు చేసిన అల్లరి పనులు, ఫన్నీ ఇన్సిడెంట్స్ గురించి రాసి వాళ్లిద్దరికీ మెయిల్ చేస్తుంది మేఘన్. సందర్భానుసారం తీసిన ఫొటోలు, వీడియోలను కూడా జతచేస్తుంది. పిల్లల మొదటి అడుగులు, వచ్చీరాని మాటలు, ఆట పాటల... ఇలా వాళ్ల బాల్యాన్ని ఏరోజుకారోజు మెయిల్ చేస్తోంది. రిపోర్ట్ కార్డులు, భోజనాల వేళ అలకలు, పిల్లలిద్దరి మధ్య పెరిగే అనుబంధం... ఇలా ఎన్నింటినో మెయిల్ ద్వారా పంపిస్తోంది. "పిల్లలు మెయిల్ చూస్తారా?" అని ఎవరైనా ప్రశ్నిస్తే 'నా పిల్లలు పెద్దయ్యాక అంటే పదహారు లేదా పద్దెనిమిదేళ్లు వచ్చాక వాళ్లకి ఈ మెయిల్ ఐడీ, పాస్‌వర్డ్ ఇస్తాను. వీటిలో వాళ్ల బాల్యం ఉందని చెబుతాను. సమయం ఉన్నప్పుడల్లా చూసుకుని ఆనందించమంటాను. ఇదే తల్లిగా నేను వాళ్లకిచ్చే అద్భుతమైన బహుమతి.' అంటూ సమాధానమిస్తారు మేఘన్.

పేరెంటింగ్ పాఠం

మేఘన్ మార్కెల్ పంపిన మెయిల్స్ భవిష్యత్తులో పిల్లలకు మరుపురాని అనుభూతిని అందిస్తాయి. వాళ్ల చిన్నతనంలోకి తొంగిచూసే అవకాశాన్ని కల్పిస్తాయి. వాళ్ల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి. అమెరికాలోని కాన్షియస్ కో పేరెంటింగ్ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకుడైన డోర్సీ పోర్టర్ మాట్లాడుతూ "మేఘన్ అనుసరిస్తున్న ఈ మెయిల్ ప్రక్రియ అనేది తల్లి బిడ్డల భావోద్వేగాలకు మాత్రమే పరిమితమైన అంశం కాదు, ఎంతో పకడ్బందీగా రూపొందించిన పేరెంటింగ్ పాఠం" అంటూ ప్రశంసించారు.

న్యూస్ మేకర్

'కాంతారా ఛాప్టర్ 1'లో యోధురాలైన రాకుమారి పాత్ర పోషించిన రుక్మిణి వసంత్, ఆ పాత్రలో ఒదిగిపోవడం కోసం ఎంతో శ్రమకోర్చి... శారీరకంగా, మానసికంగా సంసిద్ధురాలైంది. నాల్గవ శతాబ్దపు రాకుమారిగా ప్రేక్షకులను మెప్పించడం కోసం రుక్మిణి అనుసరించిన నియమాలు, తీసుకున్న శిక్షణలు ఇవే...



భళా...కాంతారా కాంత

పాత్ర స్వభావాన్ని అర్థం చేసుకున్నంత మాత్రాన ఆ పాత్రకు నూరు శాతం న్యాయం చేకూర్చడం సాధ్యపడదు. మరీ ముఖ్యంగా ఒక చారిత్రక పాత్రను పోషించే సందర్భంలో కాలమాన పరిస్థితులు, సంస్కృతులు, ఆచార వ్యవహారాలు, ఆహార్యాలు, ప్రవర్తనలు లాంటి ఎన్నో అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి. ఈ విషయంలో 'కాంతారా' కాంత రుక్మిణి ఎంతో జాగ్రత్తగా నడుచుకుంది.

బాడీ లాంగ్వేజ్ కీలకం

'కాంతారా ఛాప్టర్1' కథానాయకురాలైన రుక్మిణి వసంత్ తాను పోషించిన యోధురాలు కనకవతి పాత్ర గురించి వివరిస్తూ, "ఆ పాత్రలో ఒదిగిపోవడం కోసం అర్థం చేసుకోవలసిన సాంస్కృతిక అంశాలెన్నో ఉన్నాయనే విషయాన్ని నేను గ్రహించాను. ఆ ప్రాంతాన్ని అధ్యయనం చేయడం ద్వారా సాంస్కృతిక అవగాహన సాధ్యపడింది. అలాగే కత్తి యుద్ధం, గుర్రపు స్వారీలో కూడా శిక్షణ తీసుకున్నాను. ఏ పాత్రకైనా బాడీ లాంగ్వేజ్ ఎంతో కీలకం. రాకుమారి పాత్ర పోషించినా, కాలేజీ విద్యార్థి పాత్ర పోషించినా నాల్గవ శతాబ్దపు రాకుమారి పాత్ర పోషించినా, మనల్ని మనం తెర మీద ప్రదర్శించుకునే సందర్భంలో బాడీ లాంగ్వేజ్ ఒక కీలకమైన అంతర్గత భాగమవుతుంది. కాబట్టి ఈ పాత్ర కోసం షూటింగ్‌కు నాలుగు రోజుల ముందే రచయితలతో చర్చించి, ఎలా నడవాలో, ఎలా మాట్లాడాలో తెలుసుకుని తెర మీద కనబరచవలసిన బాడీ లాంగ్వేజ్ గురించి అవగాహన ఏర్పరుచుకున్నాను' అంటూ పాత్ర ప్రాధాన్యం గురించి వివరించింది రుక్మిణి.

కత్తి యుద్ధం, గుర్రపు స్వారీల కోసం...



రాకుమారి కేవలం రాజమందిరానికే పరిమితం కాదు. అవసరమైతే కరవాలం చేతపట్టి, కదనరంగంలో ధైర్యసాహసాలను ప్రదర్శించాలి. అందుకోసం కరవాలాన్ని ఉపయోగించడంలో కూడా శిక్షణ తీసుకుందామె. ఈ అనుభవం గురించి వివరిస్తూ..' 'ఒక చోట నిలబడడం, నడవడం సులభమే! కానీ కత్తియుద్ధం చేసేటప్పుడు మన శరీరం భిన్నంగా కదులుతుంది. ఆ సమయంలో శరీరం కదలికల మీద పట్టు పెంచుకోవడం కోసం ఆ పోరాటంలో పాఠాలు కూడా నేర్చుకున్నాను. అలాగే డైలాగులు చెప్పేటప్పుడు భావోద్వేగాలను ఒలికించడంలో మెలకువలు కూడా పెంపొందించుకున్నాను' అంటోంది రుక్మిణి. నిజానికి 'కాంతారా ఛాప్టర్1'లో రాకుమారి పాత్రకు సిద్ధపడే క్రమంలో... గుర్రపు స్వారీ మొదలు, కత్తి యుద్ధం, బాడీ లాంగ్వేజ్, సంప్రదాయ ఆధారిత డాన్స్ వరకూ తానెన్నో అంశాల మీద పట్టు పెంచుకున్నట్టు రుక్మిణి చెప్తోంది. ఈ సినిమాలో నటించడం తన కల అనీ, ఇలాంటి భిన్నమైన అంశాలను అన్వేషించే అవకాశం దొరకడం తన అదృష్టమని కూడా అంటోంది.

రుక్మిణి ప్రస్థానమిది

నటి రుక్మిణి తండ్రి, కల్నల్ వసంత్ వేణుగోపాల్ భారత సైన్యంలో ఉన్నతాధికారి. దేశానికి అందించిన సేవలకుగాను అతను అశోక చక్ర అవార్డును పొందడం విశేషం. రుక్మిణి తల్లి సుభాషిణి వసంత్ భరతనాట్య కళాకారిణి. ధైర్యసాహసాలు, కళల సమ్మిళిత కుటుంబానికి చెందిన రుక్మిణి కూడా ఆ అద్భుతమైన లక్షణాలను పుణికిపుచ్చుకుంది. కాబట్టే తన తల్లి అడుగుజాడల్లో నడుస్తూ భరతనాట్యం నేర్చుకుని తన తల్లి డాన్స్ ట్రూప్‌తో కలిసి ప్రదర్శనలు ఇవ్వడం మొదలుపెట్టింది. లయ, భావ ప్రదర్శన, డాన్స్‌లో పొందిన శిక్షణలు ఆమెలోని కళాత్మకతను సుసంపన్నం చేయడమే కాకుండా, నటనలో కూడా ఆమెకెంతో తోడ్పడ్డాయి. రుక్మిణి ప్రపంచంలోనే ప్రతిష్ఠాత్మక డ్రామా స్కూల్స్‌లో ఒకటైన లండన్‌లోని రాయల్ అకాడమీ ఆఫ్ డ్రమటిక్ ఆర్ట్‌లో నటనలో శిక్షణ పొందింది. రుక్మిణికి పుస్తకాలంటే ఆపేక్ష ఎక్కువ. సాహిత్యం, కవిత్వాల పట్ల తనకున్న మక్కువను తరచూ ఇన్‌స్టా పోస్టుల్లో ప్రదర్శిస్తూ ఉంటుంది. నటిగా ఎదగడానికి తోడ్పడిన అంశాల్లో పుస్తకపఠనం ఒకటని రుక్మిణి చెబుతూ ఉంటుంది. కథల్లో లీనమైపోవడం ద్వారా భిన్నమైన భావోద్వేగాలు, దృక్కోణాలను అన్వేషించడం నేర్చుకున్నట్టు కూడా చెబుతుంది. విభిన్న భాషల్లో కూడా ఆమెకు ప్రావీణ్యం ఉంది. మాతృభాష కన్నడతో పాటు, ఇంగ్లీషు, హిందీ, తమిళం భాషల్లో అనర్గళంగా మాట్లాడగలుగుతుంది. 'కాంతారా ఛాప్టర్1'కు ముందు 'సప్తసాగరదాచె ఎల్లో' అనే సినిమాలో మర్చిపోలేని నటనను ప్రదర్శించి అవార్డులను సొంతం చేసుకుంది. తాజాగా 'కాంతారా ఛాప్టర్1' సినిమా విజయంతో రుక్మిణి తిరుగులేని నటిగా గుర్తింపు పొందుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.



వ్యాయామం తరువాత...

రోజంతా ఉత్సాహంగా ఉండాలంటే.. ఉదయాన్నే వ్యాయామం తప్పనిసరి. అలా వ్యాయామం చేసిన తరువాత అలసటగా, దాహంగా అనిపిస్తూ ఉంటుంది. అలాంటప్పుడు నీళ్ల ఏ విధంగా తాగడం మంచిదో తెలుసుకుందాం...

- వ్యాయామం చేస్తున్నప్పుడు విపరీతంగా చెమట పడుతూ ఉంటుంది. కాబట్టి శరీరం డీహైడ్రేట్ కాకుండా మంచి నీళ్ల తాగడం అత్యవసరం. కనీసం అరలీటరు దాకా నీళ్ల తాగాల్సి ఉంటుంది. శరీర తత్వం, వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని తాగే నీటి పరిమాణాన్ని సర్దుబాటు చేసుకోవచ్చు.
- వ్యాయామం పూర్తయిన పది నిమిషాల తరువాత గోరువెచ్చని నీళ్ల తాగడం మంచిది. దీనివల్ల శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వస్తుంది. రక్త ప్రసరణ వేగం నియంత్రణలో ఉంటుంది.
- వ్యాయామం తరువాత దాహంగా ఉందంటూ చల్లటి నీళ్ల తాగకూడదు. అలా తాగితే జీర్ణ వ్యవస్థ పనితీరు మందగించడంతోపాటు కండరాల తిమ్మిరి లాంటి సమస్యలు ఏర్పడతాయి.
- వ్యాయామానికి ముందు, తరువాత మంచినీళ్ల తాగడం మంచిదే అయినప్పటికీ.. అధికంగా నీళ్ల తాగడం లేదా అసలు తాగకపోవడం అనేవి రెండూ హానికరమని గుర్తుంచుకోవాలి. అవసరమైనంత వరకు మాత్రమే నీళ్ల తాగి శరీరాన్ని తేమగా ఉంచుకోవాలి.

రూ.900 కోట్లతో జాతీయ శాట్‌కామ్ పర్యవేక్షణ కేంద్రం

టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడి



న్యూఢిల్లీ: దేశంలోని డేటా వనరులు, స్పెక్ట్రమ్ ఆస్తులను పరిరక్షించేందుకు దాదాపు రూ.900 కోట్లతో జాతీయ శాట్‌కామ్ పర్యవేక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా బుధవారం వెల్లడించారు. ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) సదస్సులో శాటిలైట్ కమ్యూనికేషన్స్ అంశంపై జరిగిన సెషన్‌లో మాట్లాడుతూ టెలికం, బ్రాడ్‌కాస్టింగ్‌తో కూడిన దేశీయ శాట్‌కామ్ మార్కెట్ గత ఏడాది 430 కోట్ల డాలర్ల స్థాయికి చేరుకుందన్నారు. 2033 నాటికి దాదాపు 1,500 కోట్ల డాలర్ల స్థాయికి పెరగవచ్చన్నారు. దేశంలో శాటిలైట్ ద్వారా వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ప్రైవేట్ రంగంలోని మూడు సంస్థలు యూటెల్‌శాట్ వన్‌వెబ్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్, జియో ఎస్‌జీఎస్‌కు లైసెన్సులు మంజూరు చేసింది. ఈ మూడు సంస్థలు శాట్‌కామ్ సేవలను ప్రారంభించేందుకు అవసరమైన స్పెక్ట్రమ్ కేటాయింపుల కోసం ఎదురు చూస్తున్నాయి.

వేగంగా శాట్‌కామ్ సేవల విస్తరణ

భారత టెలికం సంస్థలు ఇప్పటివరకు 4.8 లక్షల టవర్ల ఏర్పాటు ద్వారా దేశంలోని 99.9 శాతం జనాభాకు 5జీ సేవలను అందుబాటులోకి తెచ్చాయని సింధియా అన్నారు. "ఇక శాటిలైట్ కమ్యూనికేషన్ సేవల్లోకి అడుగుపెట్టబోతున్నాం. ప్రపంచంలోనే అత్యంత వేగంగా శాటిలైట్ సేవలు విస్తరించడమే కాకుండా మానవాళికి శాట్‌కామ్ అవసరాన్ని పునర్‌నిర్వచిస్తాం. ఇంతక్రితం 5జీతో ఇదే చేశాం. ప్రపంచ దేశాలన్నింటిలోకెల్లా వేగంగా 20 నెలల్లోనే 5జీ సేవలను విస్తరింపజేశాం. శాట్‌కామ్ విషయంలోనూ ఆ ఫలితాన్ని పునరావృతం చేస్తామని హామీ ఇస్తున్నా" అని మంత్రి పేర్కొన్నారు.

6జీలో 10 శాతం పేటెంట్ల లక్ష్యం


భారత్ ఆశయాలు 5జీని దాటి 6జీ, శాట్‌కామ్‌కు విస్తరించి ఉన్నాయని సింధియా అన్నారు. 6జీ సాంకేతికతలో 10 శాతం పేటెంట్లను కలిగి ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. దేశంలో శాట్‌కామ్ సేవలు విశేషంగా వృద్ధి చెందనున్నాయని, 2033 నాటికి ఈ మార్కెట్ మూడింతలు కావచ్చన్నారు.

భారతీయులకు భద్రమైన, ఆమోదనీయమైన, అత్యంత నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ అనుభూతిని పంచేందుకు సంసిద్ధంగా ఉన్నాం.

- పర్ణిల్ ఉర్ధ్వరేశే, స్టార్‌లింక్ ఇండియా ప్రతినిధి

టెలికం శాఖ అభివృద్ధి చేసిన ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్ ప్లాట్‌ఫామ్ సహాయంతో ఫోన్‌పే, పేటీఎం వంటి పేమెంట్ యాప్‌లు రూ.200 కోట్ల వరకు ఆర్థిక మోసాలను అరికట్టగలిగాయి.

- రాహుల్ చారి, ఫోన్‌పే సహ-వ్యవస్థాపకుడు



భారత్‌లో శాట్‌కామ్ సేవలపై ప్రజల అంచనాలు పెరుగుతున్న తరుణంలో యూటెల్‌శాట్ వన్‌వెబ్ ద్వారా శాట్‌కామ్ సేవలను ప్రారంభించేందుకు కేంద్రం అనుమతి కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాం.

- సునీల్ మిట్టల్, భారతీ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్



సెమీకండక్టర్ల నుంచి ఫ్రాడ్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ వరకు, త్వరలో రాబోతున్న 6జీలో భారత్ పురోగతిని ఐఎంసీలో ప్రదర్శించిన పూర్తి స్థాయి సాంకేతికతలు నొక్కి చెబుతున్నాయి. డిజిటల్ విప్లవంలో భారత్‌ను అగ్రస్థానంలో ఉంచడంతో పాటు నవ ఆవిష్కరణలకు మా కంపెనీ కట్టుబడి ఉంది.

- ఆకాశ్ అంబానీ, రిలయన్స్ జియో చైర్మన్

నెఫ్రోప్లస్ @ 500 క్లినిక్‌లు

న్యూఢిల్లీ: నెఫ్రోప్లస్ పేరుతో డయాలిసిస్ సేవలందిస్తోన్న హైదరాబాద్ సంస్థ నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ కార్యకలాపాలు కీలక మైలురాయికి చేరాయి. 2010లో ఒక క్లినిక్‌తో ప్రారంభమైన తమ ప్రస్థానం.. ప్రస్తుతం 500 కేంద్రాలకు పెరిగిందని నెఫ్రోప్లస్ బుధవారం వెల్లడించింది. భారత్‌తోపాటు నేపాల్, ఫిలిప్పీన్స్, ఉజ్బెకిస్థాన్ మార్కెట్లకూ తమ సేవలను విస్తరించినట్లు, ఏటా 33,000 మందికి పైగా రోగులకు సేవలందిస్తున్నట్లు తెలిపింది. కాగా ఈ సంస్థ ఐపీఓకి కూడా సిద్ధమవుతోంది.

సియెల్ ఎనర్జీకి గోల్డెన్ పీకాక్ అవార్డు

న్యూఢిల్లీ: దేశంలోని ఇండిపెండెంట్ విద్యుత్ ఉత్పత్తి కంపెనీల్లో ఒకటైన సియెల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ కార్పొరేట్ గవర్నెన్స్‌లో అద్భుత ప్రమాణాలకుగాను 2025 సంవత్సరానికి గోల్డెన్ పీకాక్ అవార్డు దక్కించుకుంది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ ఈ అవార్డును ప్రకటించింది. విశ్వసనీయత, పారదర్శకత, వాటాదారులకు విలువ కల్పనలో తాము చేస్తున్న అవిశ్రాంత కృషికి ఇది ఒక గుర్తింపు అని కంపెనీ సీఈఓ జయమేజయ మహాపాత్రా అన్నారు. కార్పొరేట్ గవర్నెన్స్‌పై లండన్‌లో జరిగే వార్షిక సమావేశంలో ఈ ఏడాది నవంబర్ 4వ తేదీన ఈ అవార్డును మహాపాత్రాకు అందచేస్తారు.

ఐఫోన్ ఎగుమతుల్లో రికార్డు

2025-26 ప్రథమార్ధంలో 1000 కోట్ల డాలర్లు



న్యూఢిల్లీ: భారత్ నుంచి యాపిల్ ఐఫోన్ల ఎగుమతులు సరికొత్త రికార్డు స్థాయికి పెరిగాయి. వర్తమాన ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో భారత్‌లోని తన థర్డ్ పార్టీ తయారీ యూనిట్ల నుంచి 1,000 కోట్ల డాలర్ల (దాదాపు రూ.88,730 కోట్లు) విలువైన ఐఫోన్లను యాపిల్ కంపెనీ ఇతర దేశాలకు సరఫరా చేసింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో నమోదైన 571 కోట్ల డాలర్లతో పోలిస్తే ఈసారి ఎగుమతులు 75 శాతం పెరిగాయి. అందులో అమెరికా మార్కెట్‌కు పంపినవే అధికం. అమెరికాలోనే ఐఫోన్ల తయారీ కోసం ట్రంప్ ఒత్తిడి చేస్తున్నప్పటికీ, యాపిల్ మాత్రం భారత్ నుంచి ఎగుమతులను పెంచుతూ పోతుండటం గమనార్హం.

సెంబ్‌కార్ప్ గూటికి రెన్యూ సన్ బ్రైట్

● డీల్ విలువ రూ.1,700 కోట్లు

న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన రంగ సంస్థ రెన్యూ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన రెన్యూ సన్ బ్రైట్ యూనిట్‌ను 24.6 కోట్ల సింగపూర్ డాలర్లకు (రూ.1,700 కోట్లు) కొనుగోలు చేస్తున్నట్లు సింగపూర్ విద్యుత్ తయారీ కంపెనీ సెంబ్‌కార్ప్ ఇండస్ట్రీస్ బుధవారం తెలిపింది. రెన్యూ సన్ బ్రైట్ యూనిట్ రాజస్థాన్‌లోని ఫతేపూర్‌లో 300 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్‌ను నిర్వహిస్తోంది. ఈ డీల్ అనంతరం భారత్‌లో సెంబ్‌కార్ప్ పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యం 6.9 గిగావాట్లకు పెరగనుంది. ప్రపంచవ్యాప్తంగా ఈ సామర్థ్యం 19.3 గిగావాట్లకు చేరనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

9వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	540
వరంగల్	522	గోదావరి	535
చిత్తూరు	528	విశాఖపట్నం	525
		దజను గుడ్లు రూ. 72	



ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	105	విజయవాడ	124
వరంగల్	105	గుంటూరు	114
కరీంనగర్	105	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	95
కర్నూలు	105	నెల్లూరు	100
విశాఖపట్నం	127	అనంతపురం	100
గోదావరి	124		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,23,170 ▲	1,12,900 ▲	1,67,000 ▼
విజయవాడ	1,20,600 ▼	1,15,000 ▼	1,60,000 ▲
విశాఖపట్నం	1,26,050 ▲	1,11,850 ▲	1,70,000 ▲
రాజమండ్రి	1,23,920 ▲	1,13,600 ▲	1,54,200 ▲
ప్రొద్దుటూరు	1,27,000 ▲	1,16,840 ▲	1,58,000 ▲
ముంబై	1,22,100 ▲	1,11,840 ▲	1,52,700 ▲

అన్ని వర్గాల అవసరాలు తీర్చాలి

ఫిన్‌టెక్ కంపెనీలకు ఆర్‌బీఐ గవర్నర్ సూచన



ముంబై: ఫిన్‌టెక్ కంపెనీలు ఉత్పత్తుల రూపకల్పనలో సమాజంలోని దిగువ వర్గాలు, ప్రత్యేక అవసరాలు గల వ్యక్తులకు సేవలందించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సూచించారు. సంపన్నులకు సేవలందించడం లాభదాయకమే కాని..అదే సమయంలో అన్ని వర్గాలకు అవి ఉపయోగకరంగా ఉండడం కూడా ప్రధానమేనన్నారు. ఆర్థిక అక్షరాస్యత లేని వారు, వయోవృద్ధులు, దివ్యాంగులు, చిన్న వ్యాపారుల అవసరాలను నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ప్రధానంగా చిన్న వ్యాపార సంస్థలు, అల్పాదాయ వర్గాలకు అవసరమైనంతగా రుణం అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉన్నదన్న విషయం ఆయన గుర్తు చేశారు. ఫిన్‌టెక్ కంపెనీల ఉత్పత్తులు పారదర్శకంగా, ఖాతాదారుల డేటాను పరిరక్షించేలా ఉండాలని కోరారు. దేశంలో పెరిగిపోతున్న డిజిటల్ మోసాలపైనా ఆర్‌బీఐ చీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టేందుకు వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త తరం ఫైనాన్షియల్ మార్కెట్ సాధనంగా ఆర్‌బీఐ "యునిఫైడ్ మార్కెట్స్ ఇంటర్‌ఫేస్"ను రూపొందించినట్టు మల్హోత్రా చెప్పారు. ఇది సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీని (సీబీడీసీ) ఉపయోగించుకుని ఆస్తులు, సెటిల్మెంట్లు చేయగల సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. దీనికి సంబంధించిన తొలి ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నట్టు చెప్పారు.

నిధులకు ఢోకా లేదు: ఎస్‌బీఐ చైర్మన్

లిస్టెడ్ కంపెనీల కొనుగోళ్లు, విలీనాలకు అవసరమైన రుణాలు సమకూర్చేందుకు తమ బ్యాంకుకు ఎలాంటి నిధుల కొరత లేదని గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో పాల్గొన్న ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. ఇటీవల ప్రకటించిన ద్వైమాసిక ద్రవ్య, పరపతి విధాన సమీక్షలో, లిస్టెడ్ కంపెనీలు వేరే కంపెనీలను కొనుగోలు చేయడం లేదా విలీనాలకు అవసరమైన నిధులు సమకూర్చేందుకు ఆర్‌బీఐ బ్యాంకులను అనుమతించింది. ఈ నేపథ్యంలో ఎస్‌బీఐ చీఫ్ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. ఈ విషయంలో తమ బ్యాంకుకు పూర్తి పరిజ్ఞానం ఉందన్నారు. ఇప్పటికే తమ బ్యాంకు భారతీయ కంపెనీలు విదేశీ కంపెనీలను కొనేందుకు అవసరమైన నిధులు సమకూరుస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. యూపీఐ ద్వారా జరిగే రుణ వసూళ్ల విషయంలో బ్యాంకులు తమ సామర్థ్యాన్ని మరింత పెంచుకోవాల్సిన అవసరం ఉందని శెట్టి స్పష్టం చేశారు.

పసిడి మరో కొత్త రికార్డు

ప్రొద్దుటూరులో 10 గ్రాములు రూ.1.27 లక్షలు

న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్‌లో రికార్డుల హోరు కొనసాగుతోంది. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో పసిడి ధర బుధవారం మరో రికార్డు స్థాయికి చేరింది. ఢిల్లీలో 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం ధర ఒక్క రోజులోనే రూ.2,600 పెరిగి రూ.1,26,600కు చేరి సరికొత్త రికార్డు నమోదు చేసింది. గత మూడు రోజుల్లోనే 10 గ్రాముల పసిడి ధర రూ.6,000 పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి ధర 4,050 డాలర్లకు చేరి సరికొత్త రికార్డు నమోదు చేసింది. ఢిల్లీలో కిలో వెండి ధర సైతం బుధవారం రూ.3,000 లాభంతో రూ.1.57 లక్షలకు చేరింది.

తెలుగు రాష్ట్రాల్లో : తెలుగు రాష్ట్రాల్లోనూ బంగారం, వెండి ధరలు బుధవారం చుక్కలంటాయి. ప్రొద్దుటూరులో 10 గ్రాముల మేలిమి పసిడి రూ.2,500 లాభంతో రూ.1.27 లక్షలకు చేరి సరికొత్త రికార్డు నమోదు చేసింది. విశాఖపట్నంలో కిలో వెండి రూ.2,900 లాభంతో రూ.1.7 లక్షలకు చేరి రికార్డు సృష్టించింది.

నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్

ముంబై: స్టాక్ మార్కెట్‌లో నాలుగు రోజుల ర్యాలీకి బుధవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ 153.09 పాయింట్ల నష్టంతో 81,773.66 వద్ద ముగియగా నిఫ్టీ 62.15పాయింట్ల నష్టంతో 25,046.15 వద్ద ముగిశాయి. ఆర్‌ఐఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వంటి బ్లూచిప్ కంపెనీలు, ఆటో, రియల్ ఎస్టేట్, బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణ అమ్మకాలు బుధవారం సూచీలను కిందికి లాగాయి. క్యూ2లో కంపెనీల ఆర్థిక ఫలితాలపై అనుమానాలు కూడా ఇందుకు దోహదం చేసినట్టు జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ కంపెనీ రీసెర్చి హెడ్ వినోద్ నాయర్ చెప్పారు.

స్పోర్ట్స్

భారత క్రికెట్‌లో గంభీర దుమారం!



ఆస్ట్రేలియాలో జరిగే పర్యటనకు భారత వన్డే జట్టు కెప్టెన్‌గా రోహిత్ శర్మను తొలగించడం..దేశ క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు టీ20లకు, టెస్ట్‌లకు ఇప్పటికే వీడ్కోలు పలికిన టీమిండియా దిగ్గజ ద్వయం రోహిత్-కోహ్లీని వన్డేల నుంచీ తప్పించాలన్న కుట్ర జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే రోహిత్‌ను వన్డే జట్టు సారథ్య బాధ్యతల నుంచి తొలగించారనేది కొందరి వాదన. రెండు ఫార్మాట్లనుంచి రోహిత్, కోహ్లీ తప్పుకొనేలా చేయడంతోపాటు మిగిలిన వన్డేల నుంచీ వారు వైదొలగేలా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కుట్ర పన్నుతున్నాడని రో-కో అభిమానులు దుయ్యబడుతున్నారు. అలాగే ఈ ఇద్దరు గొప్ప క్రికెటర్ల కెరీర్‌లకు పొమ్మనలేక పొగబెడుతున్నాడని గంభీర్‌పై మాజీ ఆటగాడు మనోజ్ తివారీ ధ్వజమెత్తడం కీలక తాజా పరిణామం. మరోవైపు ముంబైలో జరిగిన సియెట్ క్రికెట్ అవార్డుల కార్యక్రమంలో రోహిత్ శర్మ చేసిన వ్యాఖ్యలు కూడా చర్చకు దారితీశాయి. చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు టైటిల్ గెలిచేందుకు గత కోచ్ రాహుల్ ద్రవిడ్ ముందుచూపు, అతడి కోచింగ్ నైపుణ్యాలే కారణమని రోహిత్ స్పష్టంజేశాడు. దాంతో..టీమిండియా చాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలవడంలో గంభీర్ పాత్ర లేదని తమ స్టార్ తేల్చేశాడని రోహిత్ ఫ్యాన్స్ అంటున్నారు.

గంభీర్ తీరుతో వివాదాలు: మనోజ్ తివారీ

మాజీ ఆటగాడు మనోజ్ తివారీ చేసిన వ్యాఖ్యలు కూడా సంచలనం సృష్టించాయి. 'గంభీర్ కోచ్ అయ్యాకనే ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న అశ్విన్ అర్ధంతరంగా కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. రోహిత్, కోహ్లీ సుదీర్ఘ ఫార్మాట్‌నుంచి రిటైర్ అయ్యారు. రోహిత్, కోహ్లీ, అశ్విన్‌లకు ప్రస్తుత కోచ్ కంటే చాలా పేరు ప్రఖ్యాతులున్నాయి. జట్టుకు నచ్చని విషయాలను సీనియర్లు వ్యతిరేకిస్తారనే ఉద్దేశంతోనే వారు జట్టులో లేకుండా కోచ్ చూసుకుంటున్నాడు. 2027 వన్డే వరల్డ్ కప్ జట్టులో రో-కో లేకపోతే అది గంభీర్ చెత్త నిర్ణయం అవుతుంది' అని మనోజ్ వ్యాఖ్యానించాడు.

ఏకమైన రో-కో ఫ్యాన్స్

గంభీర్‌కు వ్యతిరేకంగా రోహిత్, విరాట్ అభిమానులు ఒక్కటయ్యారు. తన అహంకారాన్ని సంతృప్తి పరుచుకొనేందుకు తమ స్టార్లిద్దరి కెరీర్‌లను గంభీర్ నాశనం చేశాడని దుయ్యబడుతున్నారు. జట్టునుంచి గౌరవ మర్యాదలు పొందలేని అతడు సీనియర్ ఆటగాళ్లను లక్ష్యంగా చేసుకున్నాడని ఆరోపిస్తున్నారు. గంభీర్ వల్లే తమ స్టార్లకు ఈ పరిస్థితి ఏర్పడిందని రో-కో ఫ్యాన్స్ మండిపడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

తరుణ్ సూపర్

● 14వ ర్యాంకర్‌కు షాక్
● లక్ష్య సేన్ ఇంటికి
● ఆర్కిటిక్ ఓపెన్



వన్తా (ఫిన్లాండ్): తెలుగు షట్లర్ తరుణ్ మన్నేపల్లి ఆర్కిటిక్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో శుభారంభం చేశాడు. ప్రపంచ 14వ ర్యాంకరైన టోమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్)కు షాకిచ్చి రెండోరౌండ్‌కు దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన తొలి రౌండ్లో 46వ ర్యాంకర్ తరుణ్ 11-21, 21-11, 22-20తో పొపోవ్‌ను కంగుతినిపించాడు. లక్ష్య సేన్ 15-21, 17-21తో ఐదోసీడ్ కొడాయి నరకొర (జపాన్) చేతిలో ఓటమిపాలయ్యాడు. ఓ టోర్నీలో ఆరంభ రౌండ్లోనే ఓడడం లక్ష్యకు ఈ ఏడాదిలో ఇది పదోసారి. కిడాంబి శ్రీకాంత్ ఆరంభ మ్యాచ్ ఆడకుండానే ప్రత్యర్థికి వాకోవర్ ఇవ్వగా.. కిరణ్ జార్జ్ 10-21, 1-4తో ప్రత్యర్థిపై వెనుకంజలో ఉన్న దశలో గాయంతో మ్యాచ్ నుంచి వైదొలిగాడు. ఇక, శంకర్ ముత్తుస్వామి, ఆయుష్ షెట్టి ప్రత్యర్థుల చేతిలో ఓడి ఇంటిబాట పట్టారు.

ముంబై దూకుడు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో ముంబై మీటియర్స్ జోరు కొనసాగుతోంది. బుధవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఢిల్లీ తుఫాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై 3-0 (15-12, 15-10, 15-11)తో నెగ్గింది. ముంబై కెప్టెన్ అమిత్ గులియా, శుభం దూకుడైన ఆట తీరు ఢిల్లీ జట్టును విజయానికి దూరం చేశాయి.

టాపార్డర్ మెరవాలి..



మంధాన వైఫల్యంపై ఆందోళన
నేడు దక్షిణాఫ్రికాతో భారత్ ఢీ
మ్యాచ్‌కి వానగండం

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): వన్డే వరల్డ్‌కప్‌లో వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచిన భారత మహిళల జట్టుకు ఇక అసలుసిసలు సవాళ్లు ఎదురు కానున్నాయి. గురువారం బలమైన దక్షిణాఫ్రికాతో భారత్ తలపడనుంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో శ్రీలంక, పాకిస్థాన్‌పై హర్మన్ సేన నెగ్గినా.. బ్యాటింగ్‌లో తడబాటు కనిపించింది. మెరుగ్గా ఆరంభించినా ఒక్కసారిగా కుప్పకూలుతున్నారు. ముఖ్యంగా టాపార్డర్ వైఫల్యం కలవరపెడుతోంది. మెగా టోర్నీకి ముందు పరుగుల వరద పారించిన ఓపెనర్ స్మృతి మంధాన రెండు మ్యాచ్‌ల్లో 8, 23 పరుగులే చేయడం ఆందోళన కలిగిస్తోంది. స్పిన్‌ను ఎదుర్కోవడంలో ప్రతీకా రావల్ బలహీనత ను పసిగట్టిన ప్రత్యర్థులు.. పవర్‌ప్లేలో ఆమెను కట్టడి చేసేందుకు స్పిన్నర్లను బరిలోకి దించుతున్నారు. వన్‌డౌన్‌లో హర్లీన్ డియోల్ స్ట్రయిక్ రేట్ కూడా ఘోరంగా ఉంది. క్రీజులో కుదురుకోవడానికి ఎక్కువ బంతులు తింటున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బ్యాటింగ్‌కు వెన్నెముక అయిన కెప్టెన్ హర్మన్ కూడా భారీ స్కోర్లు చేయలేకపోతుండడంతో ఆ భారం లోయరార్డర్‌పై పడుతోంది. గత మ్యాచ్‌ల్లో దీప్తి, రిచా, అమన్‌జోత్, రాణా ఆదుకోవడంతో పరువు దక్కింది. కాగా, పాక్‌తో మ్యాచ్‌లో అనారోగ్యంతో పేస్ ఆల్‌రౌండర్ అమన్‌జోత్ దూరం కావడంతో తుది జట్టులో చోటు దక్కించుకొన్న ఫాస్ట్ బౌలర్ రేణుక మెరుగైన గణాంకాలనే నమోదు చేసింది. అయితే, అమన్‌జోత్ ఫిట్‌నెస్‌పై ఇంతవరకు ఎటువంటి సమాచారం లేదు. దీప్తి, శ్రీచరణి, స్నేహ్ రాణాలతో స్పిన్ విభాగం బలంగా కనిపిస్తోంది. మరోవైపు న్యూజిలాండ్‌పై ఆరు వికెట్లతో నెగ్గిన సౌతాఫ్రికా ఫుల్‌జోష్‌లో ఉంది. తజ్మిమ్ బ్రిట్స్, సునె లుస్ చక్కని ఫామ్‌లో ఉన్నారు. కెప్టెన్ లారా వొల్వార్డ్, మరిజానె ఖాప్, బోష్ కూడా చెలరేగితే ప్రత్యర్థికి కష్టాలు తప్పవు. అయోబొంగా కకా, కాప్, ట్రయన్ లాంటి అనుభవజ్ఞులైన బౌలర్ల నుంచి భారత బ్యాటర్లకు కఠిన పరీక్ష ఎదురుకానుంది.

పిచ్

బ్యాటింగ్‌కు అనుకూలం కావడంతో భారీ స్కోర్లు నమోదు కావచ్చు. కాగా, ఒక మోస్తరు నుంచి భారీవర్షం కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో 50 ఓవర్ల పూర్తి మ్యాచ్ జరగడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



జట్లు (అంచనా)

భారత్: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన, ప్రతీక, హర్లీన్, జెమీమా, రిచా (వికెట్ కీపర్), దీప్తి, అమన్‌జోత్/రేణుక, శ్రీచరణి, క్రాంతి గౌడ, స్నేహ్ రాణా.

దక్షిణాఫ్రికా: లారా వొల్వార్డ్ (కెప్టెన్), బ్రిట్స్, లుస్, మరిజానె కాప్, బోష్, సినాలో జెఫ్టా (వికెట్ కీపర్), చోల్ ట్రయన్, నడిన్ డి క్లార్క్, మసబాటా క్లాస్, కకా, మ్లబా.

క్వార్టర్స్‌కు యువ భారత్

ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్

గువాహటి: ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. బుధవారం జరిగిన పోరులో భారత్ 45-37, 45-34తో యూఏఈపై గెలిచింది. దీంతో గ్రూప్-హెచ్‌లో వరుసగా మూడో విజయం సాధించిన భారత్.. గ్రూప్ టాపర్‌గా నిలిచి క్వార్టర్స్ చేరింది.

చెలరేగిన భరత్.. టైటాన్స్ గెలుపు

చెన్నై: ప్రొ. కబడ్డీ లీగ్ (పీకేఎల్) చెన్నై అంచెను తెలుగు టైటాన్స్ విజయంతో ముగించింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో 46-29 హరియాణాను చిత్తు చేసింది. 100వ పీకేఎల్ మ్యాచ్ ఆడిన భరత్ హుడా 20 పాయింట్లతో ప్రత్యర్థిని బెంబేలెత్తించాడు. విజయ్ 8 పాయింట్లు సాధించాడు. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 37-27తో యూ ముంబాపై నెగ్గిందింది

రెండు బృందాలుగా ఆసీస్‌కు..

15న టీమిండియా పయనం

న్యూఢిల్లీ: కంగారూలతో సిరీస్ కోసం భారత వన్డే జట్టు ఈనెల 15న ఆస్ట్రేలియా పయనం కానుంది. అయితే, ఆటగాళ్లంతా ఒకేసారి కాకుండా అదేరోజు రెండు బృందాలుగా వెళ్లనున్నట్టు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఆ రోజు బిజినెస్ క్లాస్ టిక్కెట్లు, విమానాల అందుబాటును బట్టి క్రికెటర్ల ప్రయాణం ఉంటుందని వెల్లడించాయి. కొందరు ఆటగాళ్లు ఉదయం, మరికొందరు అదేరోజు సాయంత్రం ఢిల్లీ నుంచి తొలి వన్డే వేదిక పెర్త్‌కు బయలుదేరనున్నారు. ఆసీస్ టూర్‌లో భాగంగా ముందుగా ఈనెల 19 నుంచి మూడు వన్డేల సిరీస్, అనంతరం ఐదు టీ20ల సిరీస్‌లో భారత జట్టు తలపడనుంది. వన్డే జట్టుకు ఎంపికైన సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, వైస్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్.. విండీస్‌తో టెస్టు ఆడుతున్న భారత జట్టులోని కొందరు ఆటగాళ్లతో కలిసి పెర్త్ వెళ్లనున్నట్టు సమాచారం. వన్డే సిరీస్‌కు ఎంపికైన టెస్టు జట్టులోని భారత ఆటగాళ్లు విండీస్‌తో రెండో టెస్టు ముగిసిన వెంటనే తమ ఇళ్లకు బయలుదేరతారు. ఈనెల 15న తిరిగి ఢిల్లీకి వచ్చి ఆసీస్‌కు పయనమవుతారు. ఇక, ఆస్ట్రేలియా టూర్‌కు వెళ్లే ముందు టీమిండియా కోచ్ గంభీర్.. ఢిల్లీలోని తన నివాసంలో ఆటగాళ్లందరికీ డిన్నర్ ఇవ్వనున్నాడు.

పాక్ చిత్తు

● మూనీ సెంచరీ
● 107 పరుగులతో ఆసీస్ గెలుపు


బెత్ మూనీ (109)

కొలంబో: క్లిష్ట పరిస్థితుల్లో బెత్ మూనీ (109) శతకంతో పోరాడడంతో.. మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియా రెండో విజయాన్ని నమోదు చేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ 107 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. తొలుత ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 221/9 స్కోరు చేసింది. అలెన్ కింగ్ (51 నాటౌట్) హాఫ్ సెంచరీ సాధించింది. నష్రా సంధు మూడు వికెట్లు కూల్చగా.. ఫాతిమా సనా, రమీన్ షమీమ్ చెరో రెండు వికెట్లు సొంతం చేసుకొన్నారు. ఛేదనలో పాక్ 36.3 ఓవర్లలో 114 పరుగులకే కుప్పకూలింది. సిద్రా అమీన్ (35) టాప్ స్కోరర్. కిమ్ గార్త్ మూడు.. మేగన్ షట్, సదర్లాండ్ చెరో రెండు వికెట్లు దక్కించుకొన్నారు. టాస్ ఓడి బ్యాటింగ్ దిగిన ఆసీస్.. పాక్ స్పిన్నర్ల ధాటికి ఒక దశలో 76/7తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో కింగ్ సహకారంతో మూనీ జట్టును ఆదుకొంది. శతకం పూర్తి చేసుకొన్న మూనీ ఇన్నింగ్స్ ఆఖరి బంతికి అవుటైంది.

రెండోరోజే ముగించారు

● ఏడు వికెట్లతో భారత్ గెలుపు
● అండర్-19 యూత్ టెస్ట్
● 0-2తో ఆసీస్ పరాజయం

మెకే (ఆస్ట్రేలియా): ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో రెండు టెస్ట్‌ల అనధికార సిరీస్‌ను యువ భారత్ 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. రెండో, ఆఖరి టెస్ట్‌లో భారత అండర్-19 జట్టు 7 వికెట్లతో ఆసీస్‌ను చిత్తు చేసింది. నాలుగురోజుల ఈ టెస్టుకు రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 144/7తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 171 పరుగులకు ఆలౌటై 36 పరుగుల ఆధిక్యాన్ని అందుకుంది. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 135 రన్స్ చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ 116 పరుగులకే కుప్పకూలింది. హెనిల్ పటేల్, నమన్ చెరో 3 వికెట్లు తీశారు. ఆ తర్వాత 81 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదన బరిలోకి దిగిన భారత్ 84/3 స్కోరు చేసి విజయం సాధించింది.

58 కోట్లిస్తాం.. వచ్చేయండి!

కమిన్స్, హెడ్‌కు ఐపీఎల్ ఫ్రాంచైజీ ప్రతిపాదన?

తిరస్కరించిన ఆసీస్ స్టార్లు

ముంబై: ఫ్రాంచైజీ క్రికెట్ ఆడాలంటూ ఆస్ట్రేలియా స్టార్ ఆటగాళ్లు పాట్ కమిన్స్, ట్రావిస్ హెడ్‌కు ఓ ఐపీఎల్ ఫ్రాంచైజీ భారీ ప్యాకేజీ ఆఫర్ ఇచ్చింది. ఏడాదికి ఒక్కొక్కరికీ రూ. 58 కోట్ల మొత్తం ఇచ్చేందుకు ప్రతిపాదించింది. ఇందుకు ఓ షరతు విధించింది. ప్రపంచ వ్యాప్తంగా తమ ఫ్రాంచైజీకి సంబంధించిన ఇతర టీ20 లీగ్‌లలో ఆడాలని కోరింది. అయితే ఇందుకు కమిన్స్, హెడ్ ఆస్ట్రేలియా క్రికెట్‌ను వీడాల్సి ఉంటుంది. కానీ ఆ ఆఫర్‌ను ఆసీస్ ఆటగాళ్లు తిరస్కరించినట్టు తెలిసింది. తాము ఆస్ట్రేలియా తరఫునే అంతర్జాతీయ క్రికెట్ ఆడతామని కమిన్స్, హెడ్ స్పష్టంజేశారట. ఈ మేరకు ఓ ఆస్ట్రేలియా పత్రిక సంచలన కథనంలో వెల్లడించింది. అయితే, ఆ ఫ్రాంచైజీ పేరును మాత్రం పేర్కొనలేదు. ప్రస్తుతం ఐపీఎల్ జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు కమిన్స్, హెడ్ ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే.

'పిన్నెల్లి' ముందస్తు బెయిల్ పిటిషన్ వాయిదా

- అఫిడవిట్ దాఖలుకు సమయం కోరిన ప్రభుత్వం
- తదుపరి విచారణ నవంబరు 3కు వాయిదా వేసిన సుప్రీం

న్యూఢిల్లీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం నాయకుల హత్య కేసులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట రామిరెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ మరోసారి వాయిదా పడింది. అఫిడవిట్ దాఖలు చేసేందుకు మరికొంత సమయం ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేయడంతో విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన టీడీపీ నాయకులు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావు దారుణ హత్యకు గురయ్యారు. ఈ హత్యలో పిన్నెల్లి సోదరుల ప్రమేయం ఉందని పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఇద్దరూ హైకోర్టును ఆశ్రయించగా నిరాశే ఎదురైంది. హైకోర్టు తీర్పును ఆగస్టు 31న సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్ బుధవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. అయితే, ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రా హాజరై.. అఫిడవిట్ దాఖలు చేయడానికి మరికొంత సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. రెండువారాల సమయం కావాలని కోరగా, పిన్నెల్లి తరఫు న్యాయవాదులు వారం రోజుల సమయం ఇవ్వాలని కోరారు. అయితే, ధర్మాసనం దీపావళి పండుగ తర్వాత చూద్దామని చెబుతూ.. తదుపరి విచారణను ధర్మాసనం నవంబరు 3కు వాయిదా వేసింది.

ఉద్దేశపూర్వకంగానే దుష్ప్రచారం

- ఏపీహెచ్ఈఆర్ఎంసీ సిఫారసులను వ్యతిరేకిస్తున్నాం
- మోహన్‌బాబు విశ్వవిద్యాలయం ప్రో చాన్స్‌లర్ మంచు విష్ణు

చంద్రగిరి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మోహన్‌బాబు విశ్వవిద్యాలయం ప్రతిష్ఠను దిగజార్చడానికి ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని సంస్థ ప్రో చాన్స్‌లర్ మంచు విష్ణు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సిఫార్సులపై ఆయన బుధవారం ఒక ప్రకటనలో స్పందించారు. 'ఉన్నత విద్యా మండలి సిఫార్సులను ఎంబీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అవి కేవలం సిఫార్సులు మాత్రమే. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో అవి విచారణలో ఉన్నాయి. పరిశీలించిన హైకోర్టు... సిఫార్సులకు వ్యతిరేకంగా, విశ్వవిద్యాలయానికి అనుకూలంగా స్టే ఉత్తర్వును జారీ చేసింది. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి ఏపీహెచ్ఈఆర్ఎంసీ సిఫారసులను పోర్టల్లో పెట్టడం దురదృష్టకరం. ఈ సిఫార్సులు సరికాదని ఎంబీయూ గట్టిగా విశ్వసిస్తోంది. దీనిపై విచారణ జరుపుతున్న హైకోర్టు ఎంబీయూకు న్యాయం చేకూరుస్తుందన్న విశ్వాసంతో ఉన్నాం. విద్య, సమాజ సేవలో సహాయ సహకారాలు బహిరంగ రికార్డుల్లో ఉన్నప్పటికీ, దురుద్దేశంతో కొంతమంది పదేపదే విమర్శిస్తున్నారు. కొద్దిమంది సభ్యులతో ఏర్పడిన కమిటీ, ఇబ్బందులు ఎదుర్కొంటున్న అనేక విశ్వవిద్యాలయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయంలో స్వల్ప పరిపాలన అంశాలను పెద్దవిగి పెంచి చూపి అనవసర వివాదాన్ని సృష్టించడం దురదృష్టకరం. విచారణ సమయంలో మోహన్‌బాబు విశ్వవిద్యాలయం బృందం మాకు పూర్తిగా సహకరించిందని అదే కమిషన్ తన నివేదికలో పేర్కొనడం ఎలాంటి తప్పు జరగలేదనే విషయాన్ని స్పష్టంగా తెలియజేసింది. మాకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ వస్తున్న వేలాది మంది తల్లిదండ్రులకు, విద్యార్థులకు ధన్యవాదాలు తెలుపుతున్నా' అని విష్ణు ఆ ప్రకటనలో తెలిపారు.

ప్రిన్సిపాల్ పదోన్నతులపై సీఐడీ విచారణ

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యాశాఖలో 2024 మార్చిలో జరిగిన జూనియర్ లెక్చరర్ నుంచి ప్రిన్సిపాల్ పదోన్నతులపై సీఐడీ విచారణ ప్రారంభించింది. ఇందుకోసం సీఐడీకి అవసరమైన రికార్డులు అందజేయాలని ఆదేశిస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా పదోన్నతుల్లో అనేక అక్రమాలు జరిగాయని జేఎల్స్ ఆరోపిస్తున్నారు.

ఈడీసీ మొత్తం మౌలిక వసతులకే!

కొత్త చట్టం అమలుకు పురపాలక శాఖ ఉత్తర్వులు



- వ్యవసాయ భూములను వ్యవసాయేతరంగా మార్చుకోవాలంటే మార్కెట్ ధరపై 4% రుసుం
- లేఅవుట్/బిల్డింగ్ అనుమతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- అప్పుడే ఈడీసీ చార్జీలూ చెల్లించాలి
- ఎగవేస్తే రెట్టింపు జరిమానా, శిక్ష
- బాధితులు 30 రోజుల్లో అప్పీలు చేసుకోవాలి
- కమిటీ 45 రోజుల్లో పరిష్కరించాలి
- దానిదే తుది నిర్ణయం: పురపాలక శాఖ

అమరావతి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ భూములను వ్యవసాయేతర ప్రయోజనం కోసం మార్పు చేసే నాలా చట్టాన్ని రద్దు చేసి.. కొత్తగా ఎక్స్‌టర్నల్ డెవలప్‌మెంట్ చార్జీల (ఈడీసీ) విధానాన్ని తెచ్చింది. గత నెల 3నే అమల్లోకి వచ్చిన కొత్త చట్టం అమలుపై పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ బుధవారం జీవో జారీచేసింది. దీని ప్రకారం ఏపీసీఆర్‌డీఏ(రాజధాని ప్రాంతంలో కాదు), అన్ని మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీలు, అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, ఏపీ టౌన్‌ప్లానింగ్ చట్టం(1920) కింద నోటిఫై చేసిన మాస్టర్ ప్లాన్/జనరల్ టౌన్ ప్లానింగ్ స్కీంలోని గ్రామ పంచాయతీలకు ఈ చట్టం వర్తిస్తుంది. ఇప్పటికే 2006 చట్టం ప్రకారం కన్వర్షన్ పొందిన భూములకు, 2006 జనవరి 2కు ముందు ప్లాట్లుగా నమోదైన భూములకు ఈ చట్టం వర్తించదు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర ప్రయోజనాలకు మార్చేటప్పుడు విధించే రుసుమును ఎక్స్‌టర్నల్ డెవలప్‌మెంట్ చార్జెస్ (ఈడీసీ) అంటారు. ఈ మొత్తాన్ని ప్రధాన మౌలిక వసతులు, రోడ్లు, ఫ్లైఓవర్లు, పార్కులు, నగర స్థాయి సౌకర్యాల అభివృద్ధికి వినియోగిస్తారు. మున్సిపల్ కమిషనర్లు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్లు, సీఆర్‌డీఏ కమిషనర్, వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌ను అమలు చేసే అధికారులుగా నియమించారు. అన్నీ లేఅవుట్/బిల్డింగ్ అనుమతులకూ ఏపీడీపీఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసేటప్పుడే ఆన్‌లైన్‌లో ఈడీసీ చార్జీలు చెల్లించాలి. అలాగే యాజమాన్య డాక్యుమెంట్లు, మార్కెట్ విలువ సర్టిఫికెట్లు, సర్వే స్కెచ్, భూమిమీద నీటి వనరులు, ప్రభుత్వ భూములు లేవని అఫిడవిట్లు జతచేయాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వ భూములు, స్థానిక సంస్థల కమ్యూనిటీ ప్రయోజన భూములు, మతపరమైన/దాతృత్వ ప్రయోజనాల భూములు, సంప్రదాయ గృహ పరిశ్రమలున్న భూములు(ఎకరాలోపు), ప్రభుత్వం ప్రత్యేకంగా మినహాయించిన ఇతర భూములు, ఆక్వా, డెయిరీ, పౌల్ట్రీ భూములు, ఏపీఐఐసీ, ఏపీజీఈసీఎల్‌కు కేటాయించిన భూములకు ఈ చట్టం నుంచి మినహాయింపు ఉంటుంది. వ్యవసాయ భూములను మార్పు చేసుకునే ప్రతి దరఖాస్తుదారూ వ్యవసాయ భూమి ప్రస్తుత మార్కెట్ విలువపై 4 శాతాన్ని ఈడీసీగా చెల్లించాలి. గత నెల 3 నుంచి సేకరించిన మొత్తంలో 85 శాతం స్థానిక సంస్థలకు, 15 శాతాన్ని అభివృద్ధి అథారిటీలకు బదిలీ చేయాలని చట్టంలో పేర్కొన్నారు. వసూలు చేసిన మొత్తాన్ని ప్రత్యేక ఖాతాలో ఉంచి, ఆ నిధులను రోడ్లు, డ్రెయిన్లు, పార్కులు, నీటి సరఫరా, కాలువలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ఉపయోగించాలన్నారు. తప్పుడు మార్పులు, అనధికార అభివృద్ధి జరిగిన పక్షంలో మున్సిపల్ చట్టం ప్రకారం శిక్షలు, జరిమానాలు విధిస్తారు. తప్పుడు సమాచారమిచ్చి ఈడీసీ చెల్లించకుండా తప్పించుకున్న వారిపై రెట్టింపు జరిమానా, శిక్ష విధిస్తారు. అప్పీలు చేసుకునేందుకు సీ అండ్ ఎండీఏ కమిషనర్ చైర్మన్‌గా, డీటీసీపీ డైరెక్టర్ కన్వీనర్, ఆర్‌డీవో స్థాయి అధికారి సభ్యుడిగా ఉన్న కమిటీకి బాధిత దరఖాస్తుదారులు 30 రోజుల్లోపు అప్పీలు చేసుకోవచ్చు. అప్పీళ్లను సదరు కమిటీ 45 రోజుల్లోగా పరిష్కరించాలి. కమిటీ నిర్ణయమే తుది నిర్ణయమని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ తన ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది.

బనకచర్లపై ముందుకే!

- డీపీఆర్ తయారీకి ఏపీ సంసిద్ధత
- టెండర్లు పిలిచిన జలవనరుల శాఖ

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ, కర్ణాటక వ్యతిరేకిస్తున్నా.. పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకంపై ముందుకే వెళ్లాలని ఆంధ్రప్రదేశ్ భావిస్తోంది. ప్రాజెక్టు చేపట్టడానికి సర్వసన్నద్ధంగా ఉండాలని నిర్ణయించిన రాష్ట్ర జలవనరుల శాఖ.. ఇందులో భాగంగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) తయారీకి సంకల్పించింది. గోదావరి జలాలను బనకచర్ల గుండా రాయలసీమకు తరలించేందుకు రూ.81వేల కోట్ల అంచనాతో ఈ ప్రాజెక్టు ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్)ను జలశక్తి శాఖకు, జల సంఘానికి సమర్పించడం.. దానిపై సంబంధిత రాష్ట్రాల అభిప్రాయాలను కేంద్రం కోరడం.. వరద జలాల అందుబాటుపై రాష్ట్రప్రభుత్వాన్ని జలసంఘం కొన్ని వివరణలు అడగడం.. తగు అనుమతులతో మళ్లీ తమ వద్దకు రావాలని సూచించడం తెలిసిందే. తెలంగాణ, కర్ణాటకల కొర్రీలు, ఇంత భారీ వ్యయంతో ప్రాజెక్టు చేపట్టేకన్నా.. రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తే రాయలసీమలో కీలక ప్రాజెక్టులన్నీ పూర్తవుతాయని సాగునీటి నిపుణులు, రైతు సంఘాల నాయకుల సలహాల నేపథ్యంలో కొన్నాళ్లుగా ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వం నుంచి కదలిక లేదు. ఇప్పుడు డీపీఆర్ తయారీని తెరపైకి తెచ్చింది. పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం సమగ్ర నివేదిక తయారీకి ఆసక్తి చూపే సంస్థల కోసం గుంటూరు జిల్లా జల వనరుల శాఖ ఈ నెల 5న టెండర్లు పిలిచింది. ఈ పథకానికి సంబంధించి పీఎఫ్ఆర్‌ను ఇప్పటికే కేంద్రానికి సమర్పించామని.. అందుచేత డీపీఆర్‌ను సిద్ధం చేయాలని కోరింది. ప్రత్యేకించి తొలి దశలో పోలవరం నుంచి నల్లమల సాగర్ వరకు విడిగా సమగ్ర నివేదికను కోరనుంది.

ఐదు విశ్వవిద్యాలయాలకు

వీసీల నియామకం

- ఏఎన్‌యూకు వెంకట సత్యనారాయణ రాజు

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐదు విశ్వవిద్యాలయాలకు ఉప కులపతులను నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం ఆచార్యుడు ఎస్ వెంకట సత్యనారాయణరాజును ఏఎన్‌యూ వీసీగా నియమించింది. హైదరాబాద్ ఐఐటీ ఆచార్యుడు తాతా నర్సింగరావును ఎస్వీయూ వీసీగా నియమించింది. హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజశేఖర్ బెల్లంకొండను యోగి వేమన యూనివర్సిటీ వీసీగా నియమించింది. జేఎన్‌టీయూ కాకినాడ మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ వీ వెంకట సుబ్బారావును జేఎన్‌టీయూ-గురజాడ వీసీగా నియమించింది. యోగి వేమన వర్సిటీ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ ఆచార్యుడు బి.జయరామిరెడ్డిని వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వీసీగా నియమించింది. కాగా రాష్ట్రంలో ఇంకా నాలుగు విశ్వవిద్యాలయాల ఉప కులపతుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.



తుంగభద్ర డ్యాంకు.. వచ్చే జూన్‌కల్లా కొత్త గేట్లు

- నవంబరు నుంచి అమర్చే పనులు ప్రారంభిస్తాం
- రూ.55 కోట్లు ఇచ్చేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధం
- ప్రస్తుత సర్కారు పెండింగ్ నిధులూ ఇచ్చింది
- 'ఆంధ్రజ్యోతి'తో తుంగభద్ర బోర్డు చైర్మన్ పాండే


బళ్లారి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాంకు వచ్చే ఏడాది జూన్ నాటికి మొత్తం 33 కొత్త క్రస్ట్ గేట్లనూ అమర్చుతామని తుంగభద్ర డ్యాం బోర్డు చైర్మన్ ఎస్‌కే పాండే తెలిపారు. బుధవారం బళ్లారిలోని ఎల్లెల్సీ కార్యాలయంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఈ జలాశయం విషయంలో ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని.. కొత్త క్రస్ట్ గేట్ల ఏర్పాటుకు అవసరమైన నిధుల్లో ఏపీ ప్రభుత్వం రూ.55 కోట్లు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని వెల్లడించారు. మిగిలిన నిధులను రెండో విడతలో విడుదల చేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత కూటమి ప్రభుత్వం టీబీ డ్యాం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న నిధులను కూడా మంజూరు చేసిందని చెప్పారు. డ్యాంలో ప్రస్తుతం 80 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు. ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురిశాయని, రైతులకు సాగునీటికి ఇబ్బంది కలుగలేదని అన్నారు. క్రస్ట్ గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు, కేంద్ర జలసంఘం సూచనల ప్రకారం డ్యాంకు ఉన్న 33 గేట్లనూ మార్చి, కొత్త వాటి ఏర్పాటుకు చర్యలు చేపట్టామని తెలిపారు. 'కొత్త గేట్ల తయారీ టెండరు దక్కించుకున్న గుజరాత్ కంపెనీ.. ఇక్కడే రెండు ప్రాంతాల్లో వాటిని తయారుచేస్తోంది. తయారీ పూర్తి కావచ్చింది. నవంబరు నుంచి క్రస్ట్ గేట్లను అమర్చే పనులు ప్రారంభిస్తాం' అని చెప్పారు. కొత్త గేట్ల తయారీలో నాణ్యత, ఇతర అంశాలను పరిశీలించేందుకు కేంద్రం నిపుణుల కమిటీని నియమించిందని చెప్పారు. అంతకుముందు పాండే తుంగభద్ర దిగువ కాలువను 200 కి.మీ. నుంచి 250 కి.మీ. వరకూ పరిశీలించారు. ఆయన వెంట బోర్డు ఎస్ఈ నారాయణ నాయక్, బోర్డు కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డి, ఎస్‌డీవోలు హసేన్ బాషా, విశ్వనాథ్, సురేశ్, ప్రవీణ్, ఈఈ నాగరాజ్‌రావు తదితరులు ఉన్నారు.

విద్యుత్ జేఏసీ చర్చలు విఫలం

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీతో విద్యుత్ సంస్థల యాజమాన్యం బుధవారం చర్చలు నిర్వహించింది. ట్రాన్స్‌కో ఎస్ఎల్‌డీ భవనంలో జరిగిన ఈ చర్చల్లో విద్యుత్ ఉద్యోగుల స్టీరింగ్ కమిటీ చైర్మన్ నాగలక్ష్మి, సభ్యులు పృథ్వీతేజ్, సంతోషరావు తదితర డైరెక్టర్లు పాల్గొన్నారు. 29 ప్రధాన డిమాండ్లపై చర్చించారు. చర్చల అనంతరం జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. చర్చలు ఫలించలేదని, సమ్మె తప్ప మరో మార్గం లేదని చెప్పారు. చర్చల్లో జేఏసీ చైర్మన్ ఎస్.కృష్ణయ్య, కన్వీనర్ రాఘవరెడ్డి, కో-చైర్మన్ శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



పువ్వుల వల వేశావే.. చిట్టి చిలకా

రవితేజ కథానాయకుడిగా భాను బోగవరపు దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'మాస్ జాతర'. శ్రీలీల హీరోయిన్. సితార ఎంటర్టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ నెల 31న చిత్రం విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, ప్రచార చిత్రాలు, పాటలు ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి 'హుడియో హుడియో' అనే హుషారైన మెలోడీని విడుదల చేశారు మేకర్స్. 'నా గుండె గాలి పటమల్లే ఎగిరేశామే.. నే వెళ్లేదారుల్లో పువ్వుల వల వేశావే.. అరే నీలో ఏదో ఉందే.. చిట్టి చిలకా' అంటూ సాగే ఈ గీతం ఆకట్టుకుంటోంది. దేవ్ పాటను రచించగా, హేషమ్ అబ్దుల్‌వహాబ్ ఆలపించారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: నవీన్ నూలి, డీఓపీ: విధు అయ్యన్న.

పెద్దితో ప్రేమగీతం





రామ్ చరణ్ కథానాయకుడిగా క్రీడా నేపథ్యంలో తెరకెక్కుతోన్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'పెద్ది'. జాన్వీకపూర్ కథానాయిక. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. నేటి నుంచి పుణేలో ఈ చిత్రం కొత్త షెడ్యూల్ మొదలవనుంది. రామ్‌చరణ్, జాన్వీకపూర్‌పై ఓ డ్యూయెట్‌ను తెరకెక్కించనున్నారు. ఈ పాటకు ఏ. ఆర్ రెహమాన్ స్వరాలందించగా, జానీ మాస్టర్ నృత్యరీతులు సమకూర్చుతున్నారు. చిత్రీకరణతో పాటు నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా కొనసాగుతున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ చిత్రంలో గ్రామీణ యువకుడిగా మాస్ లుక్‌లో రామ్‌చరణ్ కనిపించనున్నారు. శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ కీలకపాత్రలు పోషిస్తున్నారు. రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా వచ్చే ఏడాది మార్చి 27న 'పెద్ది' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఆర్ రత్నవేలు, ఎడిటర్: నవీన్ నూలీ

నిర్మాతలకు పేరు తెచ్చే చిత్రం



సత్యదేవ్

పల్లెటూరి నేపథ్యంలో వస్తున్న పూర్తి వినోదాత్మక చిత్రం 'శ్రీ చిదంబరం'. వినయ్ రత్నం దర్శకుడు. చింతా వరలక్ష్మి సమర్పణలో వినీషా రెడ్డి, గోపాల కృష్ణారెడ్డి నిర్మిస్తున్నారు. చింతా రాజశేఖర్ రెడ్డి సహ నిర్మాత. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ఠ, గోపీనాథ్ ప్రధాన తారాగణం. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నటుడు సత్యదేవ్ చేతుల మీదుగా యూనిట్ టీజర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా సత్యదేవ్ మాట్లాడుతూ 'క సినిమాతో చింతా గోపాల కృష్ణారెడ్డి నిర్మాతగా ఘన విజయాన్ని అందుకున్నారు. మంచి కథను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో ఈ సినిమాను చేస్తున్నామని వారు నాతో చెప్పారు. వినయ్ రత్నం తెరపై అద్భుతంగా ఆవిష్కరించారు. 'శ్రీ చిదంబరం' నిర్మాతలకు గొప్ప పేరు తెస్తుంది' అని అన్నారు. గోపాల కృష్ణారెడ్డి మాట్లాడుతూ 'పూర్తిగా నూతన నటీనటులతో ఈ సినిమాను నిర్మిస్తున్నాం. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో వినయ్ రత్నం ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. కథలో కొత్త కోణం, కథనంలో వేగం ఆయన ప్రత్యేకత' అన్నారు. వినయ్ రత్నం మాట్లాడుతూ 'నూతన నటీనటులతో సరికొత్త తరహాలో కామెడీ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. వినోదభరితంగా నడిపిస్తూనే భావోద్వేగభరితంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశాం. ఈ చిత్రంలో ప్రతి పాత్రకూ ప్రత్యేకత ఉంటుంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో దర్శకులు సందీప్, సుజిత్, వశిష్ఠ తదితరులు పాల్గొన్నారు.

చిత్రీకరణ షురూ




వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ తెరకెక్కించనున్న చిత్రం రెగ్యులర్ షూటింగ్ బుధవారం ప్రారంభమైంది. వెంకీ 77 అనేది వర్కింగ్ టైటిల్. ఈ సందర్భంగా షూటింగ్‌లో వెంకటేశ్, త్రివిక్రమ్ కలసి దిగిన ఫొటోను నిర్మాత నాగవంశీ అభిమానులతో పంచుకున్నారు. '20 నెలల సుదీర్ఘ విరామం తర్వాత మాటల మాంత్రికుడు మళ్లీ మెగాఫోన్ పట్టారు. అందరికీ అభిమాన కథానాయకుడైన వెంకటేశ్‌తో చేతులు కలిపారు. ఓజీస్ ఎంటర్టైన్‌మెంట్స్ మళ్లీ పునరావృతం అవుతుంది' అని పేర్కొన్నారు. ఈ చిత్రాన్ని ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఇందులో ఇద్దరు కథానాయికలు నటించే అవకాశం ఉందని, త్రిష, రుక్మిణీ వసంత్, నిధి అగర్వాల్ పేర్లు పరిశీలనలో ఉన్నాయని సమాచారం.

వినోదం పంచే డ్యూడ్



తమిళంతో పాటు తెలుగులోనూ హీరోగా సత్తా చాటుతూ వరుస విజయాలను అందుకుంటున్నారు ప్రదీప్ రంగనాథన్. ఆయన కథానాయకుడిగా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోన్న చిత్రం 'డ్యూడ్'. కీర్తీశ్వరన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మమితా బైజు కథానాయిక. శరత్ కుమార్ కీలకపాత్ర పోషించారు. దీపావళి సందర్భంగా ఈనెల 17న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం చిత్రబృందం తిరుపతిలో ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ 'డ్యూడ్ చిత్రం ప్రేమ, కుటుంబ విలువలతో హృద్యంగా ఉంటుంది. మనవైన జీవితాల్ని, పరిస్థితుల్ని ఆవిష్కరిస్తూ దర్శకుడు తెరకెక్కించారు. ప్రథమార్థం వినోదాత్మకంగా, ఉల్లాసంగా నడుస్తుంది. ద్వితీయార్థంలో పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. సినిమా అద్భుతంగా వచ్చింది. దయచేసి పైరసీని ప్రోత్సహించకుండా థియేటర్లలో మా సినిమాను చూడండి' అని ప్రేక్షకులను కోరాడు.

మమ్ముట్టి, దుల్కర్ సల్మాన్ ఇళ్లలో ఈడీ సోదాలు





స్థానిక రాజా అన్నామలైపురం ప్రాంతంలోని ప్రముఖ సినీ నటుడు మమ్ముట్టి, ఆయన కుమారుడు దుల్కర్ సల్మాన్ ఇళ్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం(ఈడీ) అధికారులు బుధవారం ఉదయం సోదాలు చేశారు. భూటాన్ సైనిక దళం నిర్వహించిన వేలం పాటల ద్వారా లాండ్ క్రూసా, లాండ్ రోవర్ లగ్జరీ కార్లను కొనుగోలు చేసి, వాటిని భారతదేశంలోకి అక్రమంగా దిగుమతి చేసుకున్నట్లు వారిపై ఆరోపణల రావడంతో ఈడీ అధికారులు ఈ సోదాలు చేపట్టారు. సీఐఎస్ఎఫ్ బలగాల భద్రత నడుమ వారి ఇళ్లలో తనిఖీలు చేశారు. ఈ వ్యవహారంలో దుల్కర్ సల్మాన్ వద్ద భూటాన్ నుండి దిగుమతి చేసుకున్న రెండు లగ్జరీ కార్లను ఈడీ ఇదివరకే స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

అరిషడ్వర్గాలను జయించే అరి



జయశంకర్

'అరిషడ్వర్గాలు అనే ఆధ్యాత్మిక అంశాన్ని సాధారణ ప్రేక్షకులకు కూడా సులువుగా అర్థం అయ్యేలా వివరించడానికి 'అరి' సినిమాను రూపొందించాను. ఇలాంటి కథల్ని పూర్తిగా సందేశాత్మకంగా కాకుండా, ఎంటర్‌టైనింగ్‌గా చెప్పాలి. ఆ ప్రయత్నంలో దర్శకుడిగా నేను సఫలమయ్యాననే అనుకుంటున్నాను' అని దర్శకుడు జయశంకర్ అన్నారు. వినోద్ వర్మ, అనసూయ భరద్వాజ్, సాయికుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రమిది. ఈ నెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా జయశంకర్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

'నాకు చిన్నప్పటి నుంచి పురాణాలు, ఇతిహాసాలు అంటే ఆసక్తి. వాటి గురించి తెలుసుకొని, అవగాహన పెంచుకున్నాను. మన పురాణాల్లో అరిషడ్వర్గాలను జయించాలని చెప్పారే తప్ప వాటిని ఎలా జయించాలో సవివరంగా చెప్పలేదు. ఈ పాయింట్‌తో ఓ సినిమా చేయాలనిపించింది. హిమాలయాలకు వెళ్లి యోగులను కలిశాను. నా ఆలోచన వారికి చెప్పాను. మంచి ప్రయత్నం అని అభినందించి వారు అనేక విషయాలు చెప్పారు. అరిషడ్వర్గాలను జయించేందుకు వారి ద్వారా మార్గాలు, సూచనలు తెలుసుకున్నాను. వాటి ఆధారంగానే 'అరి' చిత్రాన్ని రూపొందించాను. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు గారు, రచయిత యండమూరి వీరేంద్రనాథ్, నిర్మాత అశ్వనీదత్ తదితరులు 'అరి' సినిమాను చూసి 'ఆధునిక భగవద్గీతలా ఉంది. పురాణాలు, ఇతిహాసాలు చదవని యువతకు ఈ సినిమాను చూస్తే వాటిలోని సారం తెలుస్తుంది' అని ప్రశంసించారు.

శ్రీకాంత్‌భరత్‌పై ఫిర్యాదు



మహాత్మాగాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు శ్రీకాంత్‌భరత్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వైశ్య వికాస వేదిక చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్త బుధవారం సాయంత్రం ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్యకు ఫిర్యాదు చేశారు. ఇలాంటి అవహేళన వ్యాఖ్యలను చేసిన శ్రీకాంత్ భరత్‌పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కొత్తపేట (ఆంధ్రజ్యోతి)

చారిత్రక నేపథ్యంతో గత వైభవ



ఎస్ ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ జంటగా నటిస్తున్న చిత్రం 'గత వైభవ'. చారిత్రక నేపథ్యంలో కాల్పనిక గాథగా తెరకెక్కుతోన్న చిత్రమిది. సింపుల్ సుని దర్శకత్వం వహిస్తూ దీపక్ తిమ్మప్పతో కలసి నిర్మిస్తున్నారు. నవంబర్ 14న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం చిత్రబృందం ఆడియో విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా దుష్యంత్ మాట్లాడుతూ 'దర్శకుడు సుని గారు కన్నడలో పలు విజయవంతమైన చిత్రాలను అందించారు. సనాతన ధర్మంలోని కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథ ఇది. తెలుగు, కన్నడ భాషల్లో తెరకెక్కించారు. ఇది చాలా పెద్ద ప్రాజెక్ట్. నిర్మాతలు భారీస్థాయిలో నిర్మించారు. తెలుగు ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. ఆషికా రంగనాథ్ మాట్లాడుతూ 'ఇది నా తొలి కన్నడ చిత్రం. తెలుగులోనూ విడుదలవుతున్నందుకు ఆనందంగా ఉంది. ఇందులో నా పాత్ర కొత్త తరహాలో ఉంటుంది. సునీ గారి మేకింగ్ తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుంది' అని అన్నారు. 'ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలించే సున్నితమైన ప్రేమకథా చిత్రమిది. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది' అని దర్శకుడు చెప్పారు. ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుందని నిర్మాత అన్నారు.



బుధవారం విజయవాడలో కురిసిన భారీ వర్షంతో జలమయమైన నిర్మలా హైస్కూల్ రోడ్

నేడు ఉత్తర కోస్తా, సీమలో భారీ వర్షాలు

» 11న బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్నం/అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ, రాయలసీమ, తమిళనాడు మీదుగా కొమరిన్ వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. ఇంకా సముద్రం నుంచి తేమగాలులు భూ ఉపరితలంపైకి వీస్తుండటంతో రాష్ట్రంలో అనేకచోట్ల బుధవారం ఈదురు గాలులతో వర్షాలు కురిశాయి. తిరుపతి జిల్లా డక్కిలిలో 8.4, అనకాపల్లి జిల్లా ఈ.మర్రిపాలెంలో 8, నెల్లూరు జిల్లా దగదర్తిలో 7.6, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 6.2, అల్లూరి జిల్లా అరకులో 6.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. మరో వారం రోజుల్లో నైరుతి రుతుపవనాలు నిష్క్రమించి ఈశాన్య రుతుపవనాలు ప్రవేశిస్తాయని, ఈ మధ్యకాలంలో వాతావరణ మార్పుల ప్రభావంతో తీవ్రమైన అనిశ్చితి నెలకొని ఉరుములు, పిడుగులు సంభవిస్తున్నాయని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు. ఈనెల పదో తేదీన ఉత్తర బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం, దాని ప్రభావంతో 11న అల్పపీడనం ఏర్పడనున్నట్టు పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్, ఒడిశాల్లో వర్షాలు కురుస్తాయని, ఉత్తరకోస్తాలోనూ కురిసే అవకాశం ఉందని తెలిపారు. కాగా, రానున్న రెండు రోజులు ఉత్తరాంధ్ర, రాయలసీమలో పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గురువారం అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

రాష్ట్ర, జిల్లా ప్రధాన రోడ్లకు వెయ్యి కోట్లు

» రహదారులపై ప్రభుత్వ హామీ అమల్లోకి..

» పనుల కోసం పరిపాలనా అనుమతులు

అమరావతి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రహదారుల విషయంలో ఇచ్చిన హామీలు ఒక్కటొక్కటిగా అమల్లోకి వస్తున్నాయి. రాష్ట్ర ప్రధాన రహదారులు (స్టేట్‌హైవేలు), జిల్లా ప్రధాన రహదారుల (ఎండీఆర్) నిర్మాణం కోసం రూ.1000 కోట్లు విడుదలకు పరిపాలనా అనుమతి ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2104.09 కిలోమీటర్లను వెయ్యి కోట్లతో నిర్మించేందుకు ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ చీఫ్ ఇచ్చిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిది. ఇందులో స్టేట్‌హైవేలు 771.95 కిలోమీటర్లు, 108 వర్క్‌లు, ఎండీఆర్ 1332.14 కిలోమీటర్లు, 166 వర్క్‌లకు నిధులు మంజూరు చేస్తూ ఆర్అండ్‌బీ ముఖ్యకార్యదర్శి ఎంటీ కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో స్టేట్ హైవే వర్క్‌లకు రూ.400 కోట్లు, ఎండీఆర్ ప్లాన్‌కు రూ.600 కోట్లు కేటాయించారు. గతంలో ఎమ్మెల్యేలు,ఎంపీలు, జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన ప్రతిపాదనలను క్రోడీకరించి వర్క్‌లను ఎంపిక చేసి వాటికి పరిపాలనా అనుమతి ఇచ్చారు. ఇందులో నూతన రహదారుల నిర్మాణంతోపాటు అత్యధికంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు, విస్తరణ, అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. ఈ పనులకు ప్రభుత్వం పరిపాలనా ఆమోదం తెలిపిన నేపథ్యంలో జిల్లాలవారీగా టెండర్లు నిర్వహించేందుకు అవకాశం ఏర్పడింది.

అటవీశాఖ అడిగితేనే చేస్తున్నాం!

» బర్డ్ ఫ్లైట్ డైవర్టర్ల ఏర్పాటుపై విద్యుత్ శాఖ వివరణ

» 2022 మార్చి తర్వాత బట్టమేక పక్షి జాడలేదన్న అటవీశాఖ

» అయినా దాన్ని రక్షించాలని కోరడం వెనుక మతలబు ఏమిటో?

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా రోళ్లపాడు వైల్డ్ లైఫ్ శాంక్చురీలో గ్రేట్ ఇండియన్ బస్టర్డ్(బట్టమేక పక్షి)ని రక్షించాలని అటవీశాఖ అధికారులు కోరినందునే తాము బర్డ్ ఫ్లైట్ డైవర్టర్లను ఏర్పాటు చేసేందుకు టెండర్లు పిలిచామని విద్యుత్ శాఖ అధికారులు వివరణ ఇచ్చారు. 'జాడలేని పక్షి రక్షణ పేరిట రూ.7 కోట్లు భక్షణ' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. సుప్రీంకోర్టు సూచనలు.. వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(డబ్ల్యూఐఐ) సర్వేల ఆధారంగా ఆత్మకూరులోని ప్రాజెక్టు టైగర్ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ తమను బర్డ్ ఫ్లైట్ డైవర్టర్లను ఏర్పాటు చేయాలని కోరారని, ఆ మేరకు తాము టెండర్లు పిలిచామని విద్యుత్ శాఖ పేర్కొంది. అయితే డబ్ల్యూఐఐ సర్వేలు నిర్వహించి బట్టమేక పక్షి అంతరించిపోయే దశలో ఉందని, అవి అంతరించిపోవడానికి హైటెన్షన్ తీగలు కారణమని పేర్కొనడం వరకు వాస్తవం. సుప్రీంకోర్టు బట్టమేక పక్షిని రక్షించాలంటూ పేర్కొనడం వాస్తవం. కానీ, అసలు రోళ్లపాడు వైల్డ్ లైఫ్ శాంక్చురీలో బట్టమేక పక్షి జాడ లేదని డబ్ల్యూఐఐ తన నివేదికలో పేర్కొన్న విషయాన్ని అటు అటవీశాఖ, ఇటు విద్యుత్ శాఖ అధికారులు ఎందుకు విస్మరించారన్న ప్రశ్నకు సమాధానం లేదు. సాక్షాత్తు అటవీశాఖ అధికారుల నివేదికల్లోనే 2022 మార్చి తర్వాత రోళ్లపాడు వైల్డ్‌లైఫ్ శాంక్చురీలో బట్టమేక పక్షి జాడ లేదని పేర్కొన్న అంశాన్ని మరుగుపర్చి, ఆ పక్షులను రక్షించాలంటూ విద్యుత్‌శాఖ అధికారులకు లేఖ రాయడం వెనుక ఉద్దేశం ఏమిటనేది అంతుచిక్కడం లేదు. బట్టమేక పక్షి రక్షణ ముసుగులో కోట్లాది రూపాయలు దండుకోవడమే పరమావధిగా అధికారులు డైవర్టర్లను తెరపైకి తెచ్చారన్నది వాస్తవం. పైగా రోళ్లపాడు శాంక్చురీ 6 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంటే అసలు జాడే లేని పక్షిని రక్షించేందుకు 30 కిలోమీటర్ల వ్యాసార్థం మేరకు ఉన్న హైటెన్షన్ తీగలకు డైవర్టర్లను బిగించడం ఏమిటి? 30 కిలోమీటర్ల వ్యాసార్థం అంటే సుమారు 2828.52 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న హైటెన్షన్ తీగలకు డైవర్టర్లను బిగిస్తారన్న మాట. అసలు బట్టమేక పక్షి ఉందో లేదో నిర్ధారణ చేయకుండా దాని రక్షణ పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గుంటూరులో రూ.కోటి నకిలీ సిగరెట్లు స్వాధీనం

» ప్రముఖ బ్రాండ్ల పేరుతో తయారీ

గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ బ్రాండ్ల పేరుతో నకిలీ సిగరెట్లు తయారు చేస్తున్న వారి గుట్టును సెంట్రల్ ఎక్సైజ్ అధికారులు రట్టుచేశారు. బుధవారం రాత్రి గుంటూరులోని కాకాని రోడ్డులో ఉన్న అన్నపూర్ణ కాంప్లెక్స్ షాపు నంబరు 106లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ. కోటి విలువైన సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. దుకాణాన్ని సీజ్ చేశారు. ఇక్కడ ప్రముఖ బ్రాండ్‌ల పేరుతో సిగరెట్లను తయారు చేసి రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

పెళ్లిలోనూ రాజకీయ నినాదాలే

» జగన్ పర్యటనలో క్యాడర్ అత్యుత్సాహం

» సీఎం సీఎం అంటూ నినాదాలు...

» బారికేడ్లు ఎత్తి పడేసిన కార్యకర్తలు

భీమవరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ హాజరయిన ఓ పెళ్లి వేడుకలో కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించారు. పశ్చిమ గోదావరి జిల్లా వైసీపీ అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు కుమారుడి వివాహం బుధవారం భీమవరం సమీపంలోని పెదఅమిరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జగన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పెండ్లి వేడుక వద్ద సీఎం, సీఎం అంటూ నినాదాలు చేశారు. ఒకరినొకరు తోసుకుంటూ ఆయనను కలిసే ప్రయత్నం చేశారు. కార్యకర్తల సీఎం నినాదాలకు చిరునవ్వులు చిందిస్తూ.. జగన్ వేడుక వద్దకు వెళ్లిపోయారు. వేదిక వద్దకు ఎవరూ వెళ్లకుండా ఏర్పాటు చేసిన బారికేడ్‌లను కార్యకర్తలు ఎత్తి పక్కన పడేశారు.

16నెలలు జైలుపాలైనవారూ నన్ను భయపెట్టాలని చూశారు

» ఎన్నో కేసులు పెట్టారు.. దేనికీ భయపడను

» హైందవ ధర్మాన్ని, దేవాలయాలను కాపాడుకోవాలి

» ఇది అందరి బాధ్యత.. గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు



మాట్లాడుతున్న అశోక్ గజపతిరాజు, చిత్రంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, గొండు శంకర్

శ్రీకాకుళం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మాన్ని, హిందూ దేవాలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత హిందువలందరిపైనా ఉందని గోవా గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతిరాజు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మనాథ క్షేత్రంలో ఆయన బుధవారం జరిగిన ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వంశపారంపర్య ధర్మకర్త హోదాలో హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ 'దేవాలయాల ట్రస్టు బోర్డు సభ్యులు బాధ్యతగా ఎవరిపని వారు చేయాలి. ఆలయాల అభివృద్ధి కోసం పనిచేస్తూ హిందూ ధర్మాన్ని కాపాడుకుందాం. దేవుడికి సేవచేసే అవకాశం లభించినవారు.. దేవుని సేవలో భాగస్వాములు కావాలి' అని అన్నారు. అంతేకాకుండా, 'అవినీతి కేసులో 16 నెలలు జైలులో గడిపిన వారు కూడా నన్ను భయపెట్టాలని చూశారు. గత ప్రభుత్వ హయాంలో నాపై ఎన్నో కేసులు పెట్టారు. వాటికి ఏనాడూ భయపడలేదు. నేను దేనికీ భయపడను. దైవం అండగా ఉంటుంది. చట్టాలను అందరూ గౌరవించాలి' అని వ్యాఖ్యానించారు. అనంతరం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, విజయనగరం ఎమ్మెల్యే అతిథి గజపతితో కలసి శాలిహుండం కొండపై ఉన్న బుద్ధిస్ట్ మ్యూజియంను సందర్శించారు.

విపత్తుల్లో.. నిశ్చింతగా!

ప్రజల రక్షణే ధ్యేయంగా కదులుతున్న ప్రభుత్వం

» పక్కా ప్రణాళికతో విపత్తుల శాఖ అభివృద్ధి

» కొత్త ఫైర్ స్టేషన్లు.. ఫైరింజన్లు, పరికరాలకు నిధులు

» సిబ్బందికి అంతర్జాతీయస్థాయి శిక్షణ

» అమరావతిలో అధునాతన కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అగ్ని ప్రమాదాలు జరిగితే... వరదలు సంభవిస్తే.. ఇంకా అనుకోని ఘటనలు జరిగితే మనకు వెంటనే గుర్తొచ్చేది.. విపత్తుల నిర్వహణ శాఖ. దానిలో భాగమైన అగ్నిమాపక శాఖ. హారన్ మోగించుకుంటూ రోడ్డుపై నీళ్ల కారు వెళ్లిందంటే.. ఎక్కడో అగ్ని ప్రమాదం జరిగిందని అంతా అనుకుంటాం. ఆ ప్రమాదం గురించిన ఆలోచనలే మనలో మెదులుతూ ఉంటాయి. ఆ వాహనం... సంబంధిత శాఖ అంతలా సమాజంతో పెనవేసుకుపోయాయి. దీంతోపాటు వరదలు, ఉప్పెనలు సంభవించినప్పుడు విపత్తుల నిర్వహణ శాఖ స్పందించి రంగంలోకి దిగుతుంది. అటువంటి శాఖను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో కొత్తగా ఫైర్ స్టేషన్లు నిర్మించి, పాత వాటికి మరమ్మతులు చేయించి, కొత్తగా ఫైరింజన్లు కొనుగోలు చేసి, సిబ్బందికి అధునాతన శిక్షణ ఇచ్చి, ఆధునిక పరికరాలు సమకూర్చి విపత్తుల నిర్వహణను పటిష్టం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమయ్యింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో అవసరమైన నిధులు కూడా విడుదల చేసింది. ఈమేరకు రూ.252.87కోట్ల నిధుల విడుదలకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. మొదటి విడతలో రూ.62.92కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం.. మిగతా మూడు విడతల నిధులకు పాలనాపరమైన అనుమతులు ఇవ్వడంతో అగ్నిమాపక శాఖలో అభివృద్ధి పరుగులు తీయనుంది.

ఆధునిక ఫైర్‌స్టేషన్లు, ఫైరింజన్లు

రాష్ట్రంలో తరచూ అగ్నిప్రమాదాలు సంభవిస్తున్న ప్రాంతాల్లో అగ్నిమాపక స్టేషన్ల ఆవశ్యకతను గుర్తించిన ఆ శాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అందులో అత్యవసరమైన ప్రాంతాల్లో రూ.75.82కోట్ల ఖర్చుతో ఫైర్ స్టేషన్లు నిర్మించబోతున్నారు. ఎలాంటి ప్రమాదాన్నైనా నివారించగలిగే అధునాతన ఫైరింజన్లు కొనుగోలు చేయనున్నారు. ప్రస్తుతం అగ్నిమాపక శాఖలో ఉన్న ఫైరింజన్లలో ఎక్కువగా కాలం చెల్లినవే ఉన్నాయి. వాటి స్థానంలో అడ్వాన్స్ ఫైరింజన్లు కొనుగోలు చేస్తున్నారు. నీటితోపాటు ఎమర్జెన్సీ లైటింగ్, జనరేటర్, వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు బోట్లు ఇలా రెస్క్యూ టీమ్‌కు అవసరమైనవి అన్నీ ఇందులో ఉంటాయి. ఇటీవల విశాఖపట్నం, పరవాడ పరిశ్రమల్లో జరిగిన అగ్ని ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని హజ్మత్ (హజార్డస్ మెటీరియల్) వాహనాన్ని కూడా సమకూర్చుకొంటున్నారు. ఇందులో నీటితోపాటు ఫోమ్, పౌడర్, కార్బన్ డయాక్సైడ్ ఉంటాయి. అగ్ని ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఎలా రిస్క్యూ చేయాలనే దానిపై మన రాష్ట్రంలో కొన్నేళ్లుగా థియరిటికల్ శిక్షణ తప్ప క్షేత్రస్థాయిలో లేదు. రాష్ట్ర విభజన తర్వాత మనకు శిక్షణా కేంద్రం లేకపోవడంతో అప్పుడప్పుడు పారిశ్రామిక వాడల్లో ప్రదర్శన చేయడం మినహా సరైన శిక్షణ లేదు. ఈ సమస్యను అధిగమించేందుకు అంతర్జాతీయ స్థాయి శిక్షణా కేంద్రాన్ని నిర్మించబోతున్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు పారిశ్రామికవాడల్లో ఎలా నివారించాలి.. కమర్షియల్ కాంప్లెక్స్‌ల్లో ఎలా కట్టడి చేయాలి, అపార్ట్‌మెంట్లు, ఆస్పత్రులు, విద్యాసంస్థలు, సినిమా థియేటర్లు, ఫంక్షన్ హాళ్లు ఇలా ప్రతిచోటా ఎటువంటి మెళకువలు అవలంబించాలనే దానిపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

సెంట్రల్ కమాండ్ కంట్రోల్.. ప్రతి ఫైరింజన్‌కూ కెమెరా

రాష్ట్రంలో ఎక్కడ ప్రకృతి విపత్తు, అగ్ని ప్రమాదం సంభవించినా ఫైర్ స్టేషన్‌కు ఫోన్ కాల్ వచ్చిన వెంటనే కమాండ్ కంట్రోల్‌కు చేరేలా అమరావతిలో అధునాతన కమాండ్ కంట్రోల్ భవనాన్ని నిర్మించబోతున్నారు. అమరావతిలో రెండెకరాల విస్తీర్ణంలో రూ.22కోట్లతో నిర్మించే ఈ కమాండ్ కంట్రోల్ భవనం నుంచి రాష్ట్రంలోని అన్ని ఫైరింజన్లకు జీపీఎస్‌తోపాటు కెమెరాతో అనుసంధానిస్తారు. దీంతో ప్రమాదాల తీవ్రతను ఇక్కడి నుంచే వీక్షించి వేగంగా, కచ్చితత్వంతో స్పందించేలా సిబ్బందికి అనుభవజ్ఞులు సూచనలు ఇస్తారు. ఫోన్ కాల్ అందుకున్న సమయం నుంచి ప్రమాద స్థలికి చేరుకునే వరకూ జీపీఎస్ ద్వారా ఫైరింజన్‌ను పర్యవేక్షిస్తారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రమాదాలను త్వరగా అదుపు చేసి ప్రాణ, ఆస్తి నష్టాన్ని బాగా తగ్గించవచ్చని అగ్నిమాపక శాఖ అధికారులు చెబుతున్నారు.

104 కోట్లతో క్వాంటమ్ హబ్ భవనం

అమరావతిలో నిర్మాణానికి ఆమోదం

» రెండేళ్లలో పూర్తి చేయనున్న సీఆర్‌డీఏ

» 24న రాష్ట్రానికి ఫ్యూజీ టెక్ ప్రతినిధులు

» పెట్టుబడులపై ఐటీ, పరిశ్రమల శాఖతో చర్చలు

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అమరావతిలో రూ. 104 కోట్లతో క్వాంటమ్ హబ్ భవనాన్ని నిర్మించేందుకు ఆమోదం లభించింది. ఈ మేరకు వెలగపూడి సచివాలయంలో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో జరిగిన రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర ఐటీ శాఖ నిధులు భరిస్తే.. సీఆర్‌డీఏ భవనాన్ని నిర్మిస్తుంది. రెండేళ్లలో ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ముఖ్యమంత్రికి సీఆర్‌డీఏ అధికారులు వెల్లడించారు. వచ్చే ఏడాది జనవరిలో ఐబీఎం క్వాంటమ్ కంప్యూటర్ అమరావతికి వస్తుంది. క్వాంటమ్ వ్యాలీ నిర్మాణం పూర్తయ్యేంత వరకూ ఆ కంప్యూటర్‌ను విట్ వర్సిటీ ప్రాంగణంలో ఉంచుతారు.

పెట్టుబడులకు ఫ్యూజీ టెక్ ఆసక్తి

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్‌కు చెందిన ఫ్యూజీ టెక్ ఆసక్తి చూపుతోంది. ఎస్కలేటర్లు, ఎలివేటర్లు, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మ్ వంటి రంగాల్లో ప్రఖ్యాతి గాంచిన ఆ సంస్థ ప్రతినిధులు ఈనెల 24న రాష్ట్రానికి రానున్నారు. ఐటీ, పరిశ్రమలశాఖ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరపనున్నారు. కాగా, విశాఖలో గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్‌ను ఏర్పాటుకు ఎస్ఐపీబీ ఆమోద ముద్ర వేసింది. దీనికి శుక్రవారం జరగనున్న క్యాబినెట్ భేటీలో ఆమోద ముద్ర వేసిన వెంటనే.. భూ కేటాయింపులతో సహా ఇతర ప్రోత్సాహకాలను ప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తూ ఉత్తర్వులను ఇవ్వనుంది. అదేవిధంగా.. రాష్ట్రంలో క్వాంటమ్ కంప్యూటర్‌ను తయారు చేసేందుకు ముందుకు వచ్చే ఔత్సాహిక ఐటీ నిపుణులను ప్రోత్సహించేందుకు.. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌రంగ నిపుణులకు ప్రత్యేక ప్రోత్సాహకాలను ఇచ్చేలా పాలసీని కూడా ఐటీ శాఖ క్యాబినెట్ ముందు ఉంచనుంది. ఈ పాలసీని కూడా ఈనెల 10న విడుదల చేయనున్నారు.

నెలాఖరులో షార్ నుంచి మరో ప్రయోగం

» రోదసిలోకి జీశాట్-7ఆర్ ఉపగ్రహాన్ని పంపే సన్నాహాలు

సూళ్లూరుపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ప్రయోగానికి సన్నాహం చేస్తోంది. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈ నెలాఖరులో ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్ ద్వారా కమ్యూనికేషన్ రంగానికి చెందిన జీశాట్-7ఆర్ (సీఎంఎస్3) ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనున్నారు. షార్‌లోని రెండో ప్రయోగ వద్ద రాకెట్ అనుసంధాన పనులను శాస్త్రవేత్తలు పూర్తి చేశారు. ఈ రాకెట్ ద్వారా మొదట అమెరికాకు చెందిన బ్లూబర్డ్ ఉపగ్రహాన్ని పంపాల్సి ఉంది. అయితే చిన్నపాటి సమస్య తలెత్తి ఆ ప్రయోగం ఆలస్యం కావడంతో జీశాట్-7ఆర్‌ను పంపేందుకు శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు.

హైదరాబాద్-విజయవాడ హైవే విస్తరణకు రూ.10వేల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేయాల్సిన పలు సౌకర్యాల వివరాలన్నింటినీ అక్టోబరు చివరి వారంలోగా సేకరించి డీపీఆర్ పూర్తిచేయనున్నారు. దీనిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పించనున్నారు. ఈ డీపీఆర్ బాధ్యతను భోపాల్‌కు చెందిన కంపెనీ దక్కించుకుంది. హైవే నిర్మాణం సమయంలోనే 6 వరుసల విస్తరణకు అవసరమయ్యే భూమిని సేకరించారు. కొత్త మౌలిక సదుపాయాలకు ఎంత భూమి అవసరమనే వివరాలను కూడా త్వరలోనే ఖరారు చేయనున్నారు. కాగా, హైదరాబాద్ శివారు దండు మల్కాపూర్ నుంచి విజయవాడలోని గొల్లపూడి వరకు దాదాపు 265 కిలోమీటర్ల మేర రహదారిని ఆరు వరుసలుగా విస్తరించనున్నారు. ఇందుకు రూ.8వేల కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. రహదారి విస్తరణకు సుమారు రూ.7వేల కోట్లు, మార్గంమధ్యలో ఉన్న చెట్లు, విద్యుత్ స్థంబాలు, నీటి పైపుల తరలింపు, ఇతర పనులకు దాదాపు రూ.1000 కోట్ల వరకు అవసరమవుతాయని ప్రాథమికంగా అంచనా వేశారు.

నేడు విశాఖకు జగన్

» అనకాపల్లి జిల్లాలో నిర్మాణం ఆగిపోయిన వైద్య కళాశాల సందర్శన?

» రోడ్డు మార్గంలో ప్రయాణానికి షరతులతో అనుమతి

» ఉల్లంఘిస్తే అనుమతి రద్దు చేస్తామని పోలీసుల ప్రకటన

» అయినా భారీగా జనసమీకరణకు వైసీపీ నేతల యత్నం

» మాజీ వలంటీర్లు, సోషల్ మీడియా కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్

విశాఖపట్నం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గురువారం విశాఖ నగరానికి రానున్నారు. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలంలో నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలను ఆయన సందర్శించనున్నారు. గురువారం విజయవాడ నుంచి విమానంలో విశాఖకు చేరుకుంటారని పార్టీ నేతలు చెబుతున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి గాజువాక, లంకెలపాలెం మీదుగా రోడ్డుమార్గంలో మాకవరపాలెం వెళ్లేందుకు బందోబస్తు ఏర్పాటుచేయాలని ఆ పార్టీ నేతలు లేఖ ద్వారా నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని కోరారు. గురువారం విశాఖలో మహిళల ప్రపంచకప్ క్రికెట్ భారత్-దక్షిణాఫ్రికా మ్యాచ్ జరగనున్నందున జగన్‌కు రోడ్డుమార్గాన పర్యటనకు అనుమతి నిరాకరిస్తున్నట్టు మంగళవారం ఉదయం సీపీ ప్రకటించారు. విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో మాకవరపాలెం వెళ్లడంపై ఆలోచన చేయాలని సూచించారు. అయితే, రోడ్డుమార్గంలోనే మాకవరపాలెం వెళతామని వైసీపీ నేతలు ప్రకటించడంతో...ఎయిర్‌పోర్టు నుంచి గాజువాక మీదుగా కాకుండా ఎన్ఏడీ, పెందుర్తి మీదుగా మాకవరపాలెం వెళ్లేందుకు షరతులతో కూడిన అనుమతి ఇస్తున్నట్టు సీపీ మంగళవారం రాత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. మాజీ సీఎం పర్యటనకు అవసరమైన భద్రత కల్పిస్తామని, కాన్వాయ్‌లో పదికి మించి వాహనాలు ఉండకూడదని, రోడ్‌షో నిర్వహించడం, కూడళ్ల వద్ద గుమికూడిన ప్రజలను ఉద్దేశించి ప్రసంగాలు చేయడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడానికి వీల్లేదని సీపీ షరతులు విధించారు. ఈ షరతులను ఉల్లంఘిస్తే అనుమతి రద్దు చేయడంతోపాటు చట్టపరమైన చర్యలకు గురికావాల్సి ఉంటుందన్నారు. అయినప్పటికీ వైసీపీ నేతలు జనసమీకరణలో నిమగ్నమయ్యారు. జగన్‌కు ఎయిర్‌పోర్టులో ఘనస్వాగతం పలికేందుకు జనం తరలివచ్చేలా చూడాలంటూ వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలతో పాటు గతంలో వలంటీర్లుగా పనిచేసినవారు పిలుపునిచ్చారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాజీ వలంటీర్లు, సోషల్ మీడియా కార్యకర్తలతో నిరంతరం మాట్లాడుతూ జనసమీకరణపై ఆరా తీస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్రకు అన్యాయం చేస్తోందని చెప్పి ప్రజలను సమీపంలోని జంక్షన్‌కు తరలించాలని ఆదేశించారు. బుధవారం వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, వైసీపీ విశాఖ జిల్లా ఇన్‌చార్జి కురసాల కన్నబాబు ఇక్కడి పార్టీ కార్యాలయంలో తిష్ఠ వేసి జనసమీకరణపై నేతలు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, వివిధ విభాగాల అధ్యక్షులతో సమావేశాలు నిర్వహించారు.



మూడు శ్లాబ్‌లతో ఆగిపోయిన మొదటి బ్లాక్ భవనం

ఇవి చూడటానికే జగన్ రాక!

» మాకవరపాలెంలో 'మెడికల్ కాలేజీ'

» వైసీపీ హయాంలోనే నిలిచిపోయిన పనులు

పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని నిరసిస్తూ... వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ గురువారం అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం భీమబోయినపాలెం వస్తున్నారు. అక్కడికి వచ్చి చూసేది పై ఫొటోల్లోని భవనాలనే! ఈ మెడికల్ కాలేజీ అంచనా వ్యయం రూ.356.37 కోట్లు. 2023 జనవరి 25వ తేదీన పనులు ప్రారంభమయ్యాయి. సుమారు రూ.20.23 కోట్ల విలువైన పనులు చేయగా... 11.25 కోట్ల బిల్లులు మాత్రమే చెల్లించారు. దీంతో... కాంట్రాక్టు సంస్థ 2023 డిసెంబరులోనే పనులను నిలిపివేసింది. అంటే.. జగన్ తన హయాంలో పనులు ఆగిపోయిన మెడికల్ కాలేజీ బిల్డింగులను తానే వచ్చి చూస్తారన్న మాట!

- మాకవరపాలెం, ఆంధ్రజ్యోతి

మిథున్‌రెడ్డికి పాస్‌పోర్టు ఇవ్వండి

» సిట్‌కు ఏసీబీ కోర్టు ఆదేశం

» మద్యం కేసులో ముంబై వాలా

» నిందితుడిగా చేర్చేందుకు సిట్ పిటిషన్


విజయవాడ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో ఏ4గా ఉన్న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి నుంచి స్వాధీనం చేసుకున్న పాస్‌పోర్టును ఆయనకు తిరిగి అప్పగించాలని విజయవాడ ఏసీబీ కోర్టు బుధవారం ఆదేశాలు ఇచ్చింది. అమెరికాకు వెళ్లడానికి కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన ఎంపీల బృందంలో తానూ ఉన్నానని, అందువల్ల పాస్‌పోర్టును ఇప్పించాలని మిథున్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై వాదనలు ముగియడంతో న్యాయాధికారి పి.భాస్కరరావు తీర్పును వెలువరించారు. మిథున్‌రెడ్డి విదేశాలకు వెళ్లడానికి పాస్‌పోర్టును ఇవ్వాలని సిట్ అధికారులను ఆదేశించారు. కాగా, మద్యం కుంభకోణంలో ముంబైకి చెందిన అనిల్ చోక్రా అనే వ్యక్తిని నిందితుడి (ఏ49)గా చేర్చడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ సిట్ అధికారులు ఏసీబీ కోర్టులో బుధవారం పిటిషన్ దాఖలు చేశారు.

నిందితుల బెయిల్ పిటిషన్లపై మళ్లీ వాదనలు

మద్యం కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న నిందితుల బెయిల్ పిటిషన్లపై మళ్లీ వాదనలు వినిపించడానికి ప్రాసిక్యూషన్ దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌కు ఏసీబీ కోర్టు బుధవారం అనుమతి ఇచ్చింది. దీంతో తిరిగి గురువారం వాదనలను ప్రాసిక్యూషన్ వినిపిస్తుంది. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్ నాయుడు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. వాటిపై వాదనలు ముగిశాయి. తాము తిరిగి వాదనలు వినిపిస్తామని ప్రాసిక్యూషన్ పిటిషన్ దాఖలు చేసింది.

పీపీపీతో తప్పేంటి?

(మొదటి పేజీ తరువాయి)



అని ప్రశ్నించింది. ఇలాంటి సమయంలో అందరం నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని.. లేకుంటే ప్రభుత్వ కాలేజీలు, ఆస్పత్రులు ఎప్పటికీ అభివృద్ధి చెందవని పేర్కొంది. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు నిర్మించాలనేది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని తెలిపింది. ఆ నిర్ణయాలు రాజ్యాంగ విరుద్ధంగా, చట్టవిరుద్ధంగా ఉంటే తప్ప కోర్టులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందని గుర్తుచేసింది. పీపీపీలో ఆస్పత్రుల అభివృద్ధికి పిలిచిన టెండర్లను ఖరారు చేయకుండా స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులుగా ఉన్న సీఎస్, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ, ఏపీ ఎంఈఆర్‌సీ ఎండీకి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 29వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

ఇదీ కేసు..

ఆదోని, మదనపల్లె, మార్కాపురం, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదిస్తూ గత నెల 9న రాష్ట్రప్రభుత్వం జారీ చేసిన జీవో 590ని సవాల్ చేస్తూ గుంటూరు జిల్లా, తాడేపల్లికి చెందిన సామాజిక కార్యకర్త కుర్రా వసుంధర పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం ధర్మాసనం ముందు విచారణకు రాగా.. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. 2024 సెప్టెంబరులోనే కాలేజీల నిర్మాణం నిలుపుదలకు ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. నిధుల కొరత ఉందని ఎక్కడా చెప్పడం లేదన్నారు. 'గత ప్రభుత్వ హయాంలో 12 కాలేజీల నిర్మాణానికి రూ.5,008 కోట్లతో పరిపాలనాపరమైన అనుమతులు ఇచ్చారు. పీపీపీ విధానంలో ఆస్పత్రుల అభివృద్ధికి పిలిచిన టెండర్లను ఖరారు చేయకుండా స్టే ఇవ్వండి' అని కోరారు. ధర్మాసనం జోక్యం చేసుకుని.. 'కాలేజీ నిర్మాణానికి పాలనాపరమైన అనుమతులిస్తే సరిపోతుందా? సరిపడా నిధులేవీ? టెండర్లు ఖరారు చేయకుండా ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ ఇవ్వలేం' అని తేల్చిచెప్పింది.

రౌడీయిజం చేస్తే ఎవ్వరినీ వదలొద్దు

» రాజకీయ పర్యటన వరకూ అడ్డుచెప్పొద్దు

» నిబంధనలతో కూడిన అనుమతి ఇవ్వండి

» పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాట్లు చేయండి

» జగన్ నర్సీపట్నం పర్యటనపై పోలీసులకు డీజీపీ ఆదేశం



అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): 'రాజకీయ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఏ రాజకీయ పార్టీకైనా అభ్యంతరం చెప్పబోం. కానీ బలప్రదర్శన పేరుతో రౌడీయిజం చేస్తామంటే తాట తీస్తాం' అని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా హెచ్చరించారు. గురువారం విశాఖపట్నంలో మహిళల ప్రపంచ కప్ క్రికెట్ మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లపై నగర కమిషన్, పోలీసు ఉన్నతాధికారులతో ఆయన బుధవారం సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా ట్రాఫిక్ నియంత్రణ సమర్థంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం మాజీ సీఎం జగన్ నర్సీపట్నం పర్యటనపై విశాఖ సిటీ, అనకాపల్లి జిల్లా పోలీసులతో చర్చించారు. హెలికాప్టర్‌లో వెళ్లాలని సూచించినా వినడం లేదని, బల ప్రదర్శన కోసం ఉద్దేశపూర్వకంగా రోడ్‌షో నిర్వహిస్తున్నారని డీజీపీకి పోలీసు అధికారులు వివరించారు. వైసీపీ నాయకుడు గుడివాడ అమర్నాథ్ రెచ్చగొట్టేలా ఓ వర్గం మీడియాలో వ్యాఖ్యలు చేస్తున్నారని వివరించారు. దీనిపై డీజీపీ స్పందిస్తూ.. 'రాజకీయ పర్యటన వరకూ అడ్డుచెప్పొద్దు.. శాంతి భద్రతలకు విఘాతం కలిగించని నిబంధనలతో కూడిన అనుమతి ఇవ్వండి. పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేయండి. డ్రోన్లతో మార్గం మొత్తం పర్యవేక్షించండి. ఎక్కడైనా అదుపు తప్పి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే అడ్డుకోండి. రౌడీయిజం చేస్తే ఎవ్వరినీ వదలొద్దు. కరూర్‌లో రోడ్‌షో వల్ల 41మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడటం పోలీసుల బాధ్యత' అని డీజీపీ స్పష్టం చేశారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హోంమంత్రి అనిత. చిత్రంలో ఫిక్కీ ఫ్లో చైర్‌పర్సన్ అమృతాకుమార్

మహిళలకు భద్రత ఉన్నచోటే పెట్టుబడులు: అనిత

విశాఖపట్నం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఎక్కడైతే భద్రత ఉంటుందో అక్కడకు పెట్టుబడులు, పరిశ్రమలు వస్తాయని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ లేడీస్ ఆర్గనైజేషన్ (ఫిక్కీ ఫ్లో) ఆధ్వర్యంలో హోటల్ గ్రాండ్‌బేలో 'మహిళల భద్రత, సాధికారత' అంశంపై బుధవారం నిర్వహించిన కార్యక్రమాన్ని ఆమె జ్యోతి వెలిగించి ప్రారంభించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రతినిధులను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. 'ఒకవైపు ఇంటిపనులు చక్కబెట్టుకుంటూనే వ్యాపారంలో రాణిస్తున్న మహిళలు సమావేశం ఏర్పాటు చేయడం అభినందనీయం. మహిళలకు అత్యంత భద్రత కలిగిన నగరంగా దేశంలోనే విశాఖ గుర్తింపు దక్కించుకుంది. మహిళలకు భద్రత ఉండడం వల్లనే విశాఖకు అనేక ఐటీ కంపెనీలు, పరిశ్రమలు వస్తున్నాయి' అని మంత్రి తెలిపారు. సమావేశంలో ఫిక్కీ ఫ్లో చైర్‌పర్సన్ అమృతాకుమార్, రజినీచిత్ర, హేమ పాల్గొన్నారు.

నా ప్రశ్నలకు సమాధానం చెప్పాలి!

- జగన్‌కు మంత్రి సత్యకుమార్ సవాల్



అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలో ఉన్నప్పుడు నర్సీపట్నంలో నిర్మించ తలపెట్టిన మెడికల్ కాలేజీ పనులపై నాడు కనీసం సమీక్షించకుండా, పనులు వేగవంతం చేయాలని ఆదేశించిన మాజీ సీఎం జగన్.. ఇప్పుడు ఆ ప్రాంతంలో పర్యటించడాన్ని తాము స్వాగతిస్తున్నామని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. 16 నెలల తర్వాత చేపట్టిన ఈ పర్యటన ద్వారా వాస్తవాల్ని తెలుసుకుని ఆయనలో కనువిప్పు కలిగితే ఎంతగానో సంతోషిస్తానని వెల్లడించారు. ఈ సందర్భంగా జగన్‌కు తానడిగే పది ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. 'పులివెందుల మెడికల్ కాలేజీ పట్ల శ్రద్ధ కనబరిచి నర్సీపట్నం, పార్వతీపురం కాలేజీల నిర్మాణాలను ఎందుకు నిర్లక్ష్యం చేశారు? నర్సీపట్నం కాలేజీలో 2025-26లో 150 ఎంబీబీఎస్ ప్రవేశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారా? లేదా? ఆ మేరకు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి, అధికారం నుంచి వైదొలగే నాటికి కేవలం రూ.10.70 కోట్లు మాత్రమే వెచ్చించడం ఎంతవరకు సబబు? మీ అసమర్థతను కప్పిపుచ్చుకుంటూ కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు సబబా? మీ నిర్వాకంతో కుదేలైన నర్సీపట్నం వైద్య కళాశాల నిర్మాణానికి కూటమి ప్రభుత్వాన్ని ఏ విధంగా బాధ్యుల్ని చేస్తారు? తదితర ప్రశ్నలకు బహిరంగంగా స్పందించి, నర్సీపట్నం వైద్య కళాశాల, ఇతర కళాశాలల నిర్మాణం విషయంలో చర్చకు అంగీకరించాలని మాజీ సీఎం జగన్ రెడ్డికి మంత్రి సత్యకుమార్ సవాల్ విసిరారు.

నిబంధనలు అతిక్రమిస్తే మక్కెలు విరగ్గొడతారు!

- జగన్ పర్యటనపై ఎమ్మెల్యే గంటా వార్నింగ్



విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ రోడ్డు మార్గంలో పర్యటిస్తాం.. ఎవరు అడ్డుకుంటారో చూస్తామంటూ.. సవాళ్లు విసిరితే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని, మక్కెలు విరగ్గొట్టి మూలన కూర్చోపెడుతుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు.. మాజీ సీఎం జగన్‌కు వార్నింగ్ ఇచ్చారు. విశాఖపట్నంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. భద్రతా కారణాల రీత్యా హెలికాప్టర్‌లో వెళ్లాలని అధికారులు జగన్‌కు సూచిస్తే, దానిని ఆయన రాజకీయం చేస్తున్నారన్నారు. తమిళనాడులో సినీ హీరో విజయ్ కార్యక్రమంలో 41 మంది మరణించారని, మరోవైపు విశాఖలో మహిళల క్రికెట్ మ్యాచ్ జరుగుతున్న నేపథ్యంలోనే అనుమతి నిరాకరించారన్నారు. వైసీపీ హయాంలో పరామర్శలకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు వెళితే అడ్డంకులు కల్పించారని, తాము ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తానని, ఎవరి హక్కులు హరించే ఉద్దేశం కూటమి ప్రభుత్వానికి లేదన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని పూర్తి చేయలేకపోయిన జగన్.. ఇప్పుడు వాటి కోసం కోటి సంతకాలు సేకరించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అలాగే, అధికారంలో ఉన్నప్పుడు స్టీల్ ప్లాంటు కార్మిక సంఘ నాయకులకు కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వని జగన్ ఇప్పుడు వారి దగ్గరకు ఏ ముఖం పెట్టుకొని వెళతారని ప్రశ్నించారు. జగన్ వీకెండ్ పొలిటీషియన్ అని గంటా విమర్శించారు.

ఉద్యోగులకు జగన్ చేసిన గాయాలింకా మానలేదు: నీలాయపాలెం



అమరావతి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లు ఉద్యోగులకు జగన్ చేసిన గాయాలు ఇంకా మానలేదని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ ఉపాధ్యాయులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని అన్నారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులకు 43 శాతం పీఆర్సీ ఇచ్చిందని, జగన్ దాన్ని 21 శాతానికి తగ్గించారని, ఉద్యోగుల పీఎఫ్ నిధులను దోచుకున్న చరిత్ర జగన్‌దని విమర్శించారు. ఉద్యోగ సంఘ నాయకుడు కేఆర్ సూర్యనారాయణను చంపేస్తామని బెదిరించి, రాష్ట్రం వదిలిపోయేలా చేశారని, కరోనా సమయంలో మాస్కు అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌ను నడిరోడ్డుపై చేతులు విరిచి ఈడ్చుకుంటూ వెళ్లారని, అలాంటి జగన్‌కు ఉద్యోగుల గురించి మాట్లాడే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో ఉద్యోగులపై పెట్టిన క్రిమినల్ కేసులను కూటమి అధికారంలోకి రాగానే ఎత్తివేసిందని గుర్తు చేశారు.

ఏ మొహం పెట్టుకుని నర్సీపట్నం వెళ్తావ్?: పట్టాభి



అమరావతి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం మెడికల్ కాలేజీ నిర్మాణ అంచనా వ్యయం రూ.500 కోట్లు అయితే, జగన్ హయాంలో కేవలం రూ.11.7 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, అలాంటి వ్యక్తి ఏ మొహం పెట్టుకుని ఇప్పుడు అక్కడికి వెళుతున్నాడని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి నిలదీశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. జగన్ తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కూడా పీపీపీ మోడల్‌లోనే ప్రైవేటు హాస్పిటల్స్‌తో ఒప్పందాలు చేసుకున్న విషయం జగన్ తెలుసుకోవాలన్నారు.

ఇబ్రహీంపట్నంలోనూ 'నకిలీ' యూనిట్

- మూడు నెలలుగా నకిలీ మద్యం తయారీ
- ప్రధాన నిందితుడు జనార్దనరావుకు సోదరుడి అండ
- బెంగళూరు నుంచి స్పిరిట్, సీల్స్, మూతలు, మిషనరీ
- హైదరాబాద్ నుంచి నకిలీ లేబుళ్లు సరఫరా
- జనార్దనరావు బార్, ఆయన భాగస్వామిగా ఉన్న శ్రీనివాస వైన్స్‌లో అమ్మకాలు
- ఎన్టీఆర్ జిల్లా ఎక్సైజ్ అధికారుల రిమాండ్ రిపోర్టు

విజయవాడ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువులో తయారు చేసిన నకిలీ మద్యాన్ని ఎన్టీఆర్ జిల్లాలో అమ్మారు. అంతేగాక ఇబ్రహీంపట్నంలోనూ మద్యం తయారీ యూనిట్‌ను తెరిచారు. ఇబ్రహీంపట్నంలోని ఏఎన్ఆర్ బార్‌లో కనిపించిన నకిలీ మద్యం మరకలు విజయవాడలోని ఓ వైన్ షాపులో కనిపించాయి. బార్ యజమాని, నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు భాగస్వామ్యంతో నడుస్తున్న విజయవాడ విద్యాధరపురంలో ఉన్న శ్రీనివాస వైన్స్‌లో నకిలీ మద్యం విక్రయించినట్టు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో వైన్స్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న అంగులూరి కల్యాణ్ కీలకంగా వ్యవహరించాడు. ప్రతివారం 15 కేసుల నకిలీ మద్యాన్ని జనార్దనరావు వద్ద నుంచి కొనుగోలు చేసేవాడు. ఆ సరుకుని శ్రీనివాస వైన్స్‌లో ఉంచి అమ్మేవాడు. ఇలా వచ్చిన ఆదాయంలో సగ భాగాన్ని కల్యాణ్ తీసుకునేవాడు. ఎక్సైజ్ పోలీసులు కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో ఈ విషయాన్ని పేర్కొన్నారు. విద్యాధరపురంలో ఉన్న శ్రీనివాస వైన్స్ షాపు లైసెన్స్ జనార్దనరావు స్నేహితుడి పేరు మీద ఉంది. మూడు నెలలుగా ఏఎన్ఆర్ బార్‌లోనే కాకుండా శ్రీనివాస వైన్స్‌లోనూ నకిలీ మద్యం విక్రయించినట్టు ఎక్సైజ్ అధికారులు నిర్ధారించారు.

బెంగళూరు నుంచి ముడిసరుకు

అప్పుల ఊబిలో కూరుకుపోయిన అద్దేపల్లి జనార్దనరావు అందులో నుంచి బయటకు రావడానికి నకిలీ మద్యం తయారీని ఎంచుకున్నాడు. దీనికి సంబంధించిన ముడిసరుకు, సామగ్రిని బెంగళూరు నుంచి రప్పించేవాడు. 4 నెలల క్రితం అన్నమయ్య జిల్లా ములకలచెరువులో జనార్దనరావు నకిలీ మద్యం తయారీని ప్రారంభించాడు. స్పిరిట్, సీల్స్ మూతలు, చక్కెర, మిషనరీని బెంగళూరు నుంచి బాలాజీ అనే వ్యక్తి సరఫరా చేసేవాడు. హైదరాబాద్‌కు చెందిన రవి నకిలీ లేబుళ్లను సమకూర్చేవాడు. జనార్దనరావు, జగన్మోహనరావుది ఉమ్మడి కుటుంబం. ఇబ్రహీంపట్నంలో ఇద్దరూ ఒకే ఇంట్లో నివసిస్తున్నారు. నకిలీ మద్యం తయారీని ఇబ్రహీంపట్నంలో 3 నెలల క్రితం మొదలుపెట్టాడు. జనార్దనరావు బార్ నడుపుతుండగా, జగన్మోహనరావు కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. ఇబ్రహీంపట్నానికి చెందిన సయ్యద్ హాజి, కట్టా రాజు, ఒడిసాలోని గంజాంకు చెందిన బాదల్‌దాస్, ప్రదీప్ దాస్, మిథున్ దాస్, అంతా దాస్‌లు స్పిరిట్ రసాయనాలు మిశ్రమం చేయడం, సీళ్లు వేయడం, లేబుళ్లు అతికించడం చేసేవారు. సయ్యద్ హాజి ఏడేళ్లుగా బార్‌లో పనిచేస్తున్నాడు. ములకలచెరువులో నకిలీ మద్యం తయారీలోకి హాజిని అతడి సోదరుడు అధిక వేతనానికి తీసుకెళ్లాడు. కట్టా రాజు పదేళ్లకు పైగా కిరాణా షాపు, బార్‌లో పనిచేస్తున్నాడు. అతడూ నకిలీ మద్యం తయారు చేసేవాడు. మిథున్ దాస్, అంతా దాస్ మూడు, నాలుగేళ్లుగా బార్, కిరాణా షాపులో పనిచేస్తున్నారు. వీరిద్దరూ ములకలచెరువులో నకిలీ మద్యం మిశ్రమాన్ని చేసేవారు. కృష్ణా జిల్లా గన్నవరంలోని సూరంపాలెంలో ఉన్న ఎలీప్ పారిశ్రామికవాడలో శ్రీనివాసరెడ్డి నుంచి ప్లాస్టిక్ సీసాలను కొనుగోలు చేశారు. ఇక బాదల్ దాస్ జగన్మోహనరావు కిరాణా షాపులో పనిచేసేవాడు. అక్కడి నుంచి రెండేళ్లుగా జనార్దనరావుకు చెందిన ఏఎన్ఆర్ బార్‌లో పనిచేయడం మొదలుపెట్టాడు. నకిలీ మద్యం తయారు చేస్తే రెట్టింపు వేతనం ఇస్తానని జనార్దనరావు ఈ యువకులకు ఎరవేశాడని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. కేసులో భవానీపురం ఎక్సైజ్ స్టేషన్ అధికారులు 12 మందిని నిందితులుగా చేర్చారు. ఏ1 అద్దేపల్లి జనార్దనరావు, ఏ2 అద్దేపల్లి జగన్మోహనరావు, ఏ3 బాలాజీ, ఏ4 రవి, ఏ5 సయ్యద్ హాజి, ఏ6 కట్టా రాజు, ఏ7 బాదల్ దాస్, ఏ8 ప్రదీప్ దాస్, ఏ9 మిథున్ దాస్, ఏ10 అంతాదాస్, ఏ11 శ్రీనివాసరెడ్డి, ఏ12గా అంగులూరి కల్యాణ్ పేర్లను చేర్చారు. ఇందులో జగన్మోహనరావు, బాదల్ దాస్, ప్రదీప్ దాస్‌కు కోర్టు రిమాండ్ విధించింది. శ్రీనివాస వైన్స్ మేనేజర్ అంగులూరి కల్యాణ్‌ను బుధవారం అరెస్ట్ చేశారు.

ప్లాన్ జనార్దనరావుది



కట్టా నాగరాజు, కొడాలి శ్రీనివాసరావును కోర్టులో హాజరు పరిచేందుకు తీసుకెళ్తున్న ఎక్సైజ్ అధికారులు

- నకిలీ మద్యం తయారీ, అమ్మకాలు, కలెక్షన్లు, వాటాల బాధ్యత కట్టారాజుది
- జయచంద్రారెడ్డికి మద్యం సొమ్ముల్లో వాటా
- ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ అధికారుల రిమాండ్ రిపోర్టు
- కేసులో కొత్తగా ఏడుగురు నిందితులు

రాయచోటి/ములకలచెరువు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన అన్నమయ్య జిల్లా ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో ఏ2 నిందితుడు కట్టా రాజు కీలకంగా వ్యవహరించాడు. నకిలీ మద్యం తయారీ దగ్గర నుంచి అమ్మకాలు, కలెక్షన్లు, వాటాల పంపిణీ చూసుకునేవాడు. నకిలీ మద్యం తయారీకి ప్రధాన నిందితుడు జనార్దనరావు పథకం వేశాడు. టీడీపీ నుంచి సస్పెన్షన్‌కు గురైన జయచంద్రారెడ్డికి మద్యం వాటా సొమ్ములు ఇచ్చినట్టు తెలుస్తోంది. ఆయన ఇంట్లో పనిచేసే అన్బురాసు అలియాస్ బాబు తీసుకునేవాడు. ఎక్సైజ్ అధికారులు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో ఈ మేరకు విషయాలు వెల్లడించినట్టు తెలుస్తోంది. కట్టా రాజు అరెస్టు సమయంలో అతని వద్ద నుంచి ఒక డైరీ, ల్యాప్‌టాప్‌ను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన కట్టా రాజుకు ప్రధాన నిందితుడు జనార్దనరావుతో 1990 నుంచి పరిచయం ఉంది. ఈ ఏడాది మార్చిలో కట్టా రాజు ములకలచెరువుకు వచ్చాడు. జనార్దనరావు మద్యం దుకాణాల్లో లెక్కలు చూసుకునేవాడు. ములకలచెరువులోని రాక్‌స్టార్ వైన్స్, చెంబ్రాయునిపల్లెలో ఆంధ్రా వైన్స్‌లో పనిచేస్తూ వాటి వ్యవహారాలు చూసుకునేవాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జనార్దనరావు అతడిని పిలిచి మాట్లాడాడు. జయచంద్రారెడ్డి తనకు చాలా సన్నిహితుడని, ఆయన బావమరిది గిరిధర్ రెడ్డి, బెంగళూరుకు చెందిన బాలాజీ, హైదరాబాద్‌కు చెందిన నెకిరికంటి రవి, కట్టా సురేంద్రనాయుడు కలిసి పెద్దఎత్తున నకిలీ మద్యం తయారు చేసి అమ్మాలని అనుకుంటున్నట్లు చెప్పాడు. నకిలీ మద్యం తయారీకి అవసరమైన సామగ్రి, యంత్రాలను సమకూర్చుకున్న తరువాత ఈ ఏడాది జూన్ నుంచి తయారీ ప్రారంభించారు. నకిలీ మద్యం అమ్మకాలు, కలెక్షన్లు, ఎవరికి, ఎక్కడ, ఎంత ముట్టజెప్పాలో, ఎలా అందజేయాలో కట్టా రాజు చూసుకునేవాడు. ఆ వివరాలన్నింటినీ జనార్దనరావు సూచనల మేరకు డైరీ, ల్యాప్‌టాప్‌లో నమోదు చేశాడు. జయచంద్రారెడ్డి వాటా సొమ్ములను ఆయన ఇంట్లో పనిచేసే అన్బురాసు తీసుకుని కట్టా రాజు వద్దనున్న డైరీలో సంతకం చేసేవాడు. కట్టా రాజు సెప్టెంబరు 21న దసరా కోసం విజయవాడకు వెళ్లాడు. ఈ నెల 3వ తేదీ ములకలచెరువు మద్యం తయారీ కేంద్రంపై దాడి జరిగినప్పుడు అక్కడ లేడు. 4వ తేదీన రావాల్సిన కట్టా రాజుకు జనార్దనరావు ఫోన్ చేసి ములకలచెరువుకు రావొద్దని చెప్పాడు. జనార్దనరావుతో పాటు బాలాజీ, రవి, జయచంద్రారెడ్డి, గిరిధర్ రెడ్డి, కట్టా సురేంద్ర నాయుడు, టి.రాజేశ్‌లతో పాటు మరికొంత మందికి ఈ నకిలీ మద్యంతో ప్రమేయం ఉందని కట్టా రాజు వాంగ్మూలం ఇచ్చాడు. రాక్‌స్టార్ వైన్స్‌కు సంబంధించిన అన్ని ఖాతాలను జయచంద్రారెడ్డి ఇంట్లో పనిచేసే అన్బురాసు చూసుకునేవాడని చెప్పాడు. కట్టా సురేంద్ర నాయుడు కమ్మవారిపల్లెలోని తన ఇంటిలో నకిలీ మద్యాన్ని నిల్వచేసి పరిసర గ్రామాలకు సరఫరా చేసేవాడని తెలిపాడు. రాక్‌స్టార్ వైన్స్‌కు సంబంధించి జయచంద్రారెడ్డి వద్ద డ్రైవర్‌గా పనిచేసే అష్రఫ్ అనే వ్యక్తి స్కార్పియో వాహనంలో పరిసర గ్రామాల్లో మద్యం సరఫరా చేసేవాడని కట్టా రాజు వాంగ్మూలంలో చెప్పాడు.

కొడాలికి ఆర్థిక సాయం

కేసులో ఏ12 నిందితుడు తెనాలికి చెందిన వైసీపీ నేత కొడాలి శ్రీనివాసరావు ఇచ్చిన వాంగ్మూలం మేరకు..జనార్దనరావుతో చదువుకునే సమయం నుంచే పరిచయం ఉంది. ఈ ఏడాది మార్చిలో జనార్దనరావు శ్రీనివాసరావును పిలిపించి ములకలచెరువులో తన వద్ద ఉద్యోగంలో చేరాలని కోరాడు. దీంతో అతను వారం తరువాత ములకలచెరువుకు వచ్చాడు. మదనపల్లె-ములకలచెరువు మార్గంలోని పాతరోడ్డులో పాత గోడౌన్ చూపించి నకిలీ మద్యం తయారీ కోసం లీజుకు తీసుకుంటున్నట్లు జనార్దనరావు చెప్పాడు. స్నేహం, గతంలో చేసిన ఆర్థిక సాయం కారణంగా ఆ షెడ్డును తాను లీజుకు తీసుకుంటున్నట్లు శ్రీనివాసరావు అగ్రిమెంటు చేసుకున్నాడు. అతనికి ఖాళీ మద్యం సీసాలు తెప్పించే బాధ్యత అప్పగించారు. మూడుసార్లు పెట్ బాటిల్స్ కావాలని పలు సంస్థలకు ఇన్‌వాయిస్‌లు పంపినట్లు తెలిపాడు. ఆ తరువాత భయపడి మే నెలలో వెనక్కి వెళ్లిపోయాడు. తిరిగి రాలేదు. పోలీసులు అతడి ఫోన్‌ను సీజ్ చేశారు.

కట్టారాజు, కొడాలికి రిమాండ్

ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు జనార్దనరావు అనుచరుడు కట్టా రాజు, కొడాలి శ్రీనివాసరావును పోలీసులు బుధవారం తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరిచారు. కోర్టు వీరిద్దరికీ 14 రోజులు రిమాండ్ విధించింది. వీరిని మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు. టీడీపీ నుంచి సస్పెన్షన్‌కు గురైన తంబళ్లపల్లె ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి, ఆయన బావమరిది గిరిధర్‌రెడ్డితో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే కొత్తగా చేర్చిన పేర్లను వెల్లడించకుండా ఉన్నతాధికారులు గోప్యత పాటిస్తున్నారు. కాగా ప్రధాన నిందితుడు జనార్దనరావు లొంగుబాటుకు సిద్ధమైనట్లు తెలిసింది. దక్షిణాఫ్రికాలో ఉన్న అతను బెంగళూరుకు వచ్చి తంబళ్లపల్లె లేదా మదనపల్లె కోర్టులో లొంగిపోతాడని విశ్వసనీయ సమాచారం. గురు లేదా శుక్రవారం సాయంత్రంలోగా లొంగిపోయే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. జనార్దనరావు, జయచంద్రారెడ్డి ఇద్దరూ స్నేహితులు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా జయచంద్రారెడ్డి పోటీ చేసిన సమయంలో ఆయనకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలన్నీ జనార్దనరావే చూశారు. కాగా నకిలీ మద్యం తయారీ కేసులో ఇప్పటికే అరెస్టై మదనపల్లె సబ్‌జైలులో ఉన్న 10 మంది నిందితులను కస్టడీకి ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులు తంబళ్లపల్లె కోర్టులో వేసిన పిటిషన్‌పై విచారణను ఈ నెల 10వ తేదీకి వాయిదా వేశారు.

'నకిలీ'కి నాడే నాంది

(మొదటి పేజీ తరువాయి)

నకిలీ మద్యం తయారీ మొదలైంది. రాష్ట్రంలో పలు ప్రాంతాలకు విస్తరించింది. కోవిడ్ తర్వాత కొంతకాలానికి జంగారెడ్డిగూడెంలో 27 మంది నకిలీ మద్యం తాగి మృత్యువాతపడ్డారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నకిలీ మద్యం దొరికితేనే కఠిన చర్యలు చేపట్టగా.. అప్పట్లో అంతమంది చనిపోయినా జగన్ ప్రభుత్వం కనీసం స్పందించలేదు. అసలు అక్కడేం జరగలేదన్నట్టుగా ఆ ఘటనను తీసిపారేసింది. నకిలీ మద్యం వెనుక ఉన్నవారిపై చర్యలు కూడా తీసుకోలేదు. కానీ ఇప్పుడు అదే వైసీపీ కూటమి ప్రభుత్వం విషం చిమ్ముతోంది.

ఇలా మొదలైంది...

కోవిడ్ సమయంలో 42 రోజుల లాక్‌డౌన్ అనంతరం మద్యం షాపులు తెరిచిన వెంటనే మద్యం కోసం మందుబాబులు ఎగబడ్డారు. మద్యం షాపుల ముందు కిక్కిరిసిన జనాల వీడియోలు వైరల్ అయ్యాయి. జాతీయ మీడియాలోనూ ప్రతికూల కథనాలు వచ్చాయి. దీంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేసిన అప్పటి సీఎం జగన్ వెంటనే మద్యం ధరలు రెట్టింపు చేశారు. రాత్రికి రాత్రి రూ.100 సీసా రూ.200



అయ్యింది. దీంతో పక్క రాష్ట్రాల మద్యం, నాటుసారా పెరిగాయి. నకిలీ మద్యం, గంజాయి వేగంగా విస్తరించాయి. ఆ సమయంలోనే రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కాహాల్(ఈఎన్ఏ) ఎగుమతులు పెంచారు. ఈ క్రమంలో దానిని తీసుకుని నకిలీ మద్యం తయారు చేయడం ప్రారంభించారు. అప్పట్లోనే శ్రీసత్యసాయి జిల్లాలో విపరీతంగా నకిలీ మద్యం అమ్మారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఈ అక్రమాలు కొనసాగుతున్నాయి.

స్పిరిట్‌తో తయారీ

ఇప్పుడు నకిలీ మద్యం తయారీకి రెక్టిఫైడ్ స్పిరిట్ ఎక్కడి నుంచి వచ్చిందనేది కీలకంగా మారనుంది. స్పిరిట్ ప్రైమరీ డిస్టిలరీ యూనిట్లలో తయారవుతుంది. ఆ తర్వాత సెకండరీ డిస్టిలరీ యూనిట్లలో దాన్ని ఈఎన్ఏగా మార్చి మద్యం తయారు చేస్తారు. అయితే ఇప్పుడు దొరికిన నకిలీ మద్యం చాలావరకు స్పిరిట్‌తోనే తయారు చేసినట్లు తెలుస్తోంది. స్పిరిట్‌కు రంగు, ఫ్లేవర్ కలిపి మద్యం తయారు చేస్తున్నారు. అందులోనూ అక్రమార్కులు కక్కుర్తి పడ్డారు. డిస్టిలరీల్లో తయారు చేసే మద్యం 25 అండర్ ప్రూఫ్ స్ట్రెంత్‌తో ఉంటుంది. అంటే.. 75 శాతానికి పైగా అందులో ఆల్కాహాల్ ఉంటుంది. ఇప్పుడు దొరికిన నకిలీ మద్యం 30 నుంచి 35 శాతం అండర్ ప్రూఫ్‌గా ఉంది. అంటే.. 65 నుంచి 70 శాతం మాత్రమే ఆల్కాహాల్ ఉంటుంది. దీంతో తగిన స్థాయిలో మత్తు ఎక్కదు. నకిలీ మద్యం తయారీ ద్వారా లాభాలు భారీ స్థాయిలో వస్తాయి. సాధారణంగా మీడియం రేంజ్ లిక్కర్ క్వార్టర్ సీసా తయారీకి సగటున రూ.20 ఖర్చు అవుతుంది. దాన్ని ప్రభుత్వం రూ.150 కంటే ఎక్కువ ధరకు అమ్ముతుంది. ఇతరత్రా ఖర్చులు పోయినా చివరికి ప్రభుత్వానికి రూ.120 వరకు ఆదాయం వస్తుంది. ఇప్పుడు ఆ మొత్తం పన్నులు అక్రమార్కులకే మిగులుతాయి. అంటే.. ఒక్క సీసాపైనే ఎంత లేదన్నా రూ.100కు పైగా లాభం. అందుకే అక్రమార్కులు వైసీపీ హయాంలో నకిలీ బాట పట్టారు.

రెండేళ్ల కాల్ డేటా తీద్దాం

నకిలీ మద్యం వ్యవహారం ఇప్పటిది కాదని ఎక్సైజ్ శాఖ నిర్ణయానికి వచ్చింది. అసలు ఇది ప్రారంభమైంది ఎప్పుడు? ఎవరెవరితో సంబంధాలున్నాయి? ఎవరు సహకరిస్తున్నారు? అనే వివరాలు సేకరించే పనిలో పడింది. అందులో భాగంగా నిందితుల రెండేళ్ల కాల్ డేటా తీయాలని నిర్ణయించారు. కాల్ డేటా కోసం అధికారులు దరఖాస్తు చేసినట్లు తెలిసింది. దీంతో మొత్తం పాత వివరాలు కూడా బయటికొచ్చే అవకాశం ఉంది.

నాడు.. నేడు.. ఇదీ పరిస్థితి

వైసీపీ ప్రభుత్వంలో ఎక్సైజ్‌ను రెండుగా విభజించడం కూడా నకిలీ మద్యం, గంజాయి లాంటివి పెరగడానికి కారణమైంది. నాటుసారా, నకిలీ మద్యంపై ఎక్కువ నిఘా పెట్టే ఎక్సైజ్ శాఖను విడగొట్టి అందులో 70 శాతం అధికారులు, సిబ్బందితో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏర్పాటు చేశారు. మిగిలిన 30 శాతం అధికారులు, సిబ్బందితో ఎక్సైజ్ శాఖ పరిమితంగా మారింది. పైగా సెబ్‌కు మద్యంతో పాటు ఇసుక, గ్యాంబ్లింగ్, గుట్కా లాంటి అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో నకిలీ మద్యంపై దృష్టి పెట్టలేకపోయారు. ఇప్పుడు సెబ్‌ను రద్దు చేసి శాఖను మళ్లీ పాత విధానంలోకి మార్చారు. కూటమి ప్రభుత్వం గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపింది. నకిలీ మద్యం అక్రమార్కులపైనా కఠిన చర్యలు తీసుకుంటోంది.



కల్తీ మద్యంపై నిర్వహించిన సమావేశంలో సీఎం , డీజీపీ, సీఎస్, తదితరులు

నకిలీ మద్యంపై ఉక్కుపాదం మోపండి

- రాష్ట్రంలో ఆ మద్యం ఎక్కడా కనిపించకూడదు
- తయారీదారులను ఏమాత్రం ఉపేక్షించొద్దు
- మద్యంపై ఫేక్ ప్రచారాన్ని తిప్పికొట్టండి
- ఆధారాలు లేకపోతే కఠిన చర్యలు తీసుకోండి
- వేరే కారణాలులేకే వైసీపీ తప్పుడు ప్రచారం
- పోలీసు, ఎక్సైజ్ శాఖల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నకిలీ మద్యం తయారీని ఏమాత్రం ఉపేక్షించొద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. నకిలీతో ప్రజల ప్రాణాలు హరించే వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడా అలాంటి మద్యం తయారీ కేంద్రాలుగానీ, తయారుచేసే వ్యక్తులు కూడా ఉండకూడదని స్పష్టంచేశారు. నకిలీ మద్యం వ్యవహారంపై పోలీసు, ఎక్సైజ్ శాఖలతో బుధవారం సచివాలయంలో సమీక్షించారు. ములకలచెరువు కేసులో ఇప్పటివరకూ 21 మందిని నిందితులుగా గుర్తించామని, అందులో ఇప్పటివరకూ 12 మందిని అరెస్టు చేశామని అధికారులు వివరించారు. ఏ1గా ఉన్న అద్దేపల్లి జనార్దన్‌రావు లావాదేవీలు, వ్యాపారాలపై విచారణ చేస్తున్నామన్నారు. ఇబ్రహీంపట్నంలో దొరికిన నకిలీ మద్యం వ్యవహారంలో 12 మందిని నిందితులుగా గుర్తించి, ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఎంకు వివరించారు. ములకలచెరువు వ్యవహారంపై రాజకీయ పక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఈ సందర్భంగా సీఎం అన్నారు. నకిలీ మద్యం రాష్ట్రమంతటా ఉందంటూ ప్రజల్ని భయపెడుతున్నారని, ప్రతి మూడు సీసాల్లో ఒక నకిలీ అని ఫేక్ ప్రచారం చేస్తున్నారని చెప్పారు. తప్పుడు ప్రచారాన్ని మంత్రులు అర్థంచేసుకుని, ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని ఆదేశించారు. నకిలీ మద్యం కారణంగానే అక్కడ చనిపోయారు, ఇక్కడ చనిపోయారు అంటూ ప్రచారం చేస్తున్నారని, ప్రతి ఆరోపణపైనా విచారణ జరపాలని అధికారులకు స్పష్టంచేశారు. అవసరమైతే మృతికి కారణాలను సైంటిఫిక్ విధానంలో తెలుసుకుని వాస్తవాలు వెల్లడించాలన్నారు. ఏది నిజమో చెప్పడంతో పాటు రాజకీయ కుట్రతో తప్పుడు ప్రచారాలు చేసేవారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నకిలీ మద్యంతో చనిపోయారని ఎవరైనా అంటే దానికి రుజువులు అడగాలని, తప్పుడు ప్రచారం అని తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మీడియాలోనైనా, సోషల్ మీడియాలోనైనా తప్పుడు ప్రచారం చేస్తే ఉపేక్షించవద్దన్నారు.

వైసీపీ డ్రామాలు మర్చిపోవద్దు

2019లో వివేకానందరెడ్డి హత్య కేసులో వైసీపీ ఆడిన డ్రామాలు మర్చిపోద్దని ఈ సందర్భంగా మంత్రులకు సీఎం సూచించారు. ప్రజలను నమ్మించేందుకు వైసీపీ వాళ్లు చేసే తప్పుడు ప్రచారాలను మంత్రులు తిప్పికొట్టాలన్నారు. ఈ విషయంలో మరింత చురుగ్గా ఉండాలని సూచించారు. వైసీపీ గత చరిత్ర, రాజకీయ కుట్రలను ప్రజల్లో పెట్టి ఎండగట్టాలన్నారు. ప్రతి ఘటన, సమస్యపై ప్రభుత్వం స్పందిస్తుండటంతో విమర్శలు చేయడానికి వైసీపీకి కారణాలు దొరకడం లేదని, అందుకే తప్పుడు ప్రచారాలతో రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల హామీలన్నీ అమలుచేయడంతో వేరే కారణాలు దొరక్క వైసీపీ ఫేక్ ప్రచారాలను నమ్ముకుందన్నారు. ఏది మంచి, ఏది చెడో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మంత్రులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. సమీక్షలో మంత్రి కొల్లు రవీంద్ర, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలి

- సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- కర్నూలులో ఏర్పాట్లను పరిశీలించిన భరత్

అమరావతి/కర్నూలు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనను విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ నెల 16న ప్రధాని కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటించనున్న నేపథ్యంలో ఆ ఏర్పాట్లపై సీఎం బుధవారం అధికారులతో సమీక్షించారు. శ్రీశైలం భ్రమరాంబ, మల్లికార్జున స్వామిని పీఎం దర్శించుకుంటారు. ఆ తర్వాత కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరులో నిర్వహించే బహిరంగ సభకు హాజరవుతారు. ఈ సభను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో మంత్రులు లోకేశ్, బీసీ జనార్దన్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, కందుల దుర్గేశ్, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ప్రధాని పర్యటన ఏర్పాట్ల ప్రత్యేక అధికారి వీరపాండియన్ నేతృత్వంలో కలెక్టర్ అట్టాడ సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జేసీ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పర్యవేక్షణలో నన్నూరులో చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాని



కర్నూలులో ప్రధాని మోదీ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి టీజీ భరత్

సభకు సుమారు మూడు లక్షల మందికిపైగా హాజరు అవుతారని అంచనా వేస్తున్నారు. సుమారు 450 ఎకరాల్లో విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సభ ఏర్పాట్లపై కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు ఎ.సిరి, రాజకుమారి, ఎస్పీలు విక్రాంత్ పాటిల్, సునీల్ షెరాన్‌లతో సీఎం చంద్రబాబు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భద్రత ఏర్పాట్లపై అదనపు డీజీ మధుసూదన్‌రెడ్డి, ఐజీ శ్రీకాంత్, డీఐజీలు కోయ ప్రవీణ్, సెంథిల్ కుమార్, సత్యయేసు బాబు, ఫక్కీరప్పతో కలిసి సమీక్షించారు. రాష్ట్ర మంత్రి టీజీ భరత్ సభా ప్రాంగణానికి వచ్చి ఏర్పాట్లను పరిశీలించారు.

15న వామపక్షాల నిరసన ర్యాలీ

మోదీ కర్నూలు పర్యటనను వ్యతిరేకిస్తూ ఈనెల 15న కర్నూలులో పది వామపక్ష పార్టీలతో భారీ నిరసన ర్యాలీ చేపడతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. జీఎస్టీ విజయోత్సవం పేరుతో ప్రధానిని రాష్ట్రానికి ఆహ్వానించి భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం సిగ్గుచేటని విమర్శించారు.

రాజ్‌భవన్‌కు రూ. 212 కోట్లు

- అమరావతిలో నిర్మాణానికి సీఆర్‌డీఏ అథారిటీ ఆమోదం
- రాజధానితో పాటు రైతులూ అభివృద్ధి చెందాలి
- అధికారులకు చంద్రబాబు ఆదేశం

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో రూ. 212 కోట్ల వ్యయంతో గవర్నర్ నివాసం రాజ్‌భవన్ నిర్మాణానికి సీఆర్‌డీఏ అథారిటీ ఆమోదం తెలిపింది. కృష్ణా నది ఒడ్డున అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ నిర్మాణంలో భాగంగా రాజ్‌భవన్ నిర్మాణ జరగనుంది. దీనికి సంబంధించిన డిజైన్ అద్భుతంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం అధ్యక్షతన 53వ సీఆర్‌డీఏ అథారిటీ సమావేశం జరిగింది. మొత్తంగా 18 అంశాలపై అథారిటీ సమావేశంలో చర్చించారు. మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి 25 శాతం నిధులను సీఆర్‌డీఏ ఇచ్చేందుకు, రాజధాని ప్రాంతంలో నాలుగు కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి అథారిటీ అంగీకరించింది. రాజధాని నగర జోనింగ్ నిబంధనల్లో గ్రీన్ సర్టిఫైడ్ భవనాలు ఉండేలా అవసరమైన మార్పులకు అథారిటీ ఆమోదించింది. అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణానికి ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా సీఆర్‌డీఏ వ్యవహరించడానికి అంగీకరించింది. హ్యాపీనెస్ట్, ఏపీ ఎన్ఆర్‌టీ ప్రాజెక్టులకు చెందిన భవనాల అనుమతుల ఫీజు మాఫీకి, రాజధానిలో నిర్మించే హోటళ్ల పార్కింగ్ నిబంధనల్లోనూ స్వల్ప మార్పులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొండవీడు వాగు సమీపంలో 8400 క్యూసెక్కుల సామర్థ్యంతో మరో పంపింగ్ స్టేషన్ నిర్మాణానికి అథారిటీ నిర్ణయించింది. దీంతో పాటు మరికొన్ని సాంకేతిక అంశాలకు, పరిపాలన అంశాలకు అథారిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా సీఎం కొన్ని సూచనలు చేశారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా పార్కింగ్ సమస్య లేకుండా చూడాలన్నారు. రోడ్డుపై వాహనాల పార్కింగ్ చేసే పరిస్థితి రాకూడదన్నారు. విజయవాడ, గుంటూరు, మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్లు, తెనాలి మున్సిపాలిటీ, రాజధాని ప్రాంతంతో అనుసంధానం చేయాలని, బ్లూగ్రీన్ అమరావతిగా రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే.. "అమరావతితో పాటు రాజధానికి భూములిచ్చిన రైతులు కూడా అభివృద్ధి చెందాలి. భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లను తక్షణమే ఇవ్వాలి. భూములను త్యాగం చేసిన రైతులకే రాజధాని అభివృద్ధి ఫలాలు మొదటగా అందాలి. రాజధాని రైతులకు కౌలు చెల్లింపుల్లోనూ ఎలాంటి జాప్యం జరగకూడదు. రైతులకు ఎక్కడ రిటర్నబుల్ ప్లాట్లు ఇస్తామని చెప్పామో..అక్కడే ఇవ్వాలి. ఏ ఊళ్లో భూములిచ్చిన వారికి ఆ ఊళ్లోనే ప్లాట్లు ఇస్తామన్నాం. అలాగే కేటాయింపులు చేయాలి.రాజధాని నిర్మాణపనుల్లో మరింతవేగం పెంచాలి. సెక్రటేరియట్ టవర్లతో సహా ఇతర నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి. వెస్ట్ బైపాస్ రోడ్డును వెంటనే ప్రారంభించేచర్యలు తీసుకోవాలి. కరకట్ట రోడ్డును విస్తరించాలి. మూడు నెలల్లో రాజధాని నగరానికి ఒక రూపు తీసుకురావాలి" అని చెప్పారు. ఈ సమావేశానికి మంత్రి నారాయణ, సీఎస్ విజయానంద్ తదితరులు హాజరయ్యారు.

అమరావతిలో సీఆర్డీఏ భవనం సిద్ధం



- 13న సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- 3.07 లక్షల చ. అడుగుల విస్తీర్ణంలో భవనం
- 257 కోట్ల ఖర్చుతో జీప్లస్ 7గా నిర్మాణం
- 2017లోనే మొదలైన పనులు
- జగన్ హయాంలో నిలిపివేత.. పూర్తిచేసిన 'కూటమి'

గుంటూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అమరావతిలో మరో ముఖ్యమైన కార్యాలయం ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. రాజధాని ప్రాంత అభివృద్ధికి కీలకమైన ఏపీ సీఆర్డీఏ భవనాన్ని ఈనెల 13న ఉదయం 9.54 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. దాదాపు 3.07 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ. 257 కోట్లతో నిర్మించిన జీప్లస్ 7 భవనం అందుబాటులోకి రానుంది. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక దాదాపు ఆరేళ్ల క్రితం ఆగిపోయిన భవన నిర్మాణం పనులు కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ మొదలయ్యాయి. రాజధాని నిర్మాణం, అభివృద్ధికి ఈ భవన నిర్మాణం కీలకం కావడంతో త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే గడిచిన 8 నెలలుగా పనులు నిర్విరామంగా సాగాయి. ప్రతి రోజూ 500 మందికిపైగా కార్మికులు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు నిరాటంకంగా పనిచేసి ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఇకపై అమరావతి నుంచే కార్యకలాపాలు

ప్రస్తుతం విజయవాడ నుంచి సీఆర్‌డీఏ కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఈ భవనం ప్రారంభమయ్యాక ఆ కార్యాలయం అమరావతికి మారనుంది. ఈ కార్యాలయంలో గ్రౌండ్ ఫ్లోర్లో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఉంటుంది. మిగిలిన అంతస్తుల్లో పురపాలకశాఖ మంత్రి చాంబర్, సీఆర్డీఏ కమిషనర్ చాంబర్, పరిపాలనా విభాగం, ఇంజనీరింగ్ విభాగం, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏడీసీఎల్) కార్యాలయం, రాజధాని అమరావతి ప్రణాళికా విభాగం, రాష్ట్ర పురపాలక శాఖ ప్రత్యేక విభాగం ఉంటాయని అధికారులు చెప్పారు. అధికారుల కోసం విడివిడిగా ప్రత్యేక చాంబర్లు, రెండు, మూడు అంతస్తుల్లో సమావేశ మందిరాలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు భవనం పైభాగంలో ఉద్యోగుల రిక్రియేషన్ కోసం జిమ్ సెంటర్, క్యాంటీన్ వంటి ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.

ఈ 3, ఎన్ 11 జంక్షన్లో కార్యాలయం

సీఆర్డీఏ కార్యాలయ భవనం రాజధాని గ్రామమైన లింగాయపాలెం సరిహద్దుల్లో ఉంటుంది. రాజధాని రవాణా వ్యవస్థలో కీలకమైన సీడ్ యాక్సిస్ రోడ్డు(ఈ-3), ఎన్ 11 రోడ్ల జంక్షన్లో మొత్తం 4.32 ఎకరాల విస్తీర్ణంలో ఈ భవనాన్ని నిర్మించారు. ప్రధాన కార్యాలయ భవనాన్ని 0.73 ఎకరాల్లో నిర్మించారు. గ్రీన్ జోన్ కింద 0.88 ఎకరాలు, పార్కింగ్ కోసం 1.36 ఎకరాలు కేటాయించారు. ఇందులో 176 కార్లు, 176 ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసే అవకాశం ఉంటుంది. 0.96 ఎకరాలు ఖాళీ స్థలం కింద ఉంచారు. ఏసీ, పవర్ ఎస్టీపీల కోసం 0.39 ఎకరాలు వినియోగించారు. వీటితో అదనంగా 3.07 ఎకరాల్లో ఒక్కోటి 41,500 చ.అ. విస్తీర్ణం ఉన్న 4 ప్రీ ఇంజనీర్డ్ బిల్డింగ్స్(పీఈబీ) నిర్మాణాలను చేపట్టారు.

సీఆర్డీఏ భవన ప్రత్యేకతలు

- 2017లో నిర్మాణం ప్రారంభం
- 2025 అక్టోబరు 13న ప్రారంభోత్సవం
- భవనం లొకేషన్.. సీడ్ యాక్సిస్ రోడ్డు, ఎన్ 11 రోడ్డు జంక్షన్
- జీ ప్లస్ 7 అంతస్తులో భవనం నిర్మాణం
- 0.88 ఎకరాలు గ్రీనరీ జోన్
- గ్రీన్ బిల్డింగ్ సర్టిఫికేషన్ రావడం మరో ప్రత్యేకత
- 44 శాతం విద్యుత్, 66% నీటి పొదుపు చర్యలు

పెట్టుబడుల ధమాకా!

(మొదటి పేజీ తరువాయి)

మన రాష్ట్రానికి విశాఖపట్నం, అమరావతి, తిరుపతి మూడు ఎకనామిక్ హబ్‌లు ఉన్నాయని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఈ మూడు హబ్‌లను సద్వినియోగం చేసుకుంటూ పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో పెట్టుబడులు ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని మంత్రులు, ఉన్నతాధికారులకు సూచించారు. రాష్ట్రంలోని మూడు ఎకనామిక్ కారిడార్‌లనూ గ్రోత్ హబ్‌లుగా వినియోగించుకోవాలన్నారు. క్వాంటం వ్యాలీ తరహాలోనే రాష్ట్రానికి వస్తున్న డేటా సెంటర్లు.. టెక్నాలజీ రంగంలో కీలక మలుపుగా అభివర్ణించారు. విశాఖ పారిశ్రామికాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఎకనామిక్ కారిడార్ తరహాలోనే రాయలసీమలోనూ ప్రత్యేక కారిడార్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ ఈ భేటీలో ప్రతిపాదించారు. మూడు ప్రాంతాలనూ పారిశ్రామిక జోన్లుగా విభజించి అభివృద్ధి చేయాలన్నారు. ఈ సూచనలతో ముఖ్యమంత్రి ఏకీభవించారు. విశాఖ కేంద్రంగా శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరి దాకా విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అమరావతి కేంద్రంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ప్రకాశం జిల్లా వరకూ మరో ఎకనామిక్ రీజియన్, తిరుపతి కేంద్రంగా నెల్లూరు, రాయలసీమ జిల్లాలతో మరో జోన్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఆగ్రోప్రాసెసింగ్ హబ్‌గా సీమ

రాయలసీమలో ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, డ్రోన్ సిటీ, ఆటోమొబైల్ రంగ కారిడార్లు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. వీటితో పాటు ఉద్యాన పంటలకు కేంద్రంగా రాయలసీమ ఆగ్రోప్రాసెసింగ్ హబ్‌గా మారుతుందన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లును అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతంగా తయారు చేయాలని.. దీనికోసం ల్యాండ్ బ్యాంకును ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



ఎస్ఐపీబీ సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రులు అచ్చెన్న, లోకేశ్, భరత్, నారాయణ తదితరులు

రంగాలవారీగా ఆమోదించిన పెట్టుబడులివీ..

- విశాఖలో గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫో టెక్ ఆధ్వర్యంలో కృత్రిమ మేథ డేటా సెంటర్ ఏర్పాటుకు ఆమోదం. రూ.87,520 కోట్ల పెట్టుబడితో 200 మందికి ఉద్యోగావకాశాలు. రైడెన్ ఇన్ఫోటెక్ సంస్థకు సబ్సిడీ ధరకు విశాఖలో భూమి. ఆర్థిక, ఆర్థికేతర ప్రోత్సాహకాలను అందించేందుకు ఆమోదం.
- రాష్ట్రంలో ఏఐలో శిక్షణ కేంద్రం ఏర్పాటుకు రూ.140 కోట్ల పెట్టుబడితో ఇమేజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌కు ఆమోదం. దీనిద్వారా 3,600 మందికి ఉద్యోగాలు.
- ఇంధన రంగంలో రూ.16,920 కోట్ల పెట్టుబడులకు పచ్చజెండా. ఇందులో అనంతపురంలో రూ.2,000 కోట్ల పెట్టుబడులతో 400 మెగావాట్ల ఏసీ/580 మెగావాట్ల డీసీ, 800 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ నెలకొల్పేందుకు ఆక్మే ఊర్జా వన్ సంస్థ చేసిన ప్రతిపాదనలకు ఆమోదం. 1,380 మందికి ఉద్యోగాలు. ఇదే జిల్లాలో రూ.2 వేల కోట్ల పెట్టుబడితో టాటా పవర్ రెన్యువబుల్స్ ఎనర్జీ లిమిటెడ్ 400 మెగావాట్ల ఏసీ, 560 మెగావాట్ల డీసీ సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఆమోదం, 1,380 మందికి ఉద్యోగాలు. విజయనగరంలో రూ.12,905 కోట్లతో దుగ్గేరు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు ఏర్పాటుకు చింతా గ్రీన్ఎనర్జీకి అనుమతి.ఆంపిన్ ఎనర్జీ ట్రాన్సిసన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలోరూ.15.10 కోట్లతో కర్నూలు, నంద్యాలలో 2.30 మెగావాట్లతో సోలార్, విండ్ పవర్ ప్లాంటు ఏర్పాటుకు ఆమోదం.
- ఫుడ్‌ప్రాసెసింగ్ రంగంలో రూ.1,200 కోట్ల పెట్టుబడులకు సమ్మతి.. రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ 2024-29 ఫుడ్‌ప్రాసెసింగ్ పాలసీ మేరకు ఆహార తయారీ ఉత్పత్తులను అందించేందుకు చేసిన ప్రతిపాదనలకు ఆమోదం. రూ.758 కోట్ల పెట్టుబడితో 500 మందికి ఉద్యోగాలను కల్పిస్తారు. ప్యాకేజ్డ్ ఫుడ్ తయారీ-విక్రయాల్లో రూ.208 కోట్ల పెట్టుబడికి గోద్రెజ్ ఆగ్రోవెట్‌కు గ్రీన్‌సిగ్నల్. సోయా ఉత్పత్తుల తయారీకి రూ.201 కోట్లతో ఎస్‌వీఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్ చేసిన పెట్టుబడి ప్రతిపాదనకు ఆమోదం. అలాగే ఆహార ఉత్పత్తుల తయారీకి రూ.33 కోట్లతో ఫ్రెష్ బౌల్ హార్టికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్ చేసిన ప్రతిపాదనకూ ఆమోదం.
- పర్యాటకంలో రూ.858 కోట్ల పెట్టుబడి.. 1098 మంది ఉద్యోగావకాశాలు. ఇందులో మెస్సర్స్ దసపల్లా అమరావతి హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ అమరావతిలో రూ.200 కోట్ల పెట్టుబడులతో నిర్మించే హోటల్ నిర్మాణానికి ఆమోదం. అరకు లోయలో రూ.55 కోట్లతో వీఎస్‌కే హోటల్స్, రిసార్ట్స్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్. శ్రీకాకుళంలో రూ.83 కోట్ల పెట్టుబడితో లాడ్జి హోటల్ నిర్మాణానికి శ్రీవేంకటేశ్వర లాడ్జ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఆమోదం. అమరావతిలో మెస్సర్స్ సదరన్ గ్లోబ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.177 కోట్లతో హోటల్ నిర్మాణానికి అనుమతి.
- పారిశ్రామిక రంగంలో రూ.5,800 కోట్ల పెట్టుబడులు.. వీటితో 6,646 మందికి ఉపాధి కల్పించే ప్రతిపాదనలకు ఆమోదం.

అంబేడ్కర్ విగ్రహంతో వైసీపీ నీచరాజకీయం: వర్ల



అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎన్నుకున్న కూటమి ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు జగన్ కుట్రలు చేస్తున్నారని, అంబేడ్కర్ విగ్రహాలను ధ్వంసం చేస్తూ నీచ రాజకీయాలకు తెరదీస్తున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దళితులపై జగన్‌కు ఎలాంటి ప్రేమ లేదన్నారు. వారిని అడ్డం పెట్టుకుని అందలం ఎక్కడమే జగన్ లక్ష్యమని దుయ్యబట్టారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో దళితులు ప్రశాంతంగా ఉన్నారని, వారిని రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని జగన్ చూస్తున్నాడని విమర్శించారు.

మెడికల్ కాలేజీలపై చర్చకు సిద్ధమా జగన్?

- అసెంబ్లీ లేదా మీ సొంత టీవీ లైవ్‌లో: బీజేపీ సవాల్

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): 'మీరు దురుద్దేశపూర్వకంగా బురద జల్లుతున్న మెడికల్ కాలేజీల అంశంపై అసెంబ్లీ లేదా మీ సొంత టీవీ సాక్షిలో లైవ్ డిబేట్‌కు సిద్ధమా?' అని రాష్ట్ర బీజేపీ.. మాజీ సీఎం జగన్‌కు సవాలు విసిరింది. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ బుధవారం మీడియాతో మాట్లాడారు. వైద్య కళాశాలల్ని వైసీపీ ప్రభుత్వం ఎలా నిర్వీర్యం చేసిందో.. కూటమి ప్రభుత్వం విద్యార్థులకు మంచి జరిగేలా ఎలాంటి చర్యలు చేపడుతోందో వైసీపీకి బలమున్న శాసనమండలిలో వివరిస్తే ఎందుకు పారిపోయారని నిలదీశారు. ఇప్పటికైనా మించి పోయింది లేదని, బురద రాజకీయాలు మానుకుని ప్రజలకు వాస్తవాలు చెబితే ఆ పదకొండైనా వచ్చే ఎన్నికల్లో మిగులుతాయని హితవు పలికారు.

సమస్యలపై చర్చించి పరిష్కరించుకుందాం

- ఇక ఫలితాలపై దృష్టి పెడదాం: ఉపాధ్యాయులతో మంత్రి లోకేశ్

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, చర్చించుకుని సమస్యలు పరిష్కరించుకుందామని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ టీచర్లతో అన్నారు. బుధవారం ఉండవల్లిలోని నివాసంలో ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, నోబుల్ టీచర్ల సంఘం ప్రతినిధులు, భాషా పండితులతో మంత్రి సమావేశమయ్యారు. పదోన్నతుల సమస్య పరిష్కరించినందుకు భాషా పండితులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ.. సంస్కరణలకాలం ముగిసిందని,ఇక ఫలితాలపై దృష్టిపెడతామని చెప్పారు. .

'ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి' వెబ్‌సైట్‌ను ఆవిష్కరించిన సీఎం

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలో మీడియా అవసరాలు తీర్చేందుకు కూటమి ప్రభుత్వం సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు జర్నలిస్టులకు హామీ ఇచ్చారు. బుధవారం ఆయన 'ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి' వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా.. ప్రెస్ క్లబ్ కోసం స్థలం కేటాయించాల్సిందిగా క్లబ్ ప్రతినిధులు అప్పాజీ, సతీశ్ బాబు, నారాయణ తదితరులు కోరారు. 2018లో ఏర్పాటైన ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి.. రాజధాని నిర్మాణంలో పురోభివృద్ధిని రాష్ట్ర ప్రజలకు తెలియజేయడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

చంద్రన్న -2 డిజిటల్ పుస్తకం ఆవిష్కరణ

టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ రూపొందించిన మన చంద్రన్న -2 డిజిటల్ పుస్తకాన్ని సీఎం చంద్రబాబు బుధవారం ఆవిష్కరించారు. 2024లో సీఎం అయిన తర్వాత చేపట్టిన వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఈ పుస్తకాన్ని రూపొందించారు.

ఏపీలో వ్యాపార కార్యకలాపాలకు 'నల్వా ఏరో' సిద్ధం

- మంత్రి బీసీ జనార్దనరెడ్డితో ప్రతినిధుల భేటీ

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యాపార కార్యకలాపాలను చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని మౌలిక సదుపాయాల కల్పనా శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డికి నల్వా ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతిపాదించింది. దేశంలో తొలి ఐదు సీట్ల విమానానికి డీజీసీఏ నుంచి డిజైన్ ఆపరేషన్‌ను పొందామని ఆ సంస్థ ప్రతినిధులు వివరించారు.

ఎక్స్ అఫీషియో కార్యదర్శిగా హరిజవహర్‌లాల్‌అనర్హుడు

- హైకోర్టులో పిటిషన్.. నోటీసులు జారీ

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎం.హరిజవహర్‌లాల్‌ను రెవెన్యూ(ఎండోమెంట్)శాఖకు ఎక్స్ అఫీషియో కార్యదర్శిగా నియమిస్తూ ఈ ఏడాది సెప్టెంబరు 8న జారీ చేసిన జీవో 1643ను రద్దు చేయాలని కోరుతూ గుంటూరు జిల్లా, చేబ్రోలుకు చెందిన జి.తిరుపతి రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆయనను ఎక్స్ అఫీషియో కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించకుండా నిరోధించాలని కోరారు. సర్వీసులో ఉన్న అధికారిని కార్యదర్శిగా నియమించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మండవ కిరణ్మయి వద్ద ఇటీవల విచారణకు వచ్చింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాధారణ పరిపాలన ముఖ్యకార్యదర్శి, రెవెన్యూ(ఎండోమెంట్)శాఖ ముఖ్య కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ అధికారి హరిజవహర్‌లాల్‌కు న్యాయమూర్తి నోటీసులు జారీ చేశారు. విచారణను వాయిదా వేశారు.

మార్క్‌ఫెడ్ కమిటీ గడువు పెంపు

అమరావతి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ మార్క్‌ఫెడ్ నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 4 వరకు పొడిగిస్తూ ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆ దివ్వెల వెనుక చీకటి!

తయారీ కేంద్రాల్లో బతుకులు బుగ్గి.. దీపావళి సమయంలో తరచూ ప్రమాదాలు

- 'తూర్పు'లో ఏటా 40 మంది మృత్యువాత
- మహిళలు, పిల్లలను పనిలో పెట్టుకోరాదు..
- కానీ, ప్రమాదాల్లో అధికంగా చనిపోతుంది వారే..
- రాష్ట్రంలో 80% బాణసంచా తయారీ గోదావరి జిల్లాల్లోనే
- ఏటా రూ.350 కోట్లకుపైగా టర్నోవర్
- అనధికార తయారీ కేంద్రాలే అత్యధికం
- అధికారులకు మామూళ్లు ఇచ్చి సర్దుబాటు



కాలిపోయిన బాణసంచా

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

బాణసంచా తయారీ కేంద్రాలు మృత్యుఘంటికలు మోగిస్తున్నాయి. ఏడాది మొత్తం బాణసంచా పెద్దఎత్తున తయారవుతూ ఉండటంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. ముఖ్యంగా దీపావళి సమయంలో రూ. కోట్లలో వచ్చే ఆర్డర్ల కోసం తయారీదారులు తక్కువ కూలీ ఇచ్చి మహిళలు, పిల్లలను పనిలో పెట్టుకుంటున్నారు. ఏమాత్రం నైపుణ్యం లేక చేసే తప్పిదాలతో అనేక మంది దుర్మరణం పాలవుతున్నారు. రాష్ట్రం మొత్తంమీద ఎనభై శాతం మందుగుండు తయారీ ఒక్క ఈ జిల్లాలోనే జరుగుతోంది. కొమరిపాలెం... వేట్లపాలెం... ద్రాక్షారామం... గొల్లప్రోలు.. పెదపూడి మందుగుండు తయారీ అడ్డాలు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ వివాహాలు, రాజకీయ సభలు, కార్యక్రమాలు, జాతర్లు, తీర్థాలు, పండగలు జరిగినాఇక్కడి నుంచి సరుకు వెళ్లాల్సిందే. మల్లిపందిరి, రన్నింగ్ బాల్, ఈతచెట్టు, విషసర్పం తదితర మందుగుండు పేలుడు ప్రదర్శనల్లో తూర్పుగోదావరి బాణసంచాయే ప్రధాన ఆకర్షణ. పెద్దాపురం నియోజకవర్గంలోని సామర్లకోట మండలం వేట్లపాలెంలో ఏటా రూ.60కోట్లకుపైగా విలువైన మందుగుండు తయారవుతోంది బుధవారం బాణసంచా ప్రమాదం జరిగి ఏడుగురు దుర్మరణం పాలైన రాయవరం, ఆ పక్కనే అనపర్తి, మండపేట నియోజకవర్గాల్లోని అనేక గ్రామాల్లో తయారీ పరిశ్రమలు నడుస్తున్నాయి. ఈ పరిశ్రమ వార్షిక టర్నోవర్ రూ.250కోట్లపైనే. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం, కడియద్ద, వేల్పూరు.. మీనానగరం కేంద్రాల టర్నోవర్ కూడా కలిపితే వ్యాపారం రూ.350కోట్లు దాటుతుంది.

ఈ మోత గోదావరిలోనే ఎందుకు?

మందుగుండు తయారుచేసే కొన్ని కుటుంబాలు దాదాపు వందేళ్ల నుంచీ ఇదే వ్యాపారంలో ఉన్నాయి. గోదావరి జిల్లాల్లోనే ఈ పరిశ్రమ ఎదగడానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి.. మందుగుండు భారీ వినియోగం గోదావరి జిల్లాలో ఉంది. ఇక్కడ పెళ్లి వేడుక జరిగిందంటే గంట నుంచి రెండు గంటలపాటు మందుగుండు మోతెక్కి పోవాల్సిందే. అలాగే తరచూ ఈ జిల్లాలో పండగలు, జాతర్లు, తీర్థాలు జరుగుతుంటాయి. రాజకీయ సభలు, కార్యక్రమాలు, ర్యాలీల్లోను వీటి వినియోగం అధికం. మందుగుండు తయారీ కేంద్రాలకు నీటి లభ్యత అవసరం కావడం రెండో కారణం. వేట్లపాలెంలోని ఐదు బాణసంచా తయారీ పరిశ్రమలూ గోదావరి కాలువకు సమీపంలోనే ఉన్నాయి. గొల్లప్రోలు తయారీ కేంద్రం సుద్దగడ్డ కాలువకు సమీపంలో ఉంది.

ఇదే కేంద్రంలో 35 ఏళ్ల క్రితం ప్రమాదం

రాయవరం బాణసంచా తయారీ కేంద్రంలో సరిగ్గా 35 ఏళ్ల కిందట ఇదే తరహా విస్ఫోటనం జరిగింది. అప్పట్లో భారీగా ప్రాణనష్టం చోటుచేసుకుంది. ఏటా 40 మంది ఇదే తరహాలో మరణిస్తున్నారు. నిజానికి, బాణసంచా తయారీ కేంద్రాల్లో అనుమతులు లేనివే అధికం. పిల్లలు, మహిళలు పనిచేస్తున్నారా అనేది..చెక్ చేసే బాధ్యత కార్మికశాఖది. కానీ, పట్టించుకోరు. పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక అధికారులకు ఓనర్లు మామూళ్లు ఇస్తూ సర్దుబాటు చేసుకుంటున్నారు. లొసుగులు బయటపడకుండా ప్రభుత్వ యంత్రాంగంలో పై నుంచి కింది దాకా టపాసుల గిఫ్ట్ ప్యాక్‌లు అందిస్తున్నారు.

ఏదీ అప్రమత్తత?

- బాణసంచా తయారు కేంద్రాల్లో నైపుణ్యం కలిగిన కార్మికులనే నియమించాలి. అయితే, వారికి అధిక వేతనాలు ఇవ్వాల్సి వస్తుందనే కారణంగా మామూలు కూలీలతో పనులు చేయిస్తున్నాయి.
- మందుగుండు తయారీలో నిర్దిష్ట దూరం పాటించాలి. చేతికి గ్లౌజులు వేసుకోవాలి. కానీ ఇదేదీ అమలు కావు.
- దీపావళి సీజన్‌లో నిర్వాహకులు రెట్టింపుస్థాయిలో బాణసంచా తయారు చేస్తున్నారు. ఈ క్రమంలో ఏమాత్రం కనీస పరిజ్ఞానం లేని కార్మికులను డంప్ చేసేస్తున్నారు.
- మహిళలు, పిల్లలను బాణసంచా తయారీకి వినియోగించరాదని నిబంధన ఉంది. కానీ, తక్కువ కూలీకి వస్తారనే కారణంగా వీరినే యజమానులు పనికి పెట్టుకుంటున్నారు.
- మందుగుండు తయారీ కేంద్రాల్లో పనిచేస్తున్న కూలీలకు బీమా సదుపాయం కల్పించాలని 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ అనేక కంపెనీలు ఇప్పటికీ దీన్ని అమలు చేయడం లేదు.





ఎగసిపడుతున్న దట్టమైన పొగ, మంటలు, ఘటనాస్థలిని పరిశీలిస్తున్న హోంమంత్రి అనిత

బాణసంచా పేలుడుకు

ఏడుగురు బలి

(మొదటి పేజీ తరువాయి)

తానే దగ్గరుండి పనులు చేయిస్తున్న యజమాని సైతం ఈ ప్రమాదంలో మృత్యువాతపడ్డారు. మృతుల్లో నలుగురు మహిళలు ఉన్నారు. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. విస్ఫోటనం ధాటికి తయారీ కేంద్రంలోని గోడ కూలిపోయింది. పేలుడు తీవ్రతకు సమీపంలోని గృహాలు కంపించిపోయాయి. వివరాల్లోకి వెళితే.. రాయవరం శివారు ప్రాంతంలో తొమ్మిది దశాబ్దాలుగా శ్రీలక్ష్మీగణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్ పేరుతో బాణసంచా తయారీ కేంద్రం నడుస్తోంది. వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలకు సైతం ఇక్కడి నుంచి దీపావళి సామగ్రి తరలిస్తుంటారు. ఎప్పుడూ 40 మందికి పైగానే కూలీలు పనిచేస్తుంటారు. అయితే, మధ్యాహ్నం భోజన విరామ సమయం కావడంతో చాలామంది భోజనానికి వెళ్లారు. దీంతో భారీగా ప్రాణనష్టం తప్పింది. యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి అలియాస్ సత్తిబాబు పర్యవేక్షణలో ప్రమాద సమయంలో ఏడుగురు పని చేస్తున్నారు.

బాధాకరం: ప్రధాని

న్యూఢిల్లీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలో బాణసంచా ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. "బాణసంచా తయారుచేస్తుండగా జరిగిన ప్రమాదంలో ప్రాణనష్టం చోటుచేసుకోవడం బాధించింది. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలి" అని 'ఎక్స్'లో ఆకాంక్షించారు.

ప్రమాదంపై భిన్న కథనాలు..

ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. చిచ్చుబుడ్డు తయారుచేసి శాంపిల్‌గా దానిని వెలిగించారు. అది మండిన వెంటనే నిప్పురవ్వలు ఎగిసిపడ్డాయి. తయారీ కేంద్రంలోనే స్టాకు పాయింట్ కూడా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. చూస్తుండగానే తయారీ కేంద్రంలో భారీ విస్ఫోటనం చోటుచేసుకుంది. మంటలు అలుముకోగానే.. లోపలకు వెళ్లి సరుకును బయటకు తీసుకువచ్చేందుకు చేసే ప్రయత్నంలో సత్తిబాబు సజీవ దహనమైనట్టు సమాచారం. కాగా, ప్రమాదంపై పోలీసుల కథనం భిన్నంగా ఉంది. చిచ్చుబుడ్డి తయారీ కోసం మందు కూరుతుండగా ఒక్కసారిగా నిప్పురవ్వలు ఎగసిపడ్డాయని ఏలూరు రేంజ్ డీఐజీ అశోకుమార్ తెలిపారు. కాగా, మృతులను సోమేశ్వరం గ్రామానికి చెందిన పాకా అరుణ (33), అనపర్తి సావరానికి చెందిన చిట్టూరి శ్యామల (38), కుడుపూడి జ్యోతి (38), అనపర్తి గ్రామానికి చెందిన పెంకే శేషారత్నం(35), ఒడిశాకు చెందిన కె.సదానందం (50)గా వీరిని గుర్తించారు. బిక్కవోలు మండలం కొమరిపాలేనికి చెందిన పట్నూరి వెంకటరమణ (50) కాకినాడలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు

వంటిపై గుర్తుల ఆధారంగా..

మృతదేహాలు గుర్తుపట్టలేనివిధంగా కాలి బూడదయ్యాయి. దీంతో వంటిపై గుర్తుల ఆధారంగా మృతదేహాలను గుర్తించాల్సి వచ్చింది. చేతికి ఉన్న ఉంగరం ఆధారంగా యజమాని సత్తిబాబు మృతదేహాన్ని గుర్తించారు. కాగా, తీవ్రంగా గాయపడిన నలుగురికి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఒకరిద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని సమాచారం. విస్ఫోటనానికి కారణాలను విశ్లేషించేందుకు అమరావతి నుంచి ఫోరెన్సిక్ సైన్స్ నిపుణుల బృందం వస్తోందని కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా తెలిపారు.

పరిస్థితి సమీక్షించిన హోం మంత్రి

బాణసంచా పేలుడు సమాచారం తెలిసిన వెంటనే హోంమంత్రి వంగలపూడి అనిత ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అధికారులతో కలిసి సమీక్షించారు. మొత్తం ఘటనపై విచారణ జరిపిస్తామని తెలిపారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని సీఎం ఆదేశించారని తెలిపారు.15రోజుల కిందటే సిబ్బంది ఈ కేంద్రంలో తనిఖీలుచేసి సంతృప్తి వ్యక్తంచేశారన్నారు.

చర్యలు చేపట్టాలి : పవన్ కల్యాణ్

బాణసంచా పేలుడు ప్రమాదంపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందేలా చూడాలని సూచించారు. బాణసంచా కేంద్రాల్లో, గోదాముల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు అమలయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.